గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



అమెరికా దిగ్బంధం నడుమ
అద్భుత దేశం క్యూబా 04

సంపుటి 27, సంచిక: 297 | శుక్రవారం | 18-04-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00



శ్రీరసాగర్ రావుల పశ్యపద్మ

## ఎఐకెఎస్ జాతీయ కమిటీ ఎన్నిక 03

- అధ్యక్షులుగా శ్రీరసాగర్, ప్రధాన కార్యదర్శిగా రావుల వెంకయ్య, జాతీయ కార్యదర్శిగా పశ్యపద్మ



05

## బెంగాల్ టీచర్లకు స్వల్ప ఊరట

- నూతన నియామకాలు చేపట్టేవరకూ ఉద్యోగాల్లో కొనసాగడానికి 'సుప్రీం' గ్రీన్ సిగ్నల్
- మే 31 నాటికి కొత్త నియామకాలు చేపట్టాలని ప్రభుత్వానికి ఆదేశం

## 'నరేగా' కార్మికుల అణచివేత

- మోదీ ప్రభుత్వం పేదల వ్యతిరేకి : ఖర్గే 05

# రూ.1000 కోట్ల పెట్టుబడులు

- తెలంగాణలో పెట్టేందుకు ముందుకొచ్చిన జపాన్ వ్యాపార దిగ్గజం మారుబెనీ
- హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్ట్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంసిద్ధత
- 600 ఎకరాల్లో ప్రపంచస్థాయి, నెక్ట్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి ప్రతిపాదనలు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 30వేల ఉద్యోగాలు
- టోక్యోలో మారుబెనీ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బృందం జపాన్ పర్యటనలో తొలి రోజునే కీలకమైన పెట్టుబడుల ఒప్పందం కుదుర్చుకుంది. జపాన్‌కు చెందిన వ్యాపార దిగ్గజం మారుబెనీ కంపెనీ తెలంగాణలో దాదాపు రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్ట్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు మారుబేనీ కంపెనీ సంసిద్ధత తెలిపింది. టోక్యోలో ఆ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై చర్చించారు. దాదాపు రూ.1,000 కోట్ల ప్రారంభ పెట్టుబడితో మారుబెనీ కంపెనీ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. దశల వారీగా ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో ప్రపంచ స్థాయి, నెక్ట్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసుకుంది. అందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ తరువాయి 2లో

## వక్ఫ్ చట్టంపై సమాధానానికి వారం గడువు

- కేంద్ర ప్రభుత్వం అభ్యర్థనకు సుప్రీంకోర్టు అంగీకారం
- వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని కేంద్రం హామీ
- తదుపరి విచారణ మే 5కు వాయిదా




**న్యూఢిల్లీ :** వక్ఫ్ (సవరణ) చట్టం2025 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను గురువారం సుప్రీంకోర్టు విచారించింది. దీనిపై మొత్తం 72 పిటిషన్లు దాఖలయ్యాయి. వక్ఫ్ చట్టంపై సమాధానం ఇచ్చేందుకు కేంద్రం 7 రోజుల గడువు ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరగా, ఆ అభ్యర్థనను అంగీకరించింది. తదుపరి విచారణ తేదీ మే 5 వరకూ సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, బోర్డులలో ముస్లిమేతరులను ఎవరినీ నియమించబోమని, వక్ఫ్ ఆస్తులను కూడా డీనోటిఫై చేయమని కేంద్రం సుప్రీంకోర్టు సూచనలపై తన హామీఇచ్చింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ వక్ఫ్ (సవరణ) చట్టం2025 పార్లమెంట్ చర్చల ద్వారానే ఆమోదించబడిందని, ప్రభుత్వం వివరణ వినకుండా దానిని నిలిపివేయకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా, తరువాయి 2లో

## ఆర్థిక సాయం అందించండి

- జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీకి తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం విజ్ఞప్తి
- మెట్రో రైల్ రెండోదశ, మూసీ పునరుజ్జీవనం, ట్రిపుల్ ఆర్, ఒఆర్ఆర్ రేడియల్ రోడ్లకు రుణాలు ఇవ్వాలని వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెట్రో రైలు రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు నుంచి అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానించే రేడియల్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని జైకాను కోరింది. జపాన్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గురువారం జపాన్ తరువాయి 2లో

## 450 ఎకరాల్లో ఐటి నాలెడ్జ్ హబ్

- హైదరాబాద్‌లోని పుప్పాలగూడ పరిసరాల్లో ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రుల ఆదేశం
- ఐదులక్షల మంది యువతకు ఉపాధికి అవకాశం
- పుప్పాలగూడ భూములు, తాజా పరిస్థితిపై ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి సమీక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్
పుప్పాలగూడ పరిసరాల్లో సుమారు 450 ఎకరాల్లో మొదటి దశలో ఐటి నాలెడ్జ్ హబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తద్వారా ఐదు లక్షల మంది యువతకు ఉపాధి లభిస్తుందని అభిప్రాయపడ్డారు. పుప్పాలగూడ, తదితర అంశాలపై హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పరిశ్రమల, రెవెన్యూ శాఖ అధికారులతో గురువారం తరువాయి 2లో

## ప్రాణం తీసిన ఈత సరదా

దమ్మాయిగూడెం వద్ద మున్నేరులో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్
ఈత సరదా ప్రాణాలు తీసింది. ఇంట్లో క్రికెట్ ఆటకని చెప్పి ఇద్దరు బాలురు ఈతకు వెళ్లి అనంతలోకాలకు వెళ్లిన ఘటన ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఖమ్మం నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలోని డాబాలబజార్‌కు చెందిన అన్నం సుబ్బారావు కుమారుడు అన్నం కిరణ్‌తేజ (14), గుట్టలబజార్ వాటర్ ట్యాంక్ ప్రాంతానికి చెందిన కూచిపూడి మధుకృష్ణ తరువాయి 2లో




## ఇద్దరు పిల్లలను నరికి పై నుంచి దూకి

- తల్లి ఆత్మహత్య
- మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు సూసైడ్ నోట్
- మేడ్చల్ జిల్లా గాజుల రామరంలో దుర్ఘటన

ప్రజాపక్షం/దుండిగల్
మేడ్చెల్ జిల్లా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గాజులరామరం బాలాజీ లేఔట్ సహస్ర మహేష్ హైట్స్ అనే అపార్ట్మెంట్ లో నివాసం ఉండే తేజ అనే మహిళ (35) తన ఇద్దరు పిల్లలను కొబ్బరిబోండా కత్తితో నరికి, అనంతరం అపార్ట్మెంట్ బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్థానికులను, పోలీసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. సాయంత్రం 4 గంటల సమయంలో జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందడంతో, ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, ఎసిపి బాలానగర్, డిసిపి బాలానగర్ ఘటనా స్థలానికి తరువాయి 2లో



## హెచ్‌ఆర్‌సి చైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్ బాధ్యతల స్వీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్
తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సి) చైర్మన్‌గా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నాంపల్లిలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు తరువాయి 2లో

# కుల గణనను అడ్డుకునేందుకే

- సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను చూసి భయపడుతున్నారు
- అందుకే వారిపై అక్రమ కేసులు
- కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకపోతున్నారు
- పార్టీని అప్రతిష్ఠపాలు చేసేందుకు బిజెపి ప్రభుత్వం యత్నం
- ఇడి చర్యలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నా

ప్రజాపక్షం / హైదరాబాద్
దేశంలో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను, దేశవ్యాప్తంగా కులగణనను అడ్డుకోవడానికి, కాంగ్రెస్‌ను అప్రతిష్ట పాలు చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సోనియాగాంధీ, రాహుల్ గాంధీల పై అక్రమ కేసులు పెడుతున్నారని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాహుల్, సోనియాగాంధీలను చూసి ప్రధాని మోదీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భయపడుతున్నదన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఛార్జ్‌షీట్‌లో ఎఐసిసి అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చేర్చడాన్ని నిరసిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, కార్యదర్శి తరువాయి 2లో




## భూముల అమ్మకాలపై మేము చర్చకు సిద్ధం

- కెటిఆర్ సిద్ధమా అని టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ సవాల్
- సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా కెటిఆర్, హరీశ్‌రావులు ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని ఫైర్



ప్రజాపక్షం/హైదరాబాద్
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌యుసి), గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన భూముల అమ్మకాలపై తాము చర్చకు సిద్ధమని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ తరువాయి 12లో

## గ్రూప్-1 నియామక ప్రక్రియపై స్టేకు హైకోర్టు నో

- ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగించవచ్చని సూచన
- విచారణ పూర్తయ్యే వరకూ ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు ఇవ్వొద్దని ఆదేశం

**హైదరాబాద్ :** తెలంగాణలో నిర్వహించిన గ్రూప్–1 నియామక ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగించవచ్చని తెలిపింది. అయితే, విచారణ పూర్తయ్యే వరకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వొద్దని టిజిపిఎస్‌సిని ఆదేశించింది. ఇటీవల వెల్లడించిన గ్రూప్–1 జనరల్ ర్యాంకింగ్‌ను సవాల్ చేస్తూ తరువాయి 2లో

## భూదాన్ యజ్ఞ బోర్డు ఏర్పాటుకు తక్షణం చర్యలు

- తెలంగాణ, ఎపి రాష్ట్రాలకు పలువురు వక్తలు విజ్ఞప్తి
- నిరుపేదలకు భూదాన్ భూములు పంచేందుకు ప్రభుత్వాలు చొరవతీసుకోవాలని రౌండ్‌టేబుల్ వినతి

ప్రజాపక్షం / హైదరాబాద్
భూదాన్ యజ్ఞ బోర్డు ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు తెలంగాణ, ఎపి రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. భూదాన్ భూములను గెజిట్ ఆధారాలతో సహా భూదాన్ యజ్ఞ బోర్డుకు అప్పగించాలని కోరారు. భూదాన్ భూములను నిరుపేదలకు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. 'ఆచార్య వినోబా బావే' భూదాన్ ఉద్యమానికి 74 ఏళ్లు నిండిన సందర్భంగా ఈ నెల 18 నుంచి ఏడాది పాటు '75వ వసంతాల వజ్రోత్సవాలను' నిర్వహించనున్న నేపథ్యంలో 'అఖిల భారత సర్వోదయ మండల్– తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, అఖిల భారత సర్వోదయ మండల్ జాతీయ అధ్యక్షులు తరువాయి 12లో



## భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి ఉపయోగం

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి
భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి ఎంతగానో ఉపయోగపడుతుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పూడూర్ మండల కేంద్రంలో ని రైతు వేదికలో భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొంగులేటితో పాటు స్పీకర్ ప్రసాద్‌కుమార్, స్థనిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి , జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అ భద్రతా భావానికి తావునీయకుండా జవాబుదారీతనాన్ని పెంచేందుకు భూ భారతి చేపట్టడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం ధరణి తీసుకువచ్చి ప్రజాసమస్యల పరిష్కరంలో విఫలం చెందిందని గ్రహించిన ప్రజల ప్రభుత్వం భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు 2025 ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకురావడం జరిగింది అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు , రిజిస్ట్రేషన్ మ్యుటేషన్ , తరువాయి 12లో





# ప్రపంచం

WORLD NEWS

## పాలస్తినాలో ప్రిజనర్స్ డే:జైలులో యువకుడు మృతి

ఇజ్రాయెల్ జైలులో 20 ఏళ్ళు వయసుగల పాలస్తినా యువకుడు మరణించారు. పాలస్తినా ప్రిజనర్స్ డే సందర్భంగా ఈ ఘటన జరిగింది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 17వ తేదీన పాలస్తినా ప్రజలు ప్రిజనర్స్ డే నిర్వహిస్తారు. మాతృభూమికోసం దశాబ్దాలుగా పాలస్తినా ప్రజలు ఇజ్రాయెల్‌పై పోరాటం చేస్తున్నారు. ఈ పోరాటం సందర్భంగా 1974లో ఏప్రిల్ 17వ తేదీన మొదటిసారి ఒక పాలస్తినా ఖైదీ ఎం.కె.హజాజీ ఇజ్రాయెల్ చెరనుండి బయటపడ్డారు. ఇక అప్పటినుండి పాలస్తీనయన్లు ఏప్రిల్ 17ను ప్రిజనర్స్ డే గా పాటిస్తున్నారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం ఇజ్రాయెల్ జైళ్ళలో 10,000 మంది పాలస్తీనియన్లు ఖైదీలుగా మగ్గుతున్నారు. 400 మంది పిల్లలు కూడా జైల్లో ఉన్నారు. 1967 నుండి పాలస్తీనియన్లు చేస్తున్న పోరాటంలో ఇప్పటి వరకూ 10,00,000 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ అరెస్టు చేస్తూ వచ్చింది.

## 13 మంది విదేశీయులు సహా మయన్మార్‌లో 4,900 మంది ఖైదీల విడుదల





**బ్యాంకాక్ :** మయన్మార్ సైనిక పాలకులు గురువారంనాడు 4,900 మంది ఖైదీలను విడుదల చేశారు. దేశ సంప్రదాయ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వీరందరికీ క్షమాభిక్ష ప్రసాదించినట్లు జుంటా సైనిక ప్రభుత్వం ప్రకటించింది. 13 మంది విదేశీయులను కూడా విడుదల చేశారు. విదేశీయులను వారి వారి స్వదేశాలకు పంపే ఏర్పాట్లు కూడా చేస్తారు. విడుదలైనవారిలో 22 మంది రాజకీయ ఖైదీలు ఉన్నారు. గడచిన శుక్రవారంనాటికి లభించిన గణాంకాల ప్రకారం పదవీచ్యుతురాలైన మయన్మార్ ప్రధానమంత్రి ఆంగ్ సాన్ సూకీ సహా 21,197 మంది రాజకీయఖైదీలు జైళ్ళల్లో మగ్గుతున్నారు. యాంగాన్‌ఇన్‌సెయిన్ జైలు నుండి 19 బస్సులలో విడుదలైన ఖైదీలు బయలుదేరి బాహ్యప్రపంచంలోకి వచ్చారు. బయట గేటు వద్ద వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు విడుదలైన ఖైదీలకు ఘనస్వాగతం పలికారు. వారు గురువారం తెల్లవారుజామునుండే గేటు బయట పడిగాపులు కాశారు. మయన్మార్ జైళ్ళలో దారుణంగా మానవహక్కుల ఉల్లంఘన జరిగిందని స్వతంత్ర వాచ్‌డాగ్ గ్రూపు ఈ సందర్భంగా పేర్కొంది. అధికార మిలిటరీ కౌన్సిల్ అధిపతి సీనియర్ జనరల్ మిన్ ఆంగ్ హ్లేంగ్ 4,893 మంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించారని ఎంఆర్‌టివి తెలియజేసింది. 2021 ఫిబ్రవరి 1వ తేదీన మయన్మార్‌లో సైన్యం మరోసారి తిరగబడి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఆంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూల్చివేసి అధికారాన్ని స్వాధీనం చేసుకుంది. ఐతే ఆ తర్వాత ప్రజాఉద్యమాన్ని సైనికపాలకులు దారుణంగా అణచివేశారు. వేలాదిమందిని హతమార్చారు. దీంతో దేశవ్యాప్తంగా తర్వాత పౌర గ్రూపులు ఆయుధాలు సమకూర్చుకుని సైనికపాలకులతో అంతర్యుద్ధం ప్రారంభించాయి. ప్రస్తుతం దేశంలో అంతర్యుద్ధం కొనసాగుతోంది. గతనెల 28న మయన్మార్‌లో భీకర భూకంపం రావడంతో 3,725 మంది మరణించారు. అపారనష్టం వాటిల్లింది. ఈ దెబ్బకు సైనికపాలకులకు పెద్ద శరాఘాతం తగిలినట్లయింది. భూకంప ప్రాంతాల్లో పునర్నిర్మాణం ప్రారంభిస్తామని సైనికపాలకుడు మిన్ ఆంగ్ హ్లేంగ్ ప్రకటించారు.

## గాజాలో రోజూ 27 మంది పిల్లలు మృతి

### 39వేలమంది అనాథలు : యూనిసెఫ్

**కైరో:** గాజా ఒక మృత్యుకేంద్రంగా మారిందనీ, ఈ యుద్ధప్రాంతంలో ప్రతి రోజూ 27 మంది పిల్లలు దాడుల్లో మరణిస్తున్నారనీ యూనిసెఫ్ (ఐక్యరాజ్య సమితి బాలల విద్యా నిధి)తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. యుద్ధం కారణంగా ఇప్పటివరకూ 39,000 మంది పిల్లలు అనాథలుగా మారారని పేర్కొంది. 2023 అక్టోబరులో యుద్ధం మొదలైనప్పటినుండీ గాజాలో ఇదే పరిస్థితి కొనసాగుతోందని పాలస్తినాలో యూనిసెఫ్ ప్రతినిధి తన తాజా నివేదికలో వెల్లడించారు. గాజాలో 16,000 మందికి అత్యవసర ఆరోగ్య చికిత్సలు చేయించాల్సి ఉందని, వారిని మెరుగైన వైద్యంకోసం మంచిచోటకు తక్షణం తీసుకువెళ్ళాల్సిన అవసరం ఉందనీ, వీరిలో 4000 మంది పిల్లలు కూడా ఉన్నారనీ ఈ నివేదిక పేర్కొంది. ఇజ్రాయెల్ మార్చి 18వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. అప్పటినుండి తిరిగి సైనికదాడులు పునఃప్రారంభించింది. ఈ దాడుల్లో 1600 మంది ఇప్పటివరకూ మరణించారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్, ఖాన్‌యూనిస్ ప్రాంతాల నుండి ప్రజలను బలవంతంగా ఖాళీచేయిస్తున్నారు. ప్రజలు ఖాళీచేసిన ప్రాంతాలను ప్రత్యేక జోన్లుగా ప్రకటించి సైన్యం తనఅధీనంలో ఉంచుకుంటున్నది. ఇటీవల ఈజిప్టుకు ఇజ్రాయెల్ ఒక ప్రతిపాదన చేస్తూ, హమాస్ ఉగ్రవాదులు ఆయుధాలు వదిలిపెట్టాలనీ, వారివద్ద ఉన్న ఇజ్రాయెల్ బందీలలో కనీసం సగంమందినైనా విడుదల చేస్తే 45 రోజులు కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామనీ పేర్కొంది. దీనిని తాము పరిశీలిస్తామని చెప్పిన హమాస్ ఇప్పటివరకూ జవాబు చెప్పలేదు. ఐతే ఆయుధాలు వదిలిపెట్టేందుకు హమాస్ ఉగ్రవాదులు సిద్ధంగా లేరు. కాగా కాల్పులను పునరుద్ధరించినప్పటినుండీ మరో 5,00,000 మంది పాలస్తీనియన్లు నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది.

**ఒకే కుటుంబంలో 10 మంది మృతి**

ఇదిలా ఉండగా, గురువారంనాడు ఇజ్రాయెల్ చేసిన తాజా దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన పదిమంది మరణించారు. మొత్తంగా చూసినప్పుడు 23 మంది పాలస్తీనియన్లు ఈ దాడుల్లో మరణించారు. గడచిన ఆరు వారాలుగా గాజాలోకి ఆహారాన్ని రానివ్వకుండా ఇజ్రాయెల్ దళాలు అడ్డుకుంటున్నాయనీ, దీనివల్ల దుకాణాలు మూతపడ్డాయనీ, నిత్యావసరాలు, మందుల కొరతతో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. దక్షిణ ఖాన్‌యూనిస్‌లో ఇజ్రాయెల్ సైనికులు చేసిన దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు పిల్లలు, నలుగురు మహిళలు, ఒక పురుషుడు మరణించారు.





## ఒక్కరోజులో 165 మంది ఉక్రేన్ సైనికులు మృతి



**మాస్కో :** కుర్స్క్ ప్రాంతంలో జరుగుతున్న యుద్ధంలో గడచిన 24 గంటల్లో 165 మంది ఉక్రేన్ సైనికులు మరణించారు. దీంతో ఈ ప్రాంతంలో యుద్ధం మొదలైనప్పటి నుండీ ఇప్పటివరకూ ఉక్రేన్ 74,780 సైనికులను కోల్పోయిందనీ, 410 యుద్ధట్యాంకులను, 334 పదాతిదళ యుద్ధ వాహనాలను, 2,277 యుద్ధవాహనాలు, 618 ఆర్టిల్లరీ గన్స్, 57 మల్టిపుల్ రాకెట్ లాంచర్లు, సైనికులను మోసుకెళ్ళే మరో 305 వాహనాలను ఉక్రేన్ నష్టపోయిందని రష్యా రక్షణమంత్రిత్వశాఖ గురువారంనాడు ప్రకటించింది. టాస్ వార్తాసంస్థ ఈ విషయం తెలియజేసింది. గడచిన 24 గంటల్లో 165 మంది సైనికులతోపాటు రెండు యుద్ధట్యాంకులు, పదాతిదళ యుద్ధ వాహనాలు, 12 మోటార్ వెహికిల్స్, మూడు ఆర్టిల్లరీగన్స్‌ను ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది. తమ గగనతల రక్షణ వ్యవస్థలు ఆరు ప్రాంతాలలో 71 ఉక్రేన్ డ్రోన్లను రాత్రికిరాత్రే కూల్చేసినట్లు పేర్కొంది. 2024 ఆగస్టులో ఉక్రేన్ ఆకస్మికదాడులు చేసి కుర్స్క్ ప్రాంతంలో కొంతభాగాన్ని తన వశం చేసుకుంది. కానీ ఆ తర్వాత ఆ ప్రాంతాన్ని కోల్పోయింది. కాగా ఆగ్నేయ ఉక్రేన్ నగరం ద్నిప్రోపై రష్యా దళాలు భారీఎత్తున డ్రోన్లతో దాడి చేసింది. ఈ దాడుల్లో 30 మంది మరణించారు. మృతుల్లో ఐదుగురు పిల్లలు ఉన్నారు. డజన్ల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. ఒకవైపు శాంతి ప్రయత్నాలు జరుగుతుండగానే మరోవైపు యుద్ధ దాడులు కూడా ఆగకుండా కొనసాగుతున్నాయి. డ్రోన్లదాడివల్ల పౌరప్రాంతాలలో మౌలిక సదుపాయాలకు అపారనష్టం సంభవించిందని ద్నిప్రోపెట్రోవస్క్ ప్రాంతీయ ప్రభుత్వ యంత్రాంగం పేర్కొంది.

**రష్యన్ కిల్లర్స్‌పై ఒత్తిడి చేయండి:జెలెన్‌స్కీ**

మూడేళ్ళుగా చేస్తున్న యుద్ధాన్ని ఆపేందుకు రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని తన యూరోపియన్ యూనియన్ మిత్రులకు, ప్రపంచదేశాలకు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేశారు. యూరోపియన్ యూనియన్, అమెరికా దేశాల ప్రతినిధులతో ఉక్రేన్ సమస్యపై పారిస్‌లో చర్చలు ప్రారంభంకానున్నాయి. ఉక్రేన్ అధికార ప్రతినిధి పారిస్‌కు బయల్దేరిన సందర్భంగా జెలెన్‌స్కీ మాట్లాడుతూ, ''కిల్లర్ రష్యాపై ప్రపంచ దేశాలు ఒత్తిడి తీసుకురావాలి'' అని కోరారు. పగలూ రాత్రీ తేడా లేకుండా రష్యా మమ్మల్ని చంపుకుతింటోందని ఆయన విమర్శించారు. క్రైస్తవుల పవిత్రదినం పామ్ సండేనాడు సుమీపై జరిగిన దాడిలో 34 మంది మరణించిన తర్వాత జెలెన్‌స్కీ ప్రపంచదేశాలకు పలుసార్లు విజ్ఞప్తులు చేస్తున్నారు.

## పాలస్తినా సమస్య పరిష్కారానికి ఖతార్ – రష్యా కృషి



**మాస్కో :** అంతర్జాతీయస్థాయిలో మధ్యవర్తులు కుదిర్చిన ఒప్పందానికి ఇజ్రాయెల్ కట్టుబడటంలేదని ఖతార్ ప్రభుత్వం విమర్శించింది. మాస్కో వెళ్ళిన ఖతార్ రాజు షేక్ తమిమ్ బిన్ హమద్ అల్ థానీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌తో సమావేశం సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. పుతిన్–అల్ థానీ ఇద్దరూ ఇజ్రాయెల్‌లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. పాలస్తినాలో శాంతి సాధనకు ఖతార్–రష్యా ఏకాభిప్రాయంతో ఉన్నాయని నాయకులు ఇద్దరూ అంగీకరించారు. ఇజ్రాయెల్–హమాస్‌మధ్య ఏకాభిప్రాయసాధనకు కృషిచేస్తున్న కీలకమధ్యవర్తిపాత్రలో ఉన్న ఖతార్ రాజు చర్చల సందర్భంగా, కొన్ని నెలల క్రితమే ఒప్పందం చేసుకున్నప్పటికీ దానిని ఇజ్రాయెల్ గౌరవించలేదన్నారు. చాలా నెలలపాటు మధ్యవర్తిత్వం చేసిన తర్వాత ఈ ఏడాది జనవరిలో మూడు దశల కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చినప్పటికీ ఇజ్రాయెల్ దానికి కట్టుబడలేదని బిన్ హమద్ అల్ థానీ విమర్శించారు. ఐతే ఇప్పుడు తాజాగా కాల్పుల విరమణకు అంగీకరించడానికి అత్యంత కఠినమైన షరతులు విధించిందని విమర్శించారు. ఖతార్ దేశం మధ్యవర్తిగా యుద్ధ పరిష్కారానికి ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పాలస్తినా ప్రజలు మరణిస్తూనే ఉన్నారని పుతిన్ ఆవేదన వ్యక్తం చేశారు. వీరిద్దరి సమావేశంలో ద్వైపాక్షిక సహకారం, ఆర్థికఅంశాలు, వాణిజ్యం, మానవతా సంబంధాలను ప్రధానంగా చర్చించారు. ఉక్రేన్‌లో సంక్షోభం, సిరియా, మధ్యాసియాలో యుద్ధ వాతావరణం, చర్చల ప్రతిష్ఠంభన గురించి వారిద్దరూ అభిప్రాయాలు ఇచ్చిపుచ్చుకున్నారు. రష్యాలో ఒక బిలియన్ డాలర్లు ప్రత్యక్ష పెట్టుబడులు సమకూర్చేందుకు ఖతార్ అంగీకరించింది. 2024 జులైలో ఖజకస్థాన్ రాజధాని అస్థానాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా వారిద్దరు కలిశారు.

## అణుసమస్యపై ఇరాన్–అమెరికా రెండో విడత చర్చలు



**దుబాయ్ :** ఇరాన్–అమెరికా ప్రతినిధులమధ్య రోమ్‌లో శనివారం (ఏప్రిల్ 18)న రెండో విడత చర్చలు జరుగుతాయి. ఇరాన్ అధికార ప్రతినిధులు ఈ విషయాన్ని గురువారం నాడు ధృవీకరించారు. ఈ చర్చలకు ఒమన్ దేశం మరోసారి మధ్యవర్తిగా వ్యవహరించనున్నది. ఐతే ఇరాన్ యురేనియం శుద్ధి కార్యక్రమం గురించి ఎలాంటి మాటలకూ చర్చల్లో తావు లేదని ఆ దేశ అగ్రనాయకులు ఇప్పటికే స్పష్టం చేశారు. అణు కార్యక్రమంపై ఒక ఒప్పందం చేసుకోకపోతే ఇరాన్‌పై బాంబులవర్షం కురిపిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే హెచ్చరికలు చేస్తున్న తరుణంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ లాంఛనంగా తమ ఉపాధ్యక్షులలో ఒకరైన మహ్మద్ జావెద్ జారిఫ్ రాజీనామాను ఆమోదించిన నేపథ్యంలో ఈ ధృవీకరణ వచ్చింది. 2015లో అమెరికాతో ఇరాన్ తరపున కీలక అణుఒప్పంద సంప్రదింపులు తరపున చేసిన ఉపాధ్యక్షుడు గతనెలలోనే తన పదవికి రాజీనామా చేశారు. కానీ అధ్యక్షుడు వెంటనే ఈ రాజీనామాను ఆమోదించలేదు. ఇదిలా ఉండగా ఐక్యరాజ్యసమితి తరపున ప్రపంచ అణ్వాయుధ పర్యవేక్షణాధిపతి రాఫెల్ గ్రాస్సీ గురువారంనాడు ఇరాన్ చేరుకుని ఇరాన్ అణుఇంథనసంస్థ అధిపతి మహ్మద్ ఎస్లామీని తో సమావేశమయ్యారు. ఇరాన్–అమెరికామధ్య అణుఒప్పందానికి సంబంధించి ఈ సమావేశం ఎంతో కీలకమైనదని గ్రాస్సీ అన్నారు.

## ఈత సరదా (మొదటి పేజీ తరువాయి)

కుమారుడు బెన్విత్ (14) ఇటీవల పదవ తరగతి పరీక్షలు వ్రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. సెలవులు కావడంతో ప్రతి రోజు ఇంట్లో క్రికెట్ ఆటకని చెప్పి వెళ్లేవారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో ఇరువురు క్రికెట్ ఆడుకునేందుకు వెళ్తున్నామని చెప్పి దానవాయిగూడెం వద్ద గల మున్నేరు వద్దకు ఈతకు వెళ్లారు. మున్నేరులో దిగి ఈతరాక ప్రమాదవశాత్తు మునిగిపోయారు. స్థానికులు గమనించి వారిని కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే మృతిచెందారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఆ ప్రాంతానికి వెళ్లి విఘాతజీవులుగా పడి ఉన్న వారి పిల్లల మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఖమ్మం ఖానాపురం హవేలీ (అర్బన్) సిఐ భానుప్రకాష్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

## బిల్డింగ్ పైనుంచి దూకి (మొదటి పేజీ తరువాయి)

చేరుకున్నారు. పరిశీలనలో స్పాట్‌లోనే తేజ, పెద్ద కుమారుడు హర్షిత్ రెడ్డి (11) మృతి చెందినట్టు గుర్తించారు. చిన్న కుమారుడు ఆశిష్ రెడ్డి (9) ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించగా, తేజ రాసిన ఆరుపేజీల సూసైడ్ నోట్ లభ్యమైంది. అందులో ఆమె తన భర్తపై కొంత కోపంగా ఉన్నట్టు, అలాగే మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్టు లేఖలో పేర్కొన్నది. ఆమె కంటికి సంబంధించి ఆరోగ్య సమస్యలతో పాటు పిల్లల ఆరోగ్య పరిస్థితి కూడా దానికి కారణమని తెలుస్తోంది. తేజ కుటుంబంలో నెలకొన్న మానసిక, వైయక్తిక సమస్యలే ఈ ఘోర ఘటనకు దారితీశాయని పోలీసులు భావిస్తున్నారు. నింధితురాలైన తేజ తాను, పిల్లలను నరికి చంపే స్థితికి ఎలా చేరుకుంది అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ కొనసాగుతోంది. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర ఆవేదనకు దారితీసింది పోలీసులు సమగ్ర విచారణ చేపడుతున్నారు.

## నాలెడ్జ్ హబ్ (మొదటి పేజీ తరువాయి)

సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పుప్పాలగూడ భూములు, తాజా పరిస్థితులపై సమావేశంలో చర్చించారు. పుప్పాలగూడ పరిసరాల్లో ఎంఎల్ఎలు, ఎంపిలు, ఐఎఎస్ అధికారుల కోసం గత ప్రభుత్వం స్థలాలను కేటాయించింది. అలాగే రెవెన్యూ అధికారులు,స్పెషల్ పోలీస్ మ్యూచువల్ కోఆపరేటివ్ సొసైటీ, తదితర సొసైటీలకు సుమారు 200 ఎకరాలకు పైచిలుకు భూమిని ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. అయితే పుప్పాలగూడ పరిధిలో వివిధ సొసైటీలకు కేటాయించిన భూములను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధికారులు మంత్రుల సబ్ కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. సొసైటీలకు కేటాయించిన భూములకు పక్కనే ఇండస్ట్రియల్ కార్పొరేషన్‌కు సంబంధించిన సుమారు 250 ఎకరాల విస్తీర్ణం ఉన్నదని, ఈ రెండు భూములు కలిపితే మొత్తంగా 450 ఎకరాల భూమి ఉంటుందని అధికారులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ 450 ఎకరాల భూమిని ఐటి నాలెడ్జ్ హబ్ అభివృద్ధికి ఉపయోగిస్తే, మొదటి దశలో ఏర్పాటు చేయబోతున్న ఐటి హబ్ ద్వారా ఐదు లక్షల మంది యువతకు ఉపాధి లభిస్తుందని అధికారులు మంత్రుల బృందానికి సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హయాంలో హైటెక్ సిటీకి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత నాలెడ్జ్ హబ్ , ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పడింది. ప్రపంచ వ్యాప్తంగా ఐటి రంగాల్లో వచ్చిన ప్రతి మార్పులలో హైదరాబాద్ భాగస్వామి అయిందని, ఇప్పుడు కూడా ఐటి రంగంలో ఎఐ టెక్నాలజీలో వేగంగా వస్తున్న మార్పును హైదరాబాద్ అందిపుచ్చుకోవాలని మంత్రుల సబ్ కమిటీ నిర్ణయించింది. హైదరాబాద్ ఆర్థిక అభివృద్ధిలో సుస్థిర స్థానాన్ని ఇప్పటికే సాధించిందని, హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకోవడం సాధ్యం కాదని ఆర్థికవేత్తలు స్పష్టం చేసిన విషయాన్ని సమావేశంలో మంత్రులు చర్చించారు. అభివృద్ధిని కొనసాగించే క్రమంలో పుప్పాలగూడలో 450 ఎకరాల్లో నాలెడ్జ్ హబ్‌ను అభివృద్ధి చేస్తూ దశాబ్దాలుగా కొనసాగుతున్న హైదరాబాద్ ప్రగతిని వేగవంతం చేయాలని వారు నిర్ణయించారు.

## వారం గడువు (మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ సంజయ్‌కుమార్, కెవి.విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనానికి విన్నవించారు. కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, బోర్డులలో ముస్లిమేతరులను అనుమతిస్తామనే ప్రతిపాదనను నిలిపివేస్తామనడంతోపాటు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫైపై మధ్యంతర ఉత్తర్వులను జారీచేస్తామంటూ అత్యున్నత న్యాయస్థానం చేసిన ప్రతిపాదనలను కేంద్ర కూడా గట్టిగా వ్యతిరేకించింది. విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా కేంద్ర ప్రభుత్వం తరపున తన స్పందన తెలియజేసేందుకు ఏడు రోజుల గడువు ఇవ్వాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. తదుపరి విచారణ తేదీ మే 5 వరకూ సెక్షన్లు 9, 14 కింద (చట్టంయొక్క) ఎలాంటి అపాయింట్‌మెంట్లు చేయరాదని ధర్మాసనం హెచ్చరించగా అందుకు ఆయన అంగీకంచారు. దీంతో ధర్మాసనం మే 5వ తేదీకి విచారణను వాయిదా వేసింది. తుషార్ మెహ్‌తా మాట్లాడుతూ 'మేం ప్రభుత్వంగానే కాదు. పార్లమెంట్‌గా కూడా ప్రజలకు జవాబుదారీగా ఉన్నాం' అని ధర్మాసనం ముందు చెప్పారు.ప్రభుత్వానికి అనేక ప్రాతినిధ్యాలు అందాయని, దీనిపై చివరికి సవరణ చట్టం వచ్చిందని సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహ్‌తా ధర్మాసనానికి తెలియజేశారు. 'నేను ధర్మాసనం ముందు కొన్ని మెటీరియల్స్ సహా ప్రాథమిక సమాధానాలు, డాక్యుమెంట్లు, చట్టాలకు సంబంధించిన వివరాలు చూపడానికి, సమర్పించడానికి నాకు ఏడు రోజుల గడువు ఇస్తే సరిపోతుంది. ఒక వారంలోగా ఎలాంటి మార్పులు చేయబడవు అని నేనే హామీ ఇస్తున్నాను' అని తుషార్ మెహ్‌తా చెప్పారు. ఓ రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేదీ మాట్లాడుతూ'మధ్యంతర ఉత్తర్వులు ఒక వారం రోజులు దాటితే స్వర్గధామం ఏమీ పడిపోదు' అని అన్నారు. ధర్మాసనానికి సారథ్యం వహించిన సిజెఐ సంజీవ్‌ఖన్నా మాట్లాడుతూ 'మేం మార్పు పరిస్థితిని కోరుకోవడం లేదు. పార్లమెంట్ చట్టాలను చేస్తుంది, ఎగ్జిక్యూటివ్ నిర్ణయాలు అమలు చేస్తుంది. న్యాయవ్యవస్థ అర్థం చేసుకుంటుంది' అని వివరించారు. దాఖలైన 72 పిటిషన్లలో ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాద్‌ఉల్‌ముస్లిమీన్ (ఎఐఎంఐఎం) చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ, సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఎఐఎంపిఎల్ బి), జమైత్ ఉలామాఇ హింద్, ద్రావిడ మున్నేట్ర కజగం (డిఎంకె), ఎయుక్యూఎఫ్ కర్ణాటక స్టేట్ బోర్డ్ మాజీ చైర్మన్ అన్వర్ బాషా తరపున ప్రాతినిధ్యం వహించిన న్యాయవాది తారిఖ్ అహ్మద్, కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, మొహమ్మద్ జావేద్ ఈ వక్ఫ్ చట్టం రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలుచేసిన వారిలో ఉన్నారు.ఈ కేసులో పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్‌సింఘ్వీ, హుజెఫా అహ్మదీ ఉన్నారు.

## అడ్డుకునేందుకే (మొదటి పేజీ తరువాయి)

విశ్వనాధన్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఎంపి అంజన్ కుమార్ యాదవ్, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నాను ఉద్దేశించి భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశంలో కులగణన అడ్డుకోవడానికే సోనియా, రాహుల్ పై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీని చూసి ప్రధాని మోడీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భయపడుతున్నదన్నారు. దేశవ్యాప్తంగా ఇవి మిషన్లు కాకుండా బ్యాలెట్ పేపర్ కావాలన్న ఎఐసిసి ప్లీనరీ నిర్ణయానికి బిజెపి భయపడుతున్నదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలే కాంగ్రెస్‌ను గెలిపించుకుంటారన్నారు. దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబానికి దేశ ప్రజలు అండగా ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన కులగణన సర్వే దేశవ్యాప్తంగా చేయాలంటే ప్రధాని మోడీ స్నేహితులైన అంబానీ ఆదానీలకు దోచి పెడుతున్న దేశ సంపద, వనరులు ఇక ముందు తాడిత, పీడిత, అణగారిన వర్గాలకు చెందిన దేశ ప్రజలందరికీ పంచాల్సి వస్తేదేమో? ఆ పరిస్థితి వస్తే కార్పొరేట్ సంస్థలతో బతుకుతున్న బిజెపి భవిష్యత్తు ఏమవుతుందో అన్న భయం పట్టుకుని, దేశంలో కుల గణన జరగకుండా అడ్డుకోవడానికి చేసిన కుట్రలో భాగంగానే ఎఐసిసి అగ్రనేతలు రాహుల్, సోనియాలపై అక్రమ కేసులు పెట్టారని ధ్వజమెత్తారు. నేషనల్ హెరాల్డ్ పత్రికలో పనిచేస్తున్న వారికి జీతాలు ఇవ్వాలని, కరెంట్ బిల్లులు కట్టాలని రూపాయి, రూపాయి పోగేసి చందాలు వేసుకుని డబ్బులు ఇస్తే కేసులు పెట్టడం న్యాయమా? జర్నలిస్టులకు అండగా నిలబడి నటువంటి కాంగ్రెస్ అగ్ర నేతలపై కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ అక్రమంగా పెట్టిన ఈ.డి కేసులను సమస్త జర్నలిస్టులు ఎండగట్టాలని కోరారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బిజెపి ఫాసిస్టు పాలన కొనసాగుతున్నదన్నారు. రాహుల్ గాంధీకి పెరుగుతున్న ప్రతిష్టను చూసి ఓర్వలేక మోదీ సర్కార్ అక్రమ కేసుల కుట్రలకు తెరలేపిందని విమర్శించారు. ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ దేశంలో బిజెపి గుండాయజం, రౌడీయజం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట పెరుగుతుందని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని, రాహుల్‌గాంధీని బిజెపి ప్రభుత్వం వేధింపులకు గురిచేయడం ద్వారా ఆధైర్యపరిచే ప్రయత్నం చేస్తుందన్నారు. తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అనడం కంటే కెసిఆర్ ప్రతిపాదన మేరకు బిజెపి అధ్యక్షుడైన కిషన్ రెడ్డి చట్టాల గురించి మాట్లాడడం విడ్డూరమన్నారు.

## ఆర్థిక సాయం అందించండి (మొదటి పేజీ తరువాయి)

ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా) ఉన్నత యాజమాన్యంతో సమావేశమైంది. రాష్ట్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు నిధులను సమీకరించేందుకు జైకాతో తెలంగాణ ప్రభుత్వం చర్చలు జరిపింది. ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షోహెయ్ హరా, ఆ సంస్థ సీనియర్ మేనేజర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పెట్టుబడిదారులను ఆకర్షించేలా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సానుకూల విధానాలు, ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా హైదరాబాద్‌ను అత్యంత ఆకర్షణీయమైన నగరంగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రి ఈ సమావేశంలో వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రూ.24,269 కోట్ల అంచనాలతో చేపట్టనున్న మెట్రో రైలు రెండో దశ ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్రం తుది పరిశీలనలో ఉన్నాయని జైకా బృందానికి వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే వ్యయంలో 48 శాతం అంటే రూ.11,693 కోట్ల రుణం అందించి మద్దతు ఇవ్వాలని కోరారు. భారత ప్రభుత్వ విదేశీ రుణ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఖచ్చితంగా పాటిస్తుందని చెప్పారు. మెట్రోతో పాటు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు, కొత్త రేడియల్ రోడ్లకు నిధులు సమకూర్చాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నగరాన్ని న్యూయార్క్, టోక్యో లాంటి ప్రపంచ నగరాలతో సమానంగా అభివృద్ధి చేయాలనే తన ఆలోచనలను ముఖ్యమంత్రి వారితో పంచుకున్నారు. జైకాకు, తెలంగాణతో అనేక ఏళ్లుగా సంబంధాలున్నాయని జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షోహెయ్ హరా అన్నారు. మెట్రో రైలు విస్తరణతో పాటు, అర్హతలున్న ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు జైకా నుంచి ఆర్థిక సాయం పొందేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ



సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సిఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, మెట్రో రైలు ఎండి ఎన్‌విఎస్.రెడ్డి, హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, తెలంగాణకు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

**సోనీ ప్రధాన కార్యాలయంలో సిఎం బృందం :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గురువారం జపాన్‌లో సోనీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. సోనీ కంపెనీకి చెందిన యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచైరోల్ బృందాన్ని కలుసుకుంది. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అధికారిక పర్యటనలో భాగంగా సోనీ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. సోనీ కార్పొరేషన్ తయారు చేస్తున్న కొత్త ఉత్పత్తులు, చేపడుతున్న కొత్త కార్యక్రమాలను ఆ కంపెనీ ప్రతినిధులు ప్రదర్శించారు. ఉత్పత్తులతో పాటు వారి పనితీరును ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సోనీ కంపెనీ యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచైరోల్‌పై వివరణాత్మక చర్చలు జరిపింది. యానిమేషన్, విఎఫ్ఐ, గేమింగ్ రంగాలలో హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలు, అనుకూలతలను తెలంగాణ బృందం కంపెనీ ప్రతినిధులకు వివరించింది. ఎండ్‌టు ఎండ్ ప్రొడక్షన్ సామర్థ్యాన్ని కలిగి ఉండే అత్యాధునిక ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన భవిష్యత్తు విజన్‌ను వారితో పంచుకున్నారు.

## స్టేకు హైకోర్టు నో (మొదటి పేజీ తరువాయి)

20 మంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. జిఆర్ఎల్‌లో అవకతవకలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. మెయిన్స్ పత్రాల మూల్యాంకనం సరిగా నిర్వహించలేదని, అందుకే అభ్యర్థులు నష్టపోయారని పిటిషనర్లు పేర్కొన్నారు. మూల్యాంకనం, నియామకాలు నిబంధనలకు విరుద్ధమని, తిరిగి మూల్యాంకం చేయాలని, లేదంటే మరోసారి మెయిన్స్ నిర్వహించాలని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. మూల్యాంకనంపై హైకోర్టు పర్యవేక్షణలో లేదా స్వతంత్ర సంస్థతో విచారణ చేయించాలని కోరారు. ఈ మేరకు ప్రతివాదులను ఆదేశించాలని 20 మంది గ్రూప్–1 అభ్యర్థులు అభ్యర్థించారు. తెలంగాణ ప్రభుత్వం, టిజిపిఎస్‌సిని ప్రతివాదులుగా చేర్చారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

## బాధ్యతల స్వీకరణ (మొదటి పేజీ తరువాయి)

హెచ్‌ఆర్‌సి జ్యూడిషల్ సభ్యులుగా రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి శివాది ప్రవీణ, నాన్ జ్యూడిషల్ సభ్యులుగా రిటైర్డ్ ఎఐఎస్ అధికారి డాక్టర్ బి.కిషోర్ కూడా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ పెండింగ్‌లో ఉన్న 300 కేసులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడమే కాకుండా మానవ హక్కుల కాపడే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పెట్టుబడులు (మొదటి పేజీ తరువాయి)

ఇంటెంట్‌పై ముఖ్యమంత్రి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు. జపాన్ కంపెనీలతో పాటు ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఈ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేస్తారు. దీంతో దాదాపు రూ. 5,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించే అంచనాలున్నాయి. మారుబేని ఇండస్ట్రియల్ పార్క్ ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై దృష్టి పెడుతుంది. అధునాతన తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నైపుణ్యం కలిగిన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు చేపడుతారు. చర్చల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో కొత్తగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీకి మారుబేనికి స్వాగతం పలికారు. ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేసే మొట్ట మొదటి పార్కు ఇదేనని అన్నారు. దీంతో తెలంగాణలో దాదాపు 30 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, జీవనోపాధి మెరుగుపడుతుందని అన్నారు. తెలంగాణలో వ్యాపారానికి అనువైన అవకాశాలున్నాయని మారుబేనికి ప్రభుత్వం తరపున తగినంత మద్దతు ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. దేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, అందులో మారుబేని పెట్టుబడులకు ముందుకు రావటం సంతోషంగా ఉందన్నారు. భారత దేశంతో జపాన్‌కు అనేక ఏళ్లుగా ఉన్న స్నేహ సంబంధాల దృష్ట్యా పెట్టుబడిదారులు తెలంగాణను తమ స్వస్థలంగానే భావిస్తారని ముఖ్యమంత్రి మాటిచ్చారు. తెలంగాణ, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు ముఖమంత్రి రేవంత్ రెడ్డి ఎంచుకున్న దార్శనికతకు మారుబేని నెక్స్ట్ జనరేషన్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దైసకాకురా అభినందించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శించారు. అక్కడున్న అవకాశాలను వినియోగించుకునేందుకు ముందువరుసలో ఉంటామని అన్నారు. మారుబేని కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలో 410 కి పైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు, లోహాలు, గనులు, ఇంధనం, విద్యుత్తు, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్, మొబిలిటీ రంగాలలో ఈ కంపెనీ అగ్రగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50,000 మందికి పైగా ఉద్యోగులను నియమించిందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎక్సైజ్ ఎస్ఐ మురళీకృష్ణకు క్యాష్ అవార్డు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన సమయంలో పట్టుకున్న గంజాయి కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల శిక్షతో పాటు రూ. 20వేల జరిమాన పడే విధంగా కేసు రాసిన బానాల మురళీకృష్ణకు గురువారం నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి చేతుల మీదుగా క్యాష్ అవార్డును అందించారు. మురళీకృష్ణ ప్రస్తుతం ఊట్‌నూర్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నారు. మురళీకృష్ణ 2023లో భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో 28 కెజిల గంజాయిని రవాణ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ నిందితుడికి శిక్షపడే విధంగా కేసును, సాక్ష్యులను పెట్టడంలో కీలకపాత్ర వహించిన మురళీకృష్ణ క్యాష్ అవార్డును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి ఉన్నారు.

### వ్యవసాయ ఉత్పత్తుల వ్యర్థాలతో

# కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టు

పర్యావరణ పరిరక్షణ : రైతుకు ఆదాయమే లక్ష్యం
ప్లాంట్లు ఏర్పాటు ద్వారా 3వేల ఉద్యోగాల కల్పన
వ్యవసాయ వ్యర్థాలను సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు అవకాశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్యావరణహిత రాష్ట్రమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ చేపడుతోంది. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే వ్యవసాయ వ్యర్థాలను పర్యావరణ హితంగా మార్చే ప్రక్రియకు సన్నాహకాలు చేస్తోంది. ఇందులో భాగంగా వ్యవసాయ ఉత్పత్తుల వ్యర్థాలతో రాష్ట్రవ్యాప్తంగా 15 కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి) ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా వ్యవసాయ వ్యర్థాలను సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ఇటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ ప్రాజెక్టును ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత పెట్రోలియం కార్పొరేషన్‌లు 50 శాతం, జిపిఎస్ రెన్యూవబుల్స్ ఆర్య సంస్థ 50 శాతం భాగస్వామ్యంగా ఈ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నాయి. ఒక్కో ప్లాంట్ 15 టన్నుల రోజువారి ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండగా, మొత్తం 225 టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు సంబంధించి జిపిఎస్ రెన్యూవబుల్స్ ఆర్య సంస్థ ప్రతినిధుల బృందం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరాకు గురువారం ప్రతిపాదనలు సమర్పించారు.

**రాష్ట్రంలోని 15 జిల్లాలలో ప్లాంట్ల ఏర్పాటు :**

రాష్ట్రంలోని 15 జిల్లాల్లో ఈ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి, వనపర్తి, మహబూబ్‌నగర్, కామారెడ్డి, నిజామాబాద్‌లలో ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ప్రతి ప్లాంట్‌కు కనీస స్థలం 20 ఎకరాలతో పాటు వరి గడ్డి, నాపియర్ గడ్డిని నిల్వ చేయడానికి అదనంగా మరో 25 ఎకరాలు, మొత్తం 55ఎకరాలు భూమి అవసరం కానుంది. ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చిన 18 నెలల్లో ఈ పనులు పూర్తి చేసే విధంగా కంపెనీ ప్రతినిధులు కార్యాచరణను రూపకల్పన చేశారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు, స్థానికంగా ఉండే దాదాపు 3వేల మంది గ్రామీణ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు కలుగనున్నాయి.

**పర్యావరణ హితకరమైన ప్రయోజనాలు :**

ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే పర్యావరణ పరిరక్షణే కాకుండా ఆర్థికంగా కూడా ఎంతో మేలు జరగనుంది. ఎందుకంటే ప్రతి ఏటా పంటల కోత తర్వాత ఉత్పత్తి అయ్యే వ్యవసాయ వ్యర్థాలను ఎండిన తర్వాత రైతులు పొలాల్లోనే కాల్చివేస్తుంటారు. దీంతో ఆ పొగ కారణంగా వాతావరణ కాలుష్యం బారిన పడి పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోంది. అయితే ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఇకమీదట రైతులు వ్యవసాయ వ్యర్థాలను సైతం అమ్ముకోవచ్చు. వీటిని బయో ప్రాజెక్టు వారే సేకరిస్తారు. ఈ ఏడాది వానాకాలంలోనే 65 లక్షల ఎకరాల్లో వరిపంట, 43లక్షల ఎకరాలలో పత్తిపంట సాగు చేయగా, దాదాపు 13 నుండి 14 కోట్ల క్వింటాళ్ల వరకు వరి కొయ్యలు, 8.6 కోట్ల క్వింటాళ్ల వరకు పత్తి కట్టే వ్యర్థాలు వెలువడినటుల అధికారాలు అంచనా. అయితే ఈ ప్రాజెక్టుల కుగాను ప్రతి ఏటా సుమారు 7.5 లక్షల మెట్రిక్ టన్నుల వరిగడ్డి వినియోగించబడుతుంది. తద్వారా ఏటా 82,125 మెట్రిక్ టన్నుల కంప్రెస్డ్ బయో గ్యాస్ (సిబిజి) ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. ఇది సుమారు 57.84 లక్షల గృహ గ్యాస్ సిలిండర్లకు సమానమని ప్రాథమిక అంచనా. అంతేకాకుండా 3 లక్షల మెట్రిక్ టన్నుల సేంద్రియ ఎరువు ఉత్పత్తి అవుతుంది. దీనివల్ల వ్యవసాయరంగంలో మట్టి నాణ్యత మెరుగవడంతోపాటు సేంద్రియ వ్యవసాయానికి బలమైన తోడ్పాటు లభిస్తుంది. ఇక గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలలో 17.24 లక్షల మెట్రిక్ టన్నుల తగ్గింపు సాధ్యం కానుంది.

**తెలంగాణ హరిత భవిష్యత్తుకు నాంది : మంత్రి తుమ్మల**

రాష్ట్ర అభివృద్ధిలో పునరుత్పాదక ఇంధన రంగం కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో ఈ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తద్వారా వ్యవసాయ వ్యర్థాలే రైతులకి ఆదాయ మార్గంగా మారే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలిపారు. జిపిఎస్ రెన్యూవబుల్స్ ఆర్య సంస్థ చేసిన ప్రతిపాదన రాష్ట్ర లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయని, ఇందుకు సంబంధించి అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంది తెలిపారు. యువతకు ఉపాధి, రైతులకు ప్రత్యక్ష ఆదాయం, పర్యావరణ పరిరక్షణ వంటి బహుళ ప్రయోజనాలు కలగనున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ చర్యలు తెలంగాణ హరిత భవిష్యత్తు నాంది పలకనున్నాయని మంత్రి వెల్లడించారు.

## ఎఐకెఎస్ జాతీయ కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా క్షీరసాగర్,
ప్రధాన కార్యదర్శిగా రావుల వెంకయ్య,
జాతీయ కార్యదర్శిగా పశ్యపద్మ

**అమరావతి :** అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య తిరిగి ఎన్నికయ్యారు. అఖిలభారత కిసాన్ సంఘ్ (ఎఐకెఎస్) జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఖమ్మం జిల్లాకు చెందిన బాగం హేమంతరావు ఎన్నికయ్యారు. తమిళనాడులోని నాగపట్టణంలో ఈనెల 15 నుంచి గురువారం వరకు ఎఐకెఎస్ 30వ జాతీయ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. ఈ మహాసభలకు దేశ వ్యాప్తంగా 650 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 57 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. మహాసభలను జయప్రదం చేయటంలో తమిళనాడు రాష్ట్ర కిసాన్ సభ విశేష కృషి చేసింది. రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తీర్మానాలు చేసింది. ఈ జాతీయ మహాసభలో 115 మందితో జాతీయ కౌన్సిల్, 39 మందితో కార్యవర్గం, 17మంది ఆఫీసు బేరర్లను ఎన్నుకున్నారు. కాగా ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా తెలంగాణ నుంచి పశ్యపద్మ, బాగం హేమంతరావు, సూర్యనారాయణ, కంజర్ల భూమయ్య, వర్ల వెంకటయ్య, గోవిందరావు, ముత్యాల విశ్వనాథం, దేవభక్తుల సంధ్య, రాణి, రామచంద్రయ్య, కంబాల శ్రీనివాస్, దొడ్డ వెంకటయ్య, ప్రభులింగంలు ఎన్నికయ్యారు.



## సమసమాజ స్థాపనే లక్ష్యం

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు,
మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/చిగురుమామిడి :** దోపిడీ లేని సమాజ నిర్మాణం కోసం, సమసమాజ స్థాపన లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. చిగురుమామిడి మండలం ఒగులాపూర్ గ్రామంలో సిపిఐ గ్రామశాఖ మహాసభ మాజీ కార్యదర్శి గట్టు మధు అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై వెంకటరెడ్డి మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ చరిత్రలో స్వాతంత్రంతో పాటు దోపిడీ లేని సమాజం, అంతరాలు లేని వ్యవస్థ, కార్మిక కర్షకుల సమస్యలతో పాటు ప్రజల అభ్యున్నతికి కీలకపాత్ర పోషించిందన్నారు. దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి కేవలం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను అమలు చేయడంలో జాప్యం చేయకుండా ఇచ్చిన హామీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని, లేనిపక్షంలో ప్రజలచే తిరుగుబాటు తప్పదన్నారు. క్షేత్రస్థాయిలో నిర్మాణపరంగా సిపిఐ పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందెస్వామి, చాడ శ్రీధర్‌రెడ్డి, అందె చిన్నస్వామి, బూడిద సదాశివ, శ్రీనివాస్ గౌడ్, సుదర్శన్, గ్రామశాఖ నాయకులు పాల్గొన్నారు.



## సిపిఐలో చేరిన పాండురంగాచారి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి సంఘం నేత రాయబండి పాండురంగాచారి తిరిగి తిరిగి మాతృ సంస్థ అయిన సిపిఐలోఏ చేరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనమనేని సాంబశివ రావు పాండురంగా చారికి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కూనమనేని సాంబశివరావు మాట్లాడుతూ పాండురంగ చారి తిరిగి పార్టీలో రావడం మంచి పరిణామం అని అన్నారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి జాతీయ నాయకులు టి.వెంకట్రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ధనంజయ్‌నాయుడు, ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయ్య నాయక్ పాల్గొన్నారు.

## 262 మందికి హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చార్మినార్ జోన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న262 మందికి హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతులు కల్పిస్తూ మల్టీజోన్–2 ఐజి వి.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 73 మంది, సైబరాబాద్‌లో 147 మంది, సంగారెడ్డిలో 18 మంది, వికారాబాద్‌లో 17 మంది, డిప్యూటేషన్‌లో ఉన్న ఏడుగురు ఉన్నారు.

### మే 15 నుంచి 18 వరకు తిరుపతిలో

# ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు
వలీ ఉల్లా ఖాద్రీ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తిరుపతిలో మే 15 నుంచి 18వ తేదీ వరకు 4 రోజులు పాటు జరగనున్న అఖిలభారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం హైదరాబాద్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ నాయకులు 17వ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్‌ను అవిష్కరించారు. అనంతరం వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ దేశంలో యువజన సామర్థ్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రధానంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాలయాపన చేస్తుండడంతో రోజురోజుకూ నిరుద్యోగం పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై దృష్టిసారించకుండా ఎంతసేపటికీ ప్రైవేట్, కార్పొరేట్ పెట్టుబడిదారీ వ్యవస్థలపైనే ఆధారపడుతుండటంతో ఉన్నవారు మరింత ధనవంతులుగా, లేనివారు మరింత పేదవారుగా మారి అసమానతలు ఏర్పడుతున్నాయన్నారు. ఈ జాతీయ మహాసభలలో ప్రధానంగా నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, పాలకుల విధానాలు తదితర అంశాలపై చర్చలు, తీర్మానాల ద్వారా నిర్ణయాలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు. ఈ జాతీయ మహాసభలకు దేశం నలుమూలల నుండి సుమారు 800 మంది డెలిగేషన్ నాయకత్వం పాల్గొంటారన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి 80 మంది ప్రతినిధులు హాజరు కానుండగా, మే15న తిరుపతిలో జరగనున్న మహాసభల ర్యాలీ, బహిరంగ సభకు 1000 మంది పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, లింగం రవి, బిజ్జ శ్రీనివాసులు, యుగంధర్, పేరబోయిన మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.బాలకృష్ణ, సల్మాన్‌బేగ్, షేక్ మహమూద్, శివకుమార్, మధు, బోనగిరి మహేందర్, మస్కసుధీర్, మహేష్, మాజీద్ అలీ ఖాన్, కల్యాణ్, మానస్‌కుమార్, మార్కపూరి సూర్య, రాజేష్, మధు, ప్రవీణ్, అశోక్, రాజ్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెలాఖరులోగా 'ఎల్ఆర్ఎస్' ప్రక్రియ

నూరు శాతం పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలి
ఓపెన్ ప్లాట్‌తో పాటు లేఔట్‌ల పరిశీలనపై ప్రత్యేక దృష్టి సారించాలి
కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దాన కిషోర్ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీలోగా వంద శాతం పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్లకు, మున్సిపల్ కమిషనర్లకు ఆయన సూచించారు. సచివాలయంలో గురువారం దాన కిషోర్, డిటిసిపి డైరక్టర్ ఎస్.దేవేందర్‌రెడ్డితో కలిసి ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్‌లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌లు, మున్సిపల్ కమిషనర్‌లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో భాగంగా తక్కువ ప్రొసీడింగ్‌లు జారీ చేసిన జిల్లా కలెక్టర్లతో ముఖ్య కార్యదర్శి మాట్లాడారు. ఎక్కువ ప్రొసీడింగ్స్ జారీ చేసిన జిల్లా కలెక్టర్లు తాము అనుసరిస్తున్న వ్యూహాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులందరికీ ప్రొసీడింగ్స్ జారీ ప్రక్రియ వేగంగా పూర్తిచేయాలని సూచించారు. ఓపెన్ ప్లాట్లతో పోల్చుకుంటే లేఔట్‌ల వెరిఫికేషన్ ఆశించిన వేగంగా జరగడంలేదని దానకిషోర్ తెలిపారు. ఓపెన్ ప్లాట్‌తో పాటు లేఔట్‌ల వెరిఫికేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్‌లు, కమిషనర్‌లకు ఆయన సూచించారు. బల్క్ అప్లికేషన్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎల్ఆర్ఎస్ వల్ల కలిగే ప్రయోజనాలను దరఖాస్తుదారులకు తెలిసేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌లకు ఆయన సూచించారు. ఇప్పటికీ ఫీజు చెల్లించని దరఖాస్తుదారులకు మళ్ళీ ఫోన్ చేసి ఏప్రిల్ 30లోగా ఫీజులు చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు.




## పౌర సరఫరాల శాఖలో సంస్కరణలు ప్రశంసనీయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలోని పౌర సరఫరాల శాఖ బలోపేతానికి చేపట్టిన సంస్కరణలు ప్రశంసనీయమని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి సి.విశ్వనాథ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆహార, పౌర సరఫరాల విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన విశ్వనాథ్ గురువారం హైదరాబాద్‌లోని సివిల్ సప్లైయి భవన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు పౌరసరఫరాల శాఖ కమిషన్ డి.ఎస్.చౌహాన్ సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం విశ్వనాథ్ పౌరసరఫరాల శాఖ అధికారులతో తన అనుభావాలను పంచుకున్నారు. ఏడాది కాలంలోనే ప్రభుత్వ 4 ప్రధాన కార్యాక్రమాలను పౌరసరఫరాల శాఖ విజయవంతంగా అమలు చేయడ అభినందనీయమన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో ఎఫ్‌సిఐ జనరల్ మేనేజర్‌గా డి.ఎస్ చౌహాన్ పని చేసిన కాలంలోను ఆయన నిర్వహించిన పనితీరుతో మంచి ఫలితాలను సాధించారని విశ్వనాథ్ గుర్తు చేశారు.

## ఈస్టర్ ఫెస్టివల్‌కు ఎంఎంటిఎస్ ప్రత్యేక రైళ్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రిస్టియన్లకు ఇది శుభవార్త. ఈ నెల 20వ తేదీన ఈస్టర్ ఫెస్టివల్ నేపథ్యంలో ఎంఎంటిఎస్ ప్రత్యేక రైళ్లను నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది.ఈ మేరకు దక్షిణ మండల రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ అధికారి ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నగరంలోని కల్వరి టెంపుల్కు వెళ్లే వారు ఈ ప్రత్యేక రైళ్లను ఉపయోగించుకోవాలని సూచించారు. 20వ తేదీన మొత్తం మూడు ఎంఎంటీఎస్ స్పెషల్ రైళ్లు అందుబాటులో ఉండనున్నారు. హైదరాబాద్ నుంచి లింగంపల్లి వెళ్లే ఎంఎంటీఎస్ రైలు.. 20వ తేదీన తెల్లవారుజామున 3.15 గంటలకు హైదరాబాద్ స్టేషన్ నుంచి బయల్దేరి లింగంపల్లికి ఉదయం 4.05 గంటలకు చేరుకోనుంది. ఫలక్నుమా లింగంపల్లి ఎంఎంటీఎస్ రైలు.. ఫలక్నుమాలో తెల్లవారుజామున 2.30 గంటలకు బయల్దేరి.. సికింద్రాబాద్కు 3.05 గంటలకు, లింగంపల్లికి ఉదయం 4 గంటల వరకు చేరుకోనుంది. లింగంపల్లి ఫలక్నుమా రైలు లింగంపల్లిలో 2.50కి బయల్దేరి, సికింద్రాబాద్కు 3.30కి, ఫలక్నుమాకు ఉదయం 4.30 గంటలకు చేరుకోనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## నాన్ డ్యూటీ లిక్కర్‌పై దృష్టి సారించండి : ఎక్సైజ్ డిసి దశరథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాన్ డ్యూటీ లిక్కర్‌పై దృష్టిసారించాలని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ అధికారులను ఆదేశించారు. నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో ఎక్సైజ్ సిబ్బంది, అధికారులతో రంగారెడ్డి డివిజన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాల్లో గంజాయితో పాటు డ్రగ్స్‌ను అరికట్టేందుకు అధికారులు నిరంతరం దాడులు నిర్వహించాలని సూచించారు. ప్రధానంగా రంగారెడ్డి డివిజన్‌లో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ డ్రగ్స్, గంజాయి అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్లను ఆయన ఆదేశించారు. వీటికి తోడు ఎప్పటికప్పుడు ఎండిపిఎల్ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగించేటువంటి ఫామ్‌హౌస్‌లు వాటిపై ప్రత్యేకంగా నిఘాపెట్టి దాడులు నిర్వహించి అక్రమ మద్యాన్ని అరికట్టాలని ఆయన సూచించారు. నమోదు చేసినటువంటి కేసుల్లో సకాలంలో చార్జిషీట్, వాహనాలను వేలం వేయాలని పట్టుకున్నటువంటి కాంట్రా బ్యాండ్ ఆదేశాలను తీసుకొని కాల్చివేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్‌తో పాటు శంషాబాద్, సరూర్‌నగర్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఉజ్వలరెడ్డి, కె.నవీన్, ఫయాజుద్దీన్, విజయ్ భాస్కర్ గౌడ్‌లతోపాటు ఎస్‌టిఎఫ్ టీములు, స్టేషన్ ఎస్‌హెచ్ఒలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-14, జిహెచ్ఎంసి**

NIT No. 02/E.E.14/GHMC/2025-26 తేది: 16.04.2025

**పని పేరు:** జిహెచ్ఎంసి, సి-14 కింద 77-జామ్‌బాగ్ డివిజన్‌లో 5-6-613 దర్గాషాకామోష్ మరియు 5-6-613 జామా మసీద్ దగ్గర కమ్యూనిటీ టాయిలెట్స్ పునరుద్ధరణ. (రూ.7.50 లక్షలు), **అంచనా విలువ / ఇసివి:** రూ.7.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 17.04.2025న ఉ.11.00గం.ల నుండి 21.04.2025న ఉ.11.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ -14, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 515-PP/CL/ADVT/1/2025-26, Date: 17-04-2025

**శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము**
గూడెం గ్రామము, దండేపల్లి మండలము, మంచిర్యాల జిల్లా.

Rc.No. SSSD/132/2025 — బహిరంగ వేలము ప్రకటన - 2 — తేది: 17.04.2025

ఇందుమూలముగా యావన్మందికి మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా! మంచిర్యాల జిల్లా, దండేపల్లి మం॥, గూడెం గ్రామము యందలి శ్రీ సత్యనారాయణస్వామి దేవస్థానము వద్ద ఈ క్రింద తెలిపిన వేలము తేది: 28.04.2025 సోమవారం రోజున ఉదయం గం.11:00ల నుండి దేవాదాయశాఖ అధికారులు పర్యవేక్షణలో, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు మరియు హాజరు సభ్యుల సమక్షములో దేవాలయ కార్యనిర్వహణాధికారిచే దేవస్థాన కార్యాలయమునందు బహిరంగ వేలము నిర్వహించబడును.

| క.సం. | బహిరంగ వేలము వివరములు | ధరావత్తు సొమ్ము | కాల పరిమితి |
|---|---|---|---|
| 1. | టెంకాయలు అమ్ముకొను హక్కు | రూ. 1,00,000/- | తేది: 19.06.2025 నుండి తేది: 18.06.2026 వరకు |
| 2. | కొబ్బరి ముక్కలు ప్రోగుచేసుకొను హక్కు | రూ. 50,000/- | |
| 3. | ధాన్యము వ్రతపూజసామాగ్రి ప్రోగుచేసుకొను హక్కు | రూ. 1,00,000/- | తేది: 15.06.2025 నుండి తేది: 14.06.2026 వరకు |
| 4. | కిరాణం మరియు ఆటబొమ్మలు అమ్ముకొనుహక్కు, | రూ. 50,000/- | |
| 5. | వంట చెరకు, పూలు, పండ్లు అమ్ముకొను హక్కు | రూ. 50,000/- | |
| 6. | టీ, టిఫిన్స్ అమ్ముకొను హక్కు | రూ.20,000/- | |

కావున ఆసక్తి గల వారు ధరావత్తు చెల్లించి ఆధార్ కార్డు ఇచ్చి బహిరంగ వేలము పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాను. ఇట్టి వేలము పాట షరతులు వేలము పాటకు ముందు చదివి వినిపించబడును. ఇతర వివరములకు కార్యాలయము నందు సంప్రదించగలరు.

DIPR R.O. No. : 524-PP/CL/ADVT/1/2025-26, Date: 17-04-2025 సం/- కార్యనిర్వహణాధికారి

**పురపాలక సంఘ కార్యాలయము - రామాయంపేట**
జి॥ మెదక్. (టి.ఎస్.)

నెం. A1/52/MCR/2025 — బహిరంగ వేలము ప్రకటన — తేది: 16.04.2025

**విషయము :** పురపాలక సంఘం రామాయంపేట - 2025-26 ఆర్థిక సంవత్సరమునకు తైబజారు వేలము వేయుటకు గాను ప్రకటన జారీ చేయుట గురించి.
**సందర్భము :** 1. పురపాలక సంఘం రామాయంపేట గారి ప్రకటన నం. ఎ1/52/యం.సి.ఆర్./2025, తేది: 11.03.2025
2. పురపాలక సంఘం రామాయంపేట గారి ప్రకటన నం. ఎ1/52/యం.సి.ఆర్./2025, తేది 25.03.2025

ఇందుమూలముగా రామాయంపేట పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా 2025-26 ఆర్థిక సంవత్సరమునకు తేది 01.05.2025 నుండి 31.04.2026 వరకు తైబజారు వసూలు చేయుటకు ఈ దిగువ చేవ్రాలు చేయు వారిచే సందర్భము 1 మరియు 2 ద్వారా వేలం నిర్వహించగా ఇట్టి వేలములో ఎవరు డిపాజిట్ చెల్లించనందున వేలము వాయిదావేయనైనది. తిరిగి తేది 24.04.2025 గురువారము రోజున మధ్యాహ్నం గం. 12-00లకు పురపాలక సంఘ ఆవరణలో వేలము నిర్వహించబడును. కావున ఆసక్తి గల వారు తేది. 24.04.2025 రోజున ఉదయం 10 గం.ల వరకు సంబంధిత డాక్యుమెంట్లు సమర్పించి ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరనైనది.

**వేలము యొక్క నిబంధనలు :-**
1. వేలం యొక్క వ్యవధి తేది 01.05.2025 నుండి 31.04.2026 వరకు ఉండగలదు.
2. వేలంలో పాల్గొనువారు ధరావత్తు రూ 1,00,000-00 చెల్లించినవారు మాత్రమే వేలములో పాల్గొనుటకు అర్హులు.
3. వేలములో నెగ్గిన వారు వేలము మొత్తములో 1/2 భాగము డబ్బు చెల్లించవలయును. మిగిలిన మొత్తం (6) సమాన వాయిదాలలో 11/2025 లోగా చెల్లించవలెను. అనగా 01.06.2025 నుండి 30.11.2025 వరకు ప్రతినెల 5వ తేదీలోగా చెల్లించి రశీదు పొందవలెను.
4. WP. No. 3234/2004 మరియు CMA గారి సర్క్యులర్ నెం. 4868/2015/M31 తేది 06.07.2015 ప్రకారము గూడ్స్ ట్రాన్స్పోర్ట్ వాహనాలకు తైబజారు రుసుము వసూలు చేయరాదు.
5. గుత్తేదారు తైబజారు గుత్తలు ఇతరులకు బదిలీ చేయుటకు గాని తిరిగి గుత్తకు ఇచ్చుటకు గాని గుత్తేదారునికి అధికారము లేదు.
6. తైబజారు వేలములో పాట పాడేవారు సాల్వెన్స్ సర్టిఫికెట్ రూ॥ 10,00,000-00 లకు తక్కువ కాకుండా సమర్పించవలెను. సర్టిఫికెట్ దాఖలు చేసిన వారు మాత్రమే వేలము పాటలో పాల్గొనుటకు అర్హులు.
7. వేలములో పాల్గొను వారు పురపాలక సంఘానికి ఎలాంటి బకాయిలు ఉండకూడదు.
8. వేలము పూర్తి కాగానే వారము రోజులలో లీజు అగ్రిమెంట్ మరియు సెక్యూరిటీ బాండ్తో మున్సిపల్ కమీషనర్ గారి పేరిట రిజిస్ట్రేషన్‌మీ స్వంత ఖర్చుతో చేయించి కార్యాలయములో దాఖలు చేయవలెను. లేనిచో ధరావత్తు జప్తు గావించి తిరిగి వేలము వేయబడును.
9. వేలము పొందినవారు (6) MT చెక్కులు కార్యాలయములో సమర్పించవలెను.
10. వేలము యొక్క పాటను ఆమోదించుటకు మరియు ఏ కారణం లేకుండా తిరస్కరించుటకు కమీషనర్ రామాయంపేట గారికి సర్వ హక్కులు కలవు.
11. పురపాలక సంఘం నిర్ణయించిన రేట్ల ప్రకారము తైబజారు ఫీజు వసూలు చేయవలను. ఒకవేళ నిర్ణయించిన రేట్ల కంటే ఎక్కువ వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చినచో మీ యొక్క కాంట్రాక్టు రద్దు చేయబడును.

**దీని ప్రతులు :-**
1. మండల ప్రజా పరిషత్ కార్యాలయం, రామాయంపేట నోటీసు బోర్డుపై అతికించనైనది.
2. మండల రెవెన్యూ కార్యాలయం, రామాయంపేట నోటీసు బోర్డుపై అతికించనైనది.
3. మున్సిపల్ కార్యాలయం, రామాయంపేట నోటీసు బోర్డుపై అతికించనైనది.
4. పట్టణములోని గాంధి విగ్రహం వద్ద, బస్ స్టాండ్ నందు, అంబేద్కర్ విగ్రహం వద్ద, సుభాష్ రోడ్డు నందు, బి.సి.కాలనీలో, గొలిపర్తి, కోమటిపల్లి, రామాయంపేట తాండ, కోమటిపల్లి తాండ మెయిన్ చౌరస్తాల వద్ద అతికించనైనది.

సం/- కమిషనర్, పురపాలక సంఘ కార్యాలయం, రామాయంపేట.

DIPR R.O. No. : 496-PP/CL/ADVT/1/2025-26, Date: 17-04-2025

ప్రజాపక్షం
శుక్రవారం, ఏప్రిల్ 18

# బిజెపి దూకుడుకు బ్రేక్

వక్ఫ్(సవరణ) బిల్లుకు ఆగమేఘాలమీద పార్లమెంటు ఆమోదం పొందటమేగాక, ఆ మరునాడే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్రతో దాన్ని చట్టంగావించి, అమలు చేయటానికి ఆతృత పడిన భారతీయ జనతాపార్టీ ప్రభుత్వ తొందరపాటుకు సుప్రీంకోర్టు బ్రేక్ వేసింది. ముస్లిం మైనారిటీ మత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటమేగాక వారి మత స్వేచ్ఛ, వక్ఫ్ నిర్వహణ హక్కుల్లో ప్రభుత్వ జోక్యాన్ని, అన్యమత జోక్యాన్ని ప్రవేశపెడుతున్న ఈ బిల్లు రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ పలు ముస్లిం సంస్థలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, వ్యక్తులు అంతే త్వరగా సుప్రీంకోర్టులో 100కు పైగా పిటిషన్‌లు దాఖలు చేశాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో జస్టిస్‌లు సంజయ్ కుమార్, కె.వి.విశ్వనాధన్ కొద్ది రోజుల్లోనే – బుధవారం విచారణ చేబట్టారు.

ఈ చట్టంలో ప్రధానమైన వివాదాంశాలు–వక్ఫ్–బై–యూజర్ ( దీర్ఘకాలంగా వినియోగం వల్ల వక్ఫ్ ఆస్తిగా పరిగణన) ఏర్పాటుకు గుర్తింపు రద్దు చేయటం, వక్ఫ్ యాజమాన్య సంస్థల్లో ముస్లిం యేతరులకు స్థానం కల్పించటం, ఫలానా ఆస్తి వక్ఫ్‌దా లేక ప్రభుత్వానిదా అని నిర్ణయించే అధికారాన్ని ప్రభుత్వానికి (కలెక్టర్) ఇవ్వటం. ఈ విషయంలో ''అన్ని పక్షాలకు సమన్యాయం చేస్తూ మూడు అంశాలతో తాత్కాలిక ఉత్తర్వు'' ఇస్తానని ప్రధాన న్యాయమూర్తి చేసిన ప్రతిపాదన ప్రభుత్వపక్షంలో అలజడి సృష్టించింది.

జస్టిస్ సంజీవ్‌ఖన్నా లేవనెత్తిన అంశాలు ఎంత సమంజసంగా ఉన్నాయో కదా!. ఒకటి, కోర్టులు ఇప్పటికే వక్ఫ్ అని ప్రకటించిన ఆస్తులను, ప్రస్తుతానికి, డీనోటిఫై చేయరాదు లేదా వక్ఫ్ యేతర ఆస్తులుగా ప్రకటించరాదు. 'వక్ఫ్–బై–యూజర్' లేదా అధికారిక పత్రాలు, రిజిస్ట్రేషన్ లేకపోయినా ప్రకటన ద్వారా, లేదా ఇతరత్రా వక్ఫ్‌గా ప్రకటించబడిన ఆస్తుల కేటగిరీ కూడా ఇందులోకి వస్తుంది. ''పార్లమెంటు ఆమోదించిన శాసనంతో కోర్టు సాధారణంగా జోక్యం చేసుకోదు. అయితే మినహాయింపులున్నాయి. వక్ఫ్–బై–యూజర్ ఆస్తులను డీనోటిఫై చేస్తే ''చాలా పెద్ద సమస్య''కు దారితీస్తుంది. బ్రిటిష్‌వారు రాకముందు మనకు భూమి రిజిస్ట్రేషన్ చట్టం లేదా ఆస్తి బదలాయింపు చట్టం లేదు. మసీదుల్లో అనేకం 14వ, 15వ, 17వ శతాబ్దాల్లో నిర్మించబడినాయి. రిజిస్టర్డ్ విక్రయపత్రం చూపించమని ఇప్పుడు వారిని అడిగితే అది అసాధ్యం. జామా మసీదు అటువంటిదే'' అని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. 2025 సవరణ చట్టానికి ముందున్న వక్ఫ్ చట్టాల్లో 'వక్ఫ్–బై–యూజర్'ని స్థిరపరిచినపుడు దాన్ని ఇప్పుడు చెల్లుబాటు కాకుండా చేయవచ్చునా అని ఛీఫ్ జస్టిస్ ఖన్నా, కేంద్రప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ప్రశ్నించారు.

రెండు, ఒక ఆస్తి వక్ఫ్‌నా లేక ప్రభుత్వ ఆస్తినా అనే విషయాన్ని ప్రభుత్వాధికారి పరిశీలించటాన్ని అనుమతిస్తూనే, ఆ ఆస్తిని ఈలోపు వక్ఫ్ ఆస్తిగా ఉపయోగించటాన్ని ఆపుచేసే సంబంధిత నిబంధనను స్టే చేస్తాం. మూడు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డుల్లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ముస్లింయేతరులను నియమించటాన్ని అనుమతిస్తాం – అయితే మిగతా సభ్యులంతా ముస్లింలు అయిఉండాలి. అయితే తమ వాదనలు వినిపించేందుకు మరింత సమయం కావాలని తుషార్ మెహతా కోరటంతో తాత్కాలిక ఉత్తర్వు, లేదా ప్రభుత్వానికి నోటీసు ఇవ్వకుండా కేసు విచారణ గురువారానికి వాయిదా పడింది. అయితే అఫిడవిట్ దాఖలుకు ప్రభుత్వానికి మరింత సమయం కావాలని సొలిసిటర్ జనరల్ గురువారం కోరటంతో ధర్మాసనం వారంరోజుల వ్యవధి ఇచ్చింది. కేసు విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది. అంతవరకు యథాతథ స్థితిని ఆదేశించింది. మే 13వ తేదీన సంజీవ్ ఖన్నా రిటైర్ అవుతున్నారు. కాబట్టి ఆలోపు పూర్తి తీర్పు రాకపోయినా తాత్కాలిక ఉత్తర్వు అయినా రావచ్చు.


మోదీ ప్రభుత్వం రిజిస్టర్డ్ పత్రాలు లేవన్న పేరుతో వక్ఫ్–బై–యూజర్‌గా ఉన్న ఆస్తులను డీనోటిఫై చేసి స్వాధీనం చేసుకోవటానికి తొందరపడుతున్నది. రైల్వేలు, ఆర్మీ వంటి వ్యవస్థల తర్వాత వక్ఫ్‌ల కిందనే 8లక్షల ఎకరాల భూమి ఉన్నందున, దాన్ని సంపన్న ముస్లింలు అనుభవిస్తున్నారనే సాకుతో వాటిని ముస్లింలకు లేకుండా చేయాలని చూస్తున్నది. వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిం యేతరులను నియమిస్తామని సవరణ చట్టంలో చెప్పిన మోదీ ప్రభుత్వం హిందూ దేవాదాయ–ధర్మాదాయ సంస్థల్లో ముస్లింలను నియమిస్తారా అనే ప్రశ్నకు జవాబుదాటవేస్తోంది. చట్టం వివక్షత దాని ముఖం మీదనే కనిపిస్తోంది.

# భూదానోద్యమానికి 75 ఏళ్లు



భూదాన్ ఉద్యమం ద్వారా భారతదేశమంతా పాదయాత్ర చేసి, గాంధేయ విధానాలను సామాన్య జీవన స్థిరత్వానికి జతపరచాలని ఒక ధృఢ సంకల్పంతో 1951, ఏప్రిల్ 18న స్వచ్ఛంద భూదాన ఉద్యమానికి నాంది పలికారు ఆచార్య వినోబా భావే. 75 ఏళ్ళ క్రితమే భారతదేశ సర్వ సామాన్య ప్రజల స్థితిగతులను అంచనా వేయగలిగిన ఆయన మేధస్సు చాలామంది సామాన్య ప్రజల జీవితా లను ఆర్థిక స్థిరత్వం వైపు నడిపించగలిగింది. గాంధేయ విధానాలను గ్రామ గ్రామానికి చేర్చగలిగింది. భారతదేశ వ్యాప్తంగా వ్యక్తిత్వ వికాసానికి, సర్వోదయ వికాసానికి చెక్కు చెదరని పునాదులు వేసింది. భూమిలేని నిరుపేదలకు అండగా, భూస్వాముల హృదయాలను కదిలించే దండుగా ఆచార్య వినోబా భావే తెలంగాణలోని శివరాంపల్లి నుంచి భూదాన్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ శిగలోని ఒక మారుమూల పల్లె పోచంపల్లి భూదాన్ పోచంపల్లిగా భారతదేశ శిగలో చేరిన రోజు.. పోచంపల్లి జమీందార్ శ్రీ వెదిరే రామచంద్రా రెడ్డి దాతృత్వంతో భూమిలేని నిరుపేదలకు పంచమని తన నూరెకరాల భూమిని తొట్ట తొలి భూదానంగా వినోబాజీకి అందజేశారు. భూమికోసం, భుక్తికోసం మహోద్యమంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అనంతరకాలంలో వినోబా భావె భూదోనోద్యమానికి శ్రీకారం చుట్టారు. అయితే ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థ పట్టుసడలలేదు.

# అమెరికా దిగ్బంధం నడుమ అద్భుత దేశం క్యూబా



కె.శ్రీనివాస్ రెడ్డి
చైర్మన్,
తెలంగాణ మీడియా అకాడెమీ

క్యూబా రాజధాని హవానాలో 2025 మార్చి 17 నుండి 19 వరకు జరిగిన నాలుగవ అంతర్జాతీయ జర్నలిస్టుల సమావేశంలో భారతదేశం నుంచి నాతో పాటు (వ్యాసకర్త), డాక్టర్ బాలచంద్ర కాంగోను ఆహ్వానించారు. 'టెలిసూర్' అనే టెలివిజన్ ఛానెల్ ప్రారంభించి 20 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం, గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు జోస్ మార్టి ప్రారంభించిన 'పాట్రియా' అనే వార్తాపత్రిక ప్రచురణ ప్రారంభించి 133 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సమావేశాన్ని నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా 47 దేశాల నుండి 400 మందికి పైగా పాత్రికేయులు హాజరవడం ద్వారా ఈ ఉత్సవం విజయవంతంగా జరిగింది. భారతదేశంతో పాటు చైనా, వియత్నాం, రష్యా, కజకిస్తాన్, స్పెయిన్, బెల్జియం, నైజీరియా, దాదాపు అన్ని లాటిన్ అమెరికా దేశాల నుండి పాత్రికేయులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ), రోబోటిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో కొత్త సాంకేతిక పురోగతులు సృష్టించే సవాళ్లకు సంబంధించిన అంశాలపై చర్చించారు. క్యూబా అధ్యక్షుడు మిగ్యూల్ డియాజ్ కానెల్ బెర్ముడెజ్ ప్రారంభ, ముగింపు కార్యక్రమాలకు హాజరయ్యారు. హవానా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. 1925లో హత్యకు గురైన కమ్యూనిస్ట్ యువ నాయకుడు 'మెల్లా' జ్ఞాపకార్థం ఒక స్మారక చిహ్నం ఏర్పాటు చేసిన యూనివర్సిటీ స్క్వేర్ వద్ద ప్రారంభోత్సవం జరిగింది. నయావలసవాదం, సామ్రాజ్యవాదం, నిజమైన ప్రజాస్వామ్యంపై పోరాటం ఇంకా కొనసాగుతోందని, విజయం సాధించడానికి అనేకమంది వీరోచిత త్యాగాలు అవసరమని ఇది గుర్తు చేసింది.

నేను డిజిటల్ యుగంలో నిజాన్ని కనుగొనడం : తప్పుడు సమాచారం, మీడియా మార్పులతో ఘర్షణ (ఎంబ్రేసింగ్ ట్రూత్ ఇన్ ఎ డిజిటల్ ఏజ్ : కాన్‌ఫ్రాంటింగ్ డిస్‌ఇన్ఫర్మేషన్ అండ్ మీడియా షిఫ్ట్స్) అనే అంశంపై పత్రాన్ని సమర్పించాను. ఈ సందర్భంగా క్యూబా అధ్యక్షుడు మిగ్యూల్ డియాజ్ కానెల్ బెర్ముడెజ్‌తో కలిసి, చర్చించే అవకాశం లభించింది.



హవానాలో జరిగిన నాలుగవ అంతర్జాతీయ జర్నలిస్టుల సమావేశంలో పాల్గొన్న పాత్రికేయులతో వ్యాసకర్త

### అమెరికా నకిలీ వార్తలను ఎదుర్కొనేందుకు స్పానిష్ ఛానల్

ప్రపంచవ్యాప్తంగా స్పానిష్ మాట్లాడే ప్రజలను, ప్రత్యేకించి దక్షిణ అమెరికా, మెక్సికో దేశాలలోని వారికి చేరుకోవాలనే ఆలోచనతో స్పానిష్ భాషలో 'టెలిసూర్' అనే టివి ఛానెల్‌ను ప్రారంభించారు. ఇది వెనిజులా అధ్యక్షుడు చావెజ్, క్యూబానేత ఫిడెల్ కాస్ట్రో ఆలోచనకు అనుగుణంగా 20 సంవత్సరాల క్రితం క్యూబా ఆచరణలోకి తీసుకువచ్చింది. అమెరికా ప్రజలను గందరగోళానికి గురిచేయడానికి యుఎస్ ప్రభుత్వం సృష్టించిన బూటకపు సామ్రాజ్యవాద అనుకూల వార్తలు, ప్రచారాన్ని ధీటుగా ఎదుర్కోవడంలో ఇది విజయవంతంగా పనిచేస్తోంది. అమెరికా దిగ్బంధం కారణంగా అనేక కష్టాలను ఎదుర్కొంటున్న క్యూబా ప్రజలు స్వేచ్ఛ, గౌరవం కోసం పోరాడటానికి, అమెరికా దాడుల నుండి చాలా భిన్నమైన సామ్యవాద ఆర్థిక వ్యవస్థను పరిరక్షించడానికి దృఢంగా ఉండడాన్ని మనం అభినందించాలి.

ఎవరైనా క్యూబాను సందర్శించినప్పుడు వినిమయ సంస్కృతి అసలే కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అక్కడ విద్య, వైద్యం అందరికీ ఉచితం. హవానా నగరంలో ఒక్క బిక్షాటన చేసే వ్యక్తి లేదా నిరాశ్రయుడు మాకు కనిపించలేదు. ప్రజలు సామాన్య జీవితాన్ని గడుపుతూ సంతోషంగా జీవిస్తున్నారు. హవానా విశ్వవిద్యాలయంలోని విద్యార్థులతో మేము మాట్లాడినప్పుడు మరో 100 సంవత్సరాలు కష్టాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామే తప్ప స్వేచ్ఛ, గౌరవాన్ని మాత్రం వదులుకోలేమని మాతో సూటిగా చెప్పారు. దిగ్బంధం కారణంగా విద్యుత్ కొరత ఉంది. చాలా మౌలిక సదుపాయాలకు మరమ్మతులు లేదా మార్చడం అవసరం. ఆ పని దిగ్బంధం కారణంగా చేయలేకపోతున్నారు. అయితే, చైనా సహాయంతో క్యూబన్లు రెండు మూడేళ్ళలో సౌరశక్తి నుండి తమ విద్యుత్ అవసరాలలో 40 శాతానికి పైగా తీర్చుకోవాలని యోచిస్తున్నారు. ఇది ఆ ప్రజలకు గొప్ప ఉపశమనం కలిగిస్తుంది.

### సగానికి పైగా పార్లమెంటు సభ్యులు మహిళలే!

జాత్యాహంకారం లేకపోవడం అభినందించదగిన విషయం. ఎందుకంటే జనాభాలో60 శాతానికి పైగా నల్ల జాతీయులే. మేము వెళ్ళిన ప్రతిచోటా తెల్లవారు, నల్లవారు కలిసి తిరుగుతూ, కలిసి తింటూ, ఆనందంగా, స్నేహంగా ఉండటాన్ని గమనించాము. మహిళా సాధికారతలో క్యూబా అత్యంత ముందున్నది. మహిళలు క్యూబాలో అనుభవించే భద్రత,స్వేచ్ఛ సాటిలేనివి. మొత్తం 630 మంది పార్లమెంటు సభ్యులలో 54 శాతానికి పైగా మహిళలే. అలాగే 51 శాతానికి పైగా యువత ఉన్నారు. మహిళలకు క్యూబా అత్యంత సురక్షితమైన దేశమని మాకు చెప్పారు. క్యూబాలో 100 శాతం అక్షరాస్యత ఉంది. వాస్తవానికి 1959లో విప్లవం సంభవించిన వెంటనే, కళాశాల విద్యార్థులందరినీ గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ప్రజలను అక్షరాస్యులుగా మార్చాలని కోరారు. దాని ఫలితమే నూరు శాతం అక్షరాస్యత. హవానా విశ్వవిద్యాలయంలో 50,000 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వాస్తవానికి లాటిన్ అమెరికా దేశాల నుండి వచ్చిన చాలామంది స్పానిష్ మాట్లాడే విద్యార్థులు హవానాలో చదవడానికి ఇష్టపడతారు. ఎందుకంటే అక్కడ విద్య ఉచితం. లాటిన్ అమెరికా నుండి వచ్చి చదువుకోవడానికి క్యూబా ప్రభుత్వం కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తుంది.

వైద్యరంగంలో క్యూబా సాధించిన పురోగతి ప్రపంచం నలుమూలల నుండి ప్రజలను ఆకర్షిస్తోంది. క్యూబా వైద్యులు అవసరమైన వారికి, సంక్షోభ సమయంలో సహాయం చేయడానికి ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్తారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సంక్షోభం నెలకొన్నప్పుడు, క్యూబా వైద్యులు గొప్ప సహాయం చేశారు. క్యూబా వైద్యులు వెనిజులాలోని గ్రామీణ ప్రాంతాల్లో చమురు కోసం సహాయం చేయడానికి 'డాక్టర్స్ ఫర్ ఆయిల్' అనే పథకాన్ని నిర్వహిస్తున్నారు. ఇది క్యూబాకు చాలా అవసరం. యునెస్కో, ప్రపంచ ఆరోగ్య సంస్థ వైద్యంలో క్యూబా సాధించిన పురోగతిని ప్రశంసించాయి. సంక్షోభ సమయంలో అమెరికాకు సైతం క్యూబా సహాయం చేసింది. ఇంతచేసినప్పటికీ కరోనా సమయంలో అవసరమైన శ్వాసకోశ యంత్రాల ఎగుమతిని అమెరికా దిగ్బంధం నిరోధించింది.

### భారతదేశంపై అభిమానం

క్యూబా విప్లవం ప్రాథమికంగా జాతీయవాద విప్లవం. కానీ ఆ సమయంలో ప్రబలంగా ఉన్న అంతర్జాతీయ పరిస్థితి కారణంగా అమెరికా సామ్రాజ్యవాద పథకాలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ విప్లవ ప్రక్రియలో భాగమైంది. తద్వారా సామ్యవాద కూటమిలో భాగమైంది. సోషలిస్టు సోవియట్ కూటమి పతనం చెందడంతో క్యూబా కూడా పతనం అవుతుందని అమెరికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది భావించారు. కానీ అది సంభవించలేదు. అనంతరం ఫిడెల్ కాస్ట్రో మరణం తర్వాత అది పతనం అవుతుందని చాలా మంది భావించారు, కానీ అది కూడా జరగలేదు. దీనికి కారణం క్యూబా ప్రజల సాహసోపేత ప్రతిఘటన, స్వేచ్ఛ పట్ల ప్రేమ. అలీన ఉద్యమంలో క్యూబా, భారతదేశం సత్సంబంధాలను కలిగి ఉన్నాయి. వాస్తవానికి 1982లో ఫిడెల్ కాస్ట్రో ఢిల్లీలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీకి అలీన ఉద్యమ అధ్యక్ష పదవిని అప్పగించారు. క్యూబా ప్రజలు ఇప్పటికీ దానిని గుర్తు చేసుకుంటారు. ప్రజలు మమ్మల్ని కలిసినప్పుడల్లా ఆ సంబంధం గురించి మాకు గుర్తు చేశారు. క్యూబాకు అంతర్జాతీయ మద్దతు, సహకారం అవసరం. అంతర్జాతీయ మద్దతు ద్వారా క్యూబన్లు ఇప్పటివరకు అమెరికా దురాక్రమణను ప్రతిఘటించారు. అధ్యక్షుడు ఒబామా పాలనలో పది లక్షల మందికి పైగా అమెరికన్ పర్యాటకులు క్యూబాను సందర్శించారు. నిజమైన క్యూబా గురించి తెలుసుకున్నారు. అయితే డొనాల్ ట్రంప్ అధ్యక్షుడయ్యాక ఇదంతా ఆగిపోయింది. క్యూబాపై కఠినమైన విధానాన్ని అవలంభిస్తున్నారు. సంక్షోభంలో ఉన్న క్యూబాకు సహాయం చేయడానికి అనేక భారతీయ ప్రజా సంఘాలు నిధులను సేకరిస్తున్నాయి. క్యూబన్‌ల సగటు ఆయుర్దాయం సుమారు 79.5 సంవత్సరాలు, పురుషులు సగటున 76 సంవత్సరాల వరకు, మహిళలు 81 సంవత్సరాల వరకు జీవిస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను పరిగణనలోకి తీసుకుంటే ఇది ఆకట్టుకుంటుంది. తలసరి ఆదాయం విషయానికొస్తే, క్యూబా సగటు ఆదాయం సంవత్సరానికి 9,010 డాలర్లు. అయితే, క్యూబాలో జీవనవ్యయం చాలా తక్కువగా ఉంటుందని గమనించడం ముఖ్యం.

అమెరికాతో సంబంధాల విషయానికొస్తే, క్యూబా, యునైటెడ్ స్టేట్స్ మధ్య సంబంధాల చరిత్ర సంక్లిష్టమైంది. 1959లో క్యూబా విప్లవం నాటి నుంచి ఉభయ దేశాలు ఘర్షిస్తున్న ధృవాలు. ఇది అమెరికా వాణిజ్య దిగ్బంధానికి దారితీసింది. గత ప్రభుత్వం చివరి రోజుల్లో సడలించిన ఆంక్షలను ట్రంప్ అధ్యక్షుడయ్యాక రద్దు చేసి,



క్యూబా అధ్యక్షుడు మిగ్యూల్ డియాజ్-కానెల్ బెర్ముడెజ్‌తో కె.శ్రీనివాస్ రెడ్డి

క్యూబాపై కఠినమైన ఆంక్షలు విధించారు. ఇక్కడ కీలకమైన పరిణామాలు ఉన్నాయి. ఉగ్రవాద ప్రాయోజిత రాజ్యంగా క్యూబాను తిరిగి జాబితాలో చేర్చారు. దీంతో అమెరికా ఎగుమతులపై కఠినమైన నియంత్రణలు, విదేశీ సహాయంపై ఆంక్షలు, అమెరికా వీసాకు కఠినమైన నిబంధనలు , క్యూబా అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలపై స్తంభన వంటివి జరిగాయి. 'పరిమిత జాబితా' పునరుద్ధరణ ద్వారా



231 సంస్థలతో లేదా ప్రభుత్వ సంబంధిత సంస్థలతో వ్యాపారం చేయడం నుండి అమెరికా కంపెనీలు, వ్యక్తులను నిషేధిస్తుంది. క్యూబాలో, కనీసం 16 ఏళ్ళు వయస్సు ఉన్న పౌరులకు ఓటు హక్కు లభిస్తుంది. అంటే క్యూబన్ లు 16 సంవత్సరాలు నిండిన తర్వాత, తమ దేశ ప్రజాస్వామ్య ప్రక్రియల్లో పాల్గొనడానికి అర్హులు. వివాహ వయస్సు విషయానికొస్తే, ఇది కొంచెం సంక్లిష్టంగా ఉంటుంది. క్యూబా చట్టం ప్రకారం, అమ్మాయిలు 14 సంవత్సరాల వయస్సులోనే వివాహం చేసుకోవచ్చు. అయితే అబ్బాయిలు కనీసం 16 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. వారు ఉభయపక్షాల తల్లిదండ్రుల సమ్మతిని పొందాలి. కొన్ని సందర్భాల్లో న్యాయపరమైన ఆమోదం కూడా అవసరం కావచ్చు!

### 66 ఏళ్ళుగా కమ్యూనిస్టు పాలనలోనే

క్యూబా చరిత్రలో ఈ ప్రాంతాన్ని వివిధ శక్తులు పాలించాయి. 1492లో క్రిస్టోఫర్ కొలంబస్ రాకపూర్వం ఈ ద్వీపంలో టైనో, సిబోనీ సహ స్వదేశీ ప్రజలు నివసించారు. కొలంబస్ రాకతో, క్యూబాను స్పెయిన్ జయించి హవానాలో స్పానిష్ గవర్నర్లను నియమించింది. 1898లో స్పానిష్–అమెరికన్ యుద్ధం వరకు స్పెయిన్ దాదాపు నాలుగు శతాబ్దాల పాటు క్యూబాను పాలించింది. యుద్ధం తరువాత స్పెయిన్ ఆ ద్వీపం నుండి వైదొలిగింది! స్పెయిన్ వైదొలిగిన తర్వాత, 1902లో అధికారిక స్వాతంత్ర్యం పొందే వరకు క్యూబా మూడున్నర సంవత్సరాలు అమెరికా సైనిక పాలనలో ఉంది. 1959లో ఫిడెల్ క్యాస్ట్రో నేతృత్వంలోని విప్లవం నియంత ఫుల్జెన్సియో బాటిస్టా పాలనను కూలద్రోసి సోవియట్ యూనియన్ సహకారంతో సామ్యవాద ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. నాటి నుండి క్యూబాను క్యూబా కమ్యూనిస్ట్ పార్టీ పరిపాలిస్తున్నది. ఫిడెల్ కాస్ట్రో ప్రధానమంత్రిగా, తరువాత అధ్యక్షుడిగా, ఆ తరువాత అధ్యక్షుడిగా ఆయన సోదరుడు రాల్ కాస్ట్రో , ప్రస్తుతం మిగ్యూల్ డియాజ్ కానెల్ ఉన్నారు. క్యూబా స్వదేశీ ప్రజలు, స్పానిష్ వలసవాదులు, ఆఫ్రికన్ బానిసలు, అమెరికన్ పెట్టుబడిదారుల ప్రభావాలతో కూడిన సంక్లిష్టమైన చరిత్రను కలిగి ఉంది. క్యూబా సంస్కృతి ఆఫ్రికన్, స్పానిష్, స్వదేశీ సంస్కృతుల ప్రత్యేక సమ్మేళనం. క్యూబా విప్లవం జరిగిన వెంటనే పౌరుల శ్రేయస్సు, అభివృద్ధికి విద్య, ఆరోగ్యం ప్రాముఖ్యతను గుర్తించి వాటికి ప్రాధాన్యతనిచ్చింది. క్యూబా తన వైద్య పరిశోధనలకు, ముఖ్యంగా బయోటెక్నాలజీ , ఔషధాల రంగాలలో కూడా గుర్తింపు పొందింది.

# బిజెపి కట్టడికి 'లౌకిక కూటమి' తప్పదా?



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

కమ్యూనిస్టు పార్టీలకు,మావోయిస్టుల కార్యకలాపాలకు, ప్రజాఉద్యమాలకు,సాయుధ పోరాటాలకు దేశంలోనే తెలంగాణ భూభాగానికి ఒక ప్రత్యేకత ఉన్నది. కానీ ఈ ప్రాంతాల్లో 'కరసేవకులు' పెరిగిపోతుండటం ప్రజాస్వామికవాదులందరినీ ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్ తదితర సంస్థలు కాలికి బలపం కట్టుకొని విస్తృతంగా క్షేత్రస్థాయిలో ప్రచారం సాగిస్తున్నవి. 'హిందుత్వ' వాదాన్ని, దేశభక్తిని జనంలోకి తీసుకువెడుతున్నవి. కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లకు బిజెపి ప్రత్యామ్నాయమని ప్రత్యక్షం గా, పరోక్షంగా జనంలో బలంగా నాటుతున్నారు. ఆయా సంస్థల ప్రతినిధులు ప్రతి ఓటరును టచ్ చేస్తున్నట్టు గ్రామీణప్రాంతా ల నుంచి సమాచారం అందుతున్నది. సంపన్న వర్గాల పార్టీగా, అగ్రవర్ణాల ప్రతినిధిగా, మతతత్వ పార్టీగా ముద్ర ఉన్న బిజెపి ఎస్.సీ, ఎస్.టి, బిసి వర్గాల ఓటర్లను ఆకట్టుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఉత్తర భారతదేశంలో ఫలించాయని ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నవి. ఇక దక్షిణాది వైపు బిజెపి 'ట్రిగ్గర్' కనిపిస్తోంది.

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో పలు చోట్ల ఇంటి గోడలపై 'జై శ్రీరామ్' నినాదం కనిపిస్తోంది. సంఘ్ పరివార్, బిజెపి పుంజుకునేందుకు అనుకూల వాతావరణం ఏర్పడుతోంది. బిజెపిని కట్టడి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో కనిపిస్తున్నారు. గుజరాత్ ఎఐసిసి సమావేశాల్లోనూ ఆయన వ్యాఖ్యలు ఇందుకు అద్దం పట్టాయి. కాంగ్రెస్ పార్టీ ఒక్కటే బిజెపితో తలపడడం వల్ల అంతగా ప్రయోజనం చేకూరకపోవచ్చు.లెఫ్ట్ పార్టీలు, ఇతర ప్రజాతంత్ర, లౌకిక శక్తులతో 'ఐక్య సంఘటన' నిర్మించవలసిన అవసరమున్నది. ఇప్పటికీ తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తీసుకురాగల నాయకత్వాన్ని ఆ పార్టీ ఏర్పర్చుకోలేకపోతోంది. రాజకీయాల్లో ప్రత్యర్థులను బలహీనపరచడంవల్లనో, భావోద్వేగాలను సృష్టించడంవల్లనో లభించే విజయాలు ఎప్పటికైనా తాత్కాలికమే. బిజెపి విషయంలో బిఆర్‌ఎస్ పార్టీలో అంతర్గతంగా విభేదాలున్నట్టు ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ వర్గాలు చెబుతున్నవి.

కాంగ్రెస్ పార్టీని, రేవంత్ రెడ్డిని ప్రధాన శత్రువుగా ఖరారు చేసుకున్నందున, బిజెపి వ్యవహారంలో 'గోడ మీది పిల్లి' వలె బిఆర్‌ఎస్ పనిచేస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు బిజెపి తమ ప్రత్యర్థి అని కెసిఆర్ భావించారు. కానీ పరిస్థితులు అనూహ్యంగా మారిపోయి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ శరవేగంగా పుంజుకొని బిజెపిని 'ఓవర్ ఓవర్ చేసి కెసిఆర్‌తో ముఖాముఖి తలపడింది. అలాగే 2028 నాటికి రాజకీయ పరిణామాలు ఎటువంటి మలుపు తీసుకుంటాయో, ఎవరు ఎవరితో జట్టు కడతారో, ఎవరు ఏ బృందంలో చేరతారో ఇప్పుడే నిర్ధారణకు రాలేం.

''మేము వచ్చే ఎన్నికల్లో సింగిల్ గానే అధికారంలోకి వస్తాం'' అని పదిహేను రోజుల కిందట కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు కాకతాళీయం కాదు. 'సింగిల్' అనే మాట వాడడంలోనే ఏదో గూఢార్థం ఉన్నది. బిజెపితో అవగాహన కుదుర్చుకునే అవకాశం ఉందనో, రెండు పార్టీల మధ్య పొత్తు ఖాయమనో గడచిన ఏడాదికాలంగా ప్రచారం జరుగుతోంది. ఆ ప్రచారాన్ని తోసిపుచ్చడానికే, 'ఒంటరిగా'నే అధికారంలోకి వస్తామని కెసిఆర్ అంటున్నారు. కానీ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు ఎక్కువ. ఆంధ్రప్రదేశ్ లో టిడిపి, బిజెపీ, జనసేన కూటమి ఏర్పడుతుందని ఎవరు ఊహించారు? తెలంగాణలో రేవంత్ రెడ్డి వంటి వ్యక్తి కెసిఆర్ లాంటి పర్వతాన్ని పడగొడతారన్నది ఊహించని సంగతి. కనుక ఏ క్షణాన రాజకీయాల్లో ఎలాంటి 'ఉపద్రవం' వచ్చిపడుతుందో, అది ఏ రూపంలో ఉంటుందో ఊహించలేం.

ఉత్తర తెలంగాణ ఒకప్పుడు మావోయిస్టుల కోట. ఉద్యమాల పురిటి గడ్డ. జగిత్యాల జైత్రయాత్ర, ఇంద్రవెల్లి వంటివి ఎన్నో చారిత్రక సన్నివేశాలు మన కండ్లముందు ప్రత్యక్షమవుతాయి. అయితే కమ్యూనిజం స్థానంలో కాషాయ దళం చిగురు తొడుగుతోంది! ఉత్తర తెలంగాణ 'కాషాయ రంగు' పులుముకుంటున్నట్టు కనబడుతున్న దృశ్యాలు వామపక్ష భావజాల వ్యక్తులు, శక్తులను, ప్రజాస్వామిక వాదులను కలవరపరుస్తోంది.క్రమక్రమంగా బిజెపి పట్టు సాధిస్తోందన్న ఒక వాతావరణం ఏర్పడుతోంది. తెలంగాణ అవతరణ తర్వాత 2014ఎన్నికల్లో టిడిపితో పొత్తు పెట్టుకొని బిజెపి పోటీ చేసింది. ఆ ఎన్నికల్లో ఐదు స్థానాలను గెలుచుకుంది. ఇవన్నీ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోనే.

2018 ఎన్నికలలో రాష్ట్రవ్యాప్తంగా 119 స్థానాల్లోనూ బిజెపి ఒంటరిగా బరిలోకి దిగింది.105 స్థానాల్లో డిపాజిట్లు కూడా దక్కలేదు. హైదరాబాద్ గోషామహల్‌లో మాత్రమే విజయం సాధించింది. అప్పటివరకూ హైదరాబాద్, చుట్టుపక్కల మాత్రమే ప్రాబల్యం కలిగిన బిజెపి పరిస్థితి 2023 ఎన్నికలనాటికి మారిపోయింది. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిజెపి విజయం సాధించింది. మరో 18 అసెంబ్లీ స్థానాల్లో

> **ఉత్తర తెలంగాణ ఒకప్పుడు మావోయిస్టుల కోట. ఉద్యమాల పురిటి గడ్డ. జగిత్యాల జైత్రయాత్ర, ఇంద్రవెల్లి వంటివి ఎన్నో చారిత్రక సన్నివేశాలు మన కండ్లముందు ప్రత్యక్షమవుతాయి. అయితే కమ్యూనిజం స్థానంలో కాషాయ దళం చిగురు తొడుగుతోంది! ఉత్తర తెలంగాణ 'కాషాయ రంగు' పులుముకుంటున్నట్టు కనబడుతున్న దృశ్యాలు వామపక్ష భావజాల వ్యక్తులు, శక్తులను, ప్రజాస్వామిక వాదులను కలవరపరుస్తోంది.**

రెండో స్థానంలో, మరికొన్ని స్థానాల్లో మూడో స్థానంలో నిలిచింది.40 అసెంబ్లీ స్థానాల్లో డిపాజిట్లు దక్కించుకుంది. 2023 ఎన్నికల్లో అత్యధికం ఉత్తర తెలంగాణలో గెలిచారు. సిర్పూర్, ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, ఆర్మూర్, కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల్లో కాషాయ జెండా ఎగరడం కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లకు దిగ్భ్రాంతి కలిగించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో ఒక్క గోషా మహల్‌లో మాత్రమే గెలిచింది. ఈసారి బిజెపి తన ఓటు బ్యాంకును కూడా గణనీయంగా పెంచుకుంది. 2018లో కేవలం 6.98 శాతం ఓట్లు సాధించిన బిజెపి, 2023 ఎన్నికల్లో 13.90 శాతం ఓటు బ్యాంకును సొంతం చేసుకుంది. బిజెపి అభ్యర్థులు గెలుపొందిన నిర్మల్‌లో 44 శాతం ఓటింగ్, ఆర్మూర్‌లో 31 శాతం, సిర్పూర్‌లో 30 శాతం వచ్చాయి. హుజూరాబాద్, గజ్వేల్ సహా మరో 12 నియోజకవర్గాల్లో బిజెపి 20 శాతం ఓటు బ్యాంకును సొంతం చేసుకుంది.

గిరిజన ప్రాంతాల్లో బిజెపి పాగా వేయడంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. గతంలో మావోయిస్టులకు బాగా పట్టున్న ప్రాంతాల్లో బిజెపి, దాని అనుబంధ సంస్థలు చాప కింద నీరులా విస్తరించాయి. ఊరూరా ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. బిసి సామాజిక వర్గాలను,యువతను తమ వైపు తిప్పుకోవడంలో బిజెపి సక్సెస్ అవుతోంది. ప్రతి గ్రామంలో హనుమాన్ ఆలయాలు, వ్యాయామ శాలలను ఏర్పాటు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు హెగ్డేవార్ పూర్వీకుల స్వస్థలం నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి కావడంతో గత దశాబ్దకాలంలో చాలామంది యువత ఆర్ఎస్ఎస్ భావజాలం పట్ల ఆకర్షితులవుతున్నట్టు తెలిసింది.

2014కు ముందు తెలంగాణలో ఆర్‌ఎస్‌ఎస్ శాఖలు 1600 దాకా ఉండగా ప్రస్తుతం 3 వేలకు పైగా పెరిగినట్టు ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు చెబుతున్నారు. హిందుత్వ భావజాల వ్యాప్తిలో సరస్వతి విద్యామందిర్‌లు, శిశుమందిర్‌లు కీలక పాత్రను పోషిస్తున్నాయి. అడవుల్లో విశ్వ హిందూ పరిషత్ కు అనుబంధంగా పనిచేస్తున్న వనవాసీ కల్యాణ పరిషత్ సంఘాలు కీలక పాత్రను పోషిస్తున్నాయి. ముస్లిం మైనారిటీలు ఎక్కువగా ఉండే హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో బిజెపి బలపడుతున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నవి. క్షేత్రస్థాయిలో కార్యకర్తల సమావేశాలు తరచూ నిర్వహిస్తూ 'క్యాడర్'ను బలోపేతం చేస్తున్నారు. కేంద్రంలో తమ పార్టీ అధికారంలో ఉండటం పార్టీ విస్తరణలో తమకు సానుకూల పరిస్థితులు ఏర్పడినట్టు బిజెపి నాయకులంటున్నారు.

దేశమంతటా హిందూత్వ ప్రయోగం ముందుకు సాగుతున్నట్లు కనపడుతున్నప్పటికీ కర్ణాటకలో మాత్రం లింగాయత్‌ల అదుపులో ఉన్నట్లు స్పష్టమవుతోంది. అక్కడ పార్టీలో ఉన్న అంతర్గత పోరాటాన్ని అధిష్ఠానం అరికట్టలేకపోతోంది. యడ్యూరప్పను, ఆయన కుమారుడు విజయేంద్రను మచ్చిక చేసుకునేందుకుగాను బలమైన ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్‌ను పార్టీ నుంచే బహిష్కరించారు. బిజెపికి కర్ణాటకలో భవిష్యత్ లేదని త్వరలో ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని యత్నాల్ ప్రకటించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను అప్రతిష్ఠపాలు చేసేందుకు ముడా కుంభకోణాన్ని లేవనెత్తి, ఇడిని ప్రయోగించినా బిజెపి విజయవంతం కాలేకపోయింది. సంఘ్ హేమాహేమీలు దత్తాత్రేయ హోసబలె, సిఆర్ ముకుంద్, ప్రస్తుతం జాతీయ స్థాయిలో సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా ఉన్న సంతోష్, హెచ్‌వి శేషాద్రి, పద్మనాభాచార్య తదితరులు ఆ రాష్ట్రానికి చెందినవారే. ఒకప్పటి సర్ సంఘ్ చాలక్ సుదర్శన్ కూడా మైసూరుకు చెందినవారే. నిజానికి మహారాష్ట్ర తర్వాత అత్యధిక సంఖ్యలో అగ్రశేణి సంఘ్ నేతలు కర్ణాటక నుంచే వచ్చారు. కాని అదే కర్ణాటకలో ఇప్పుడు బిజెపి రాజకీయ భవిష్యత్తు డోలాయమాన పరిస్థితిలో ఉన్నది. సంతోష్ జీ వల్లే దక్షిణాదిలో బిజెపి దెబ్బతిన్నదని విమర్శలున్నాయి.

1947లోనే గోల్వాల్కర్ హైదరాబాద్‌కు రహస్యంగా వచ్చారు.1949లో శ్రీరాంసాథే ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలను ప్రారంభించారు. నృపతుంగ, కేశవ మెమోరియల్ లాంటి విద్యాసంస్థలను సంఘ్ అభిమానులను ప్రారంభించారు. నక్సల్బరీ ఉద్యమానికి పోటీగా 1967లోనే ఎబివిపి ఏర్పడింది. తొలి ఎబివిపి విద్యార్థి సదస్సు 1967 జూలైలో జరిగింది. క్రమంగా ఎబివిపి తెలంగాణలోని అనేక కాలేజీల్లో బలపడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యామ్నాయ భావజాలం బలంగా ఉండడం వల్ల జనసంఘ్ ఉనికి ఏర్పర్చుకోలేకపోయింది.1983 నుంచి తెలుగుదేశం బలమైన ప్రాంతీయ పార్టీగా ఏర్పడడంతో బిజెపి నిలదొక్కుకోలేకపోయింది. తెలంగాణలో ప్రతిపక్ష స్థానంలోకి వెళ్ళిపోయిన బిఆర్‌ఎస్ త్వరలోనే పూర్తిగా ''బలహీనపడిపోతుంద''ని ఇటీవల తెలంగాణ బిజెపి నాయకులతో కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా అన్నారు.''మీరంతా కలిసికట్టుగా పనిచేస్తే తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం తథ్యం'' అని కూడా షా వ్యాఖ్యానించినట్టు వార్తలు వచ్చాయి.

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఆటోను ఢీకొన్న బస్సు.. ఆరుగురు మృతి

**పటాన్ (గుజరాత్) :** గుజరాత్‌లోని పటాన్ జిల్లాలో గురువారం రాష్ట్ర రవాణా బస్సును ఆటో ఢీకొనడంతో ఆటోరిక్షాలో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తులు మరణించినట్లు పోలీసులు తెలిపారు. సమీరధన్‌పూర్ హైవేపై సమీ గ్రామ సమీపంలో ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు ఒక అధికారి తెలిపారు. రాష్ట్ర రవాణా బస్సు హిమ్మతనగర్ నుండి కచ్ వైపు వెళ్తుండగా, ఆటో ఎదురుగా వస్తోందని పటాన్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వికె నయీ తెలిపారు. డ్రైవర్‌తో సహా ఆటోరిక్షాలో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారని నయీ చెప్పారు. ప్రాథమిక వివరాల ప్రకారం మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో బస్సు అదుపుతప్పి ఆటోను ఢీకొన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు విచారణ ప్రారంభించినట్లు నయీం తెలిపారు. ప్రమాదం గురించి తెలియగానే ఘటనా స్థలానికి చేరుకున్న రాధన్‌పూర్ ఎమ్మెల్యే, బీజేపీ నేత లవింగ్‌జీ ఠాకూర్, ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు.

# బెంగాల్ టీచర్లకు స్వల్ప ఊరట

## నూతన నియామకాలు చేపట్టేవరకూ ఉద్యోగాల్లో కొనసాగడానికి 'సుప్రీం' గ్రీన్‌సిగ్నల్

### మే 31 నాటికి కొత్త నియామకాలు చేపట్టాలని బెంగాల్ ప్రభుత్వానికి ఆదేశం



**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్‌లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న 25,753 మంది టీచర్లు, ఇతర సిబ్బంది నియామకం చెల్లుబాటు కాదంటూ ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. అయితే ఈ వ్యవహారంలో కొందరు టీచర్లకు స్వల్ప ఊరట లభించింది. నియామక ప్రక్రియ ద్వారా ఎంపికై, ఎలాంటి ఆరోపణలు లేని, 9–12 తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులను కొనసాగించడానికి అనుమతించింది. కొత్త నియామక ప్రక్రియ పూర్తయ్యేవరకు వారు బోధన కొనసాగించొచ్చని చెప్పింది. విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌కు ఒక డెడ్‌లైన్ విధించింది. మే 31లోగా కొత్త రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోసం ప్రకటన ఇవ్వాలని ఆదేశించింది. అలాగే ఎంపిక ప్రక్రియ డిసెంబర్ 31లోగా పూర్తికావాలని స్పష్టంచేసింది. దీనికి సంబంధించి మే 31లోగా రాష్ట్ర ప్రభుత్వం, కమిషన్ అఫిడవిట్ దాఖలు చేయాలి అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశాలు జారీ చేశారు. ఇక ఈ స్వల్ప ఊరట గ్రూప్ – సి, గ్రూప్ –డి ఉద్యోగులకు వర్తించదు. టీచర్ల నియమకాన్ని రద్దు చేస్తూ ఈనెల ప్రారంభంలో సుప్రీం తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. వీరి నియామక ప్రక్రియ యావత్తూ అక్రమాలతో కూడుకొని ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. టీచర్లు, ఇతర సిబ్బంది నియామకాన్ని రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు గత సంవత్సరం ఏప్రిల్‌లో వెలువరించిన తీర్పును సుప్రీం ధర్మాసనం సమర్థించింది. ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లు, సిబ్బంది ఇప్పటివరకూ తాము పొందిన జీతభత్యాలను తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. మానవీయ కారణాలరీత్యా కొందరు దివ్యాంగులకు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈ తీర్పు నుంచి మినహాయింపు ఇచ్చి వారు ఉద్యోగంలోనే ఉంటారని స్పష్టంచేసింది. వివాదాస్పదంగా మారినఈ నియామకాలు 2016లోనే జరిగాయి. అయితే సుప్రీం ఆదేశాలతో పలు పాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడింది. విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతుందంటూ బెంగాల్ ప్రభుత్వం పిటిషన్ వేసిన నేపథ్యంలో ఈ తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

### తీర్పును స్వాగతించిన మమత

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను స్వాగతించారు. గతంలో నియామకాలు రద్దు చేయబడిన కళంకం లేని ఉపాధ్యాయుల సేవలను పొడిగించడం ఉపశమనం కలిగిస్తుందన్నారు. విద్యావేత్తలు ఆందోళన చెందవద్దని కోరారు. సమస్య పరిష్కారం అవుతుందనిహామీ ఇచ్చారు.

## 'నరేగా' కార్మికుల అణచివేత

### మోదీ ప్రభుత్వం పేదల వ్యతిరేకి : ఖర్గే

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా మండిపడ్డారు. మోదీ సర్కార్ పేదల వ్యతిరేకి అని, జాతీయ ఉపాధి హామీ పథకం కార్మికులను అణచివేతకు పాల్పడుతోందని విమర్శించారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ. 400 కూలీ చెల్లించడంతో పాటు, సంవత్సరానికి 150 రోజులు పని కల్పించాలన్న కాంగ్రెస్ డిమాండ్‌ను ఖర్గే పునరుద్ఘాటించారు. రెండు ప్యానళ్లు సిఫార్సు చేసినప్పటికీ సాధారణ వార్షిక పెంపుతో పాటు రోజువారీ వేతనం ఈ ప్రభుత్వం గణనీయంగా పెంచే అవకాశం లేదని మీడియా వచ్చిన కథనాలను ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనిబట్టి ఈ పేదల వ్యతిరేక మోదీ ప్రభుత్వం నరేగా వేతనాలను పెంచేందుకు నిరాకరిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. ఈ చర్య ఉపాధి హామీ కార్మికుల హక్కులపై దాడిలాంటి దేనన్నారు. ఇటీవల పార్లమెంటరీ సంయుక్త కమిటీ ఉపాధిహామీ పథకం కార్మికులకు రోజు వారీ వేతనం రూ. 400లకు పెంచాలని సిఫార్సు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఖర్గే గుర్తుచేశారు. అమర్‌జీత్ సిన్హా నేతృత్వంలో 2023లో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ కూడా నరేగా పథకానికి బడ్జెట్‌ను పెంచాలని, వేతనాలు పెంచాలని సూచించింది. కానీ, పేదల వ్యతిరేక మోదీ ప్రభుత్వం నరేగా కార్మికులను అణచివేతకు పాల్పడుతోందని ఖర్గే ఆరోపించారు. ఆధార్ ఆధారిత చెల్లింపు షరతు విధించి దాదాపు ఏడు కోట్ల మంది నమోదిత కార్మికులను పథకం నుండి మినహాయించడం, గత 10 సంవత్సరాలలో మొత్తం బడ్జెట్‌తో పోలిస్తే నరేగాకు అతి తక్కువగా బడ్జెట్‌ను కేటాయించారన్నారు. దీంతో మోదీ ప్రభుత్వం నరేగాపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని ఆయన అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ మన దేశంలోని అత్యంత పేద కుటుంబాల కోసం తీసుకువచ్చిందన్నారు. అయితే ఇప్పుడు కార్మికులకు రోజుకు కనీస వేతనం రూ. 400 నిర్ణయించాలని, వారికి సంవత్సరానికి కనీసం 150 రోజులు పని కల్పించాలనే డిమాండ్లకు తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు.

## చోక్సీ అప్పగింతపై బెల్జియంతో భారత్ చర్చలు

**న్యూఢిల్లీ:** ఆర్థిక నేరస్తుడు మెహుల్ చోక్సీని భారత్‌కు అప్పగించే విషయంలో బెల్జియం అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ గురువారం తెలిపారు. 'భారత ప్రభుత్వ అధికారిక విజ్ఞప్తి మేరకు చోక్సీని బెల్జియం, ఆట్వెప్‌లో శనివారం అరెస్టు చేశారు. అతనిని భారత్‌కు అప్పగించడంపై చర్చలు జరుగుతున్నాయి' అని జైశ్వాల్ చెప్పారు. దిల్లీలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చోక్సి నిర్బంధంలో ఉన్నట్లు బెల్జియం ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ ఆఫ్ జస్టిస్ ధ్రువీకరించిందని చెప్పారు. కాగా, చోక్సీని తమకు అప్పగించాలని భారత్ కోరినట్లు బెల్జియం అధికారులు వెల్లడించారు. చోక్సీ 2018, జనవరి 2న విదేశాలకు తప్పించుకుపోగా, పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.13,850 కోట్ల కుంభకోణానికి సంబంధించిన ఆర్థిక నేరస్తుడిగా అతను ఉన్నాడు. చోక్సీ అరెస్టు తర్వాత అతని తరపు న్యాయవాది విజయ్ అగర్వాల్ స్పందించారు. చోక్సీని భారత్‌కు అప్పగిస్తే ఆయన మానవ హక్కులను ఉల్లంఘించినట్లు అవుతుందని అన్నారు.

## లోకో పైలట్ల అమానవీయ పరిస్థితులపై

# రాహుల్‌గాంధీ మండిపాటు

**న్యూఢిల్లీ :** లోకో పైలట్ల పని పరిస్థితులపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గురువారం ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'అమానవీయ' పరిస్థితుల్లో పనిచేయిస్తూ వారికి అన్యాయం చేయడమే కాకుండా రైళ్లలో ప్రయాణించే కోట్లాది మంది ప్రయాణికుల భద్రతతో ఆడుకుంటున్నారన్నారు. రైల్వేలు విరామం డిమాండ్‌ను తిరస్కరించాయని, మహిళా సిబ్బంది టాయిలెట్ సౌకర్యం లేకుండా ఎనిమిది గంటల డ్యూటీ చేయాల్సి వచ్చిందనిమీడియాతో వచ్చిన కథనాలను రాహుల్‌గాంధీ ఎక్స్‌లో షేర్ చేశారు. గత సంవత్సరం తాను రైల్వే లోకో పైలట్లను కలిసినప్పుడు 14 గంటల షిఫ్టులు, నిరంతర రాత్రి డ్యూటీ, తగినంత విశ్రాంతి లేకపోవడం, ఆహార విరామం లేకపోవడం, టాయిలెట్ సౌకర్యాలు లేకపోవడం వంటి వారి పరిస్థితులు తెలిసి తనకు ఆందోళన కలిగించిందన్నారు.ప్రమాదాలతర్వాతరైల్వేదానిని మానవ తప్పిదం అంటూ పేర్కొని బాధ్యత నుండి తప్పించుకుంటుందని, కానీ ఉద్యోగులను అమానవీయ రీతిలో ఎలా పని చేయిస్తారో వివరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ప్రాథమిక డిమాండ్లు స్థిర పని గంటలు, మెరుగైన వాతావరణమని, కానీ ప్రభుత్వం నామమాత్రంగా ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, పరిష్కారం కనుగొనే ఉద్దేశం లేదని ఆరోపించారు. ఇప్పుడు ఆహారం, టాయిలెట్ బ్రేక్ వంటి డిమాండ్లను కూడా ఆచరణాత్మకంకాదుఅంటూ తిరస్కరించిందన్నారు.ఈ చర్య లోకో పైలట్లకు అన్యాయం చేయడమే కాకుండా, రైళ్లలో ప్రయాణించే కోట్లాది మంది ప్రయాణికుల భద్రతతో ఆటలాడుకోవడమేనని రాహుల్ ఉద్ఘాటించారు. న్యాయం కోసం పోరాటంఅని,తామువారికిఅండగా ఉంటామని, ప్రభుత్వం వారి డిమాండ్లను పెడచెవిన పెట్టకుండా అమలుపరిచేంతవరకుతమగళాన్ని వినిపిస్తూనే ఉంటామన్నారు.

### అమెరికా పర్యటనకు వెళ్లనున్న రాహుల్ గాంధీ

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈనెల 21, 22 తేదీల్లో యుఎస్‌లో పర్యటించనున్నారు. ఆ పార్టీ నేత పవన్ ఖేరా గురువారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. తన పర్యటనలో రాహుల్ రోడ్ ఐలాండ్‌లోని బ్రౌన్ యూనివర్సిటీని సందర్శిస్తారని తెలిపారు. అక్కడ విద్యార్థులు, అధ్యాపకులతో చర్చల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఎన్నారై సంఘాలు, ఇండియా ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులతో రాహుల్ సమావేశం కానున్నట్లు తన పోస్ట్‌లో వెల్లడించారు. కాగా, గతంలో రాహుల్ గాంధీ విదేశాల్లో పర్యటించిన సమయంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. గత పర్యటనల్లో రాహుల్.. భారత్‌లో మత స్వేచ్ఛ, రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలపై చేసిన వ్యాఖ్యలు పెద్ద ఎత్తున చర్చకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో తాజా పర్యటనలో ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారో అన్న చర్చ జరుగుతోంది.

## అడిగిందే.. అడుగుతున్నారు...!

### 'ఇడి'పై రాబర్డ్ వాద్రా అసహనం

**న్యూఢిల్లీ :** హర్యానాలోని భూ ఒప్పందానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపి ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా గురువారం మూడోరోజు ఇడి విచారణకు హాజరయ్యారు. ఆయన ఓ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇడి కొత్త ప్రశ్నలేవీ అడగటం లేదంటూ అసహనం వ్యక్తంచేశారు. 'ఇడి అదే ప్రశ్నలు వేస్తోంది. 2019లోనూ దర్యాప్తు సంస్థ అధికారులు ఇవే ప్రశ్నలు అడిగారు. కొత్తగా ఏమీ లేదు. ఇది ఈ ప్రభుత్వం మమ్మల్ని తప్పుగా చూపించే ప్రచార శైలి. దీన్ని తట్టుకునే శక్తి మాకు ఉంది' అని వాద్రా పేర్కొన్నారు. ఈసందర్భంగా ఇడి చర్య తనపై తన కుటుంబంపై జరుగుతున్న రాజకీయ ప్రతీకారంగా పేర్కొన్నారు. ఈ రోజు విచారణకు కూడా వాద్రా వెంట ఆయన సతీమణి ప్రియాంక వచ్చారు. ఈ కేసుకు సంబంధించి వాద్రాకు ఇడి మంగళవారం నోటీసులు జారీ చేసి తమముందు హాజరుకావాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. గత రెండు రోజుల్లో పది గంటల పాటు ఆయన వాంగ్మూలాన్ని అధికారులు రికార్డు చేశారు. బుధవారం విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను గాంధీ కుటుంబంలో భాగం కావడం వల్లే తనను లక్ష్యంగా చేసుకున్నారన్నారు. అదే తాను బిజెపిలో చేరి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. అలాగే తాను త్వరలోనే రాజకీయాల్లోకి వస్తానని తెలిపారు.

## బిజెడి అధ్యక్ష పదవికి నవీన్ పట్నాయక్ నామినేషన్


**భువనేశ్వర్ :** బిజెడి అధ్యక్ష పదవికి ఒడిశా అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ గురువారం శంఖా భవన్‌లో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇప్పటివరకు ఈ పదవికి ఆయన ఒక్కరే నామినషన్ దాఖలు చేశారు. 1997లో పార్టీ స్థాపించినప్పటి నుండి పట్నాయక్ వరుసగా ఎనిమిది సార్లు బిజెడి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన చివరిసారిగా ఫిబ్రవరి 2020లో ఈ పదవికి ఎన్నికయ్యారు. పట్నాయక్ తన తండ్రి బిజు పట్నాయక్ 28వ వర్ధంతి సందర్భంగా నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆయన పేరు మీదే ప్రాంతీయ పార్టీ బిజు జనతాదళ్ అని పెట్టారు. 2000 నుండి 2024 వరకు బిజెడి ప్రభుత్వం ఒడిశాకు గణనీయమైన అభివృద్ధిని సాధించిందని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తెచ్చిందని అన్నారు. బిజెపి పేరును నేరుగా పేర్కొనకుండా, పట్నాయక్ మాట్లాడుతూ ఇప్పుడు కొంతమంది మన వారి సహకారం, త్యాగాలను కించపరచడానికి ఉద్దేశపూర్వకంగా ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. చరిత్రను మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, కానీ చరిత్ర కాలక్రమేణా దేశం అనుసంధాన అనుభవాన్ని ప్రతిబింబిస్తుందని వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

## 22మంది నక్సలైట్ల అరెస్ట్

**బీజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మూడు చోట్ల 22 మంది నక్సలైట్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు. కోబ్రా, స్థానిక పోలీసుల సంయుక్త బృందం ఏరియా ఆపరేషన్‌లో ఉన్నప్పుడు ఉసూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని టెక్మెట్ల సమీపంలోని అడవి నుండి ఏడుగురు దిగువ స్థాయి క్యాడర్‌లను మంగళవారం పట్టుకున్నారని అధికారి తెలిపారు. జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్చర్‌లోని కోటల నుండి మరో ఆరుగురు నక్సలైట్లను అరెస్టు చేయగా, నెల్నార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కందకర్కలోని అడవి నుండి తొమ్మిది మంది క్యాడర్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న నక్సలైట్ల నుంచి టిఫిన్ బాంబులు, జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, విద్యుత్ వైర్లు, బ్యాటరీలు, మావోయిస్టుల కరపత్రాలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# 2026 నాటికి నక్సలిజం.. ఇక చరిత్రే

### సిఆర్‌పిఎఫ్ 86వ 'రైజింగ్ డే'లో అమిత్ షా



**నీముచ్ :** నక్సలైట్లు కేవలం నాలుగు జిల్లాలకే పరిమితమై ఉన్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు నక్సల్స్ అంతం అవుతారని ఆయన పేర్కొన్నారు. నక్సల్స్‌ను రూపుమాపడంలో.. సిఆర్‌పిఎఫ్ వెన్నుముఖగా నిలిచినట్లు ఆయన చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని నీముచ్ జిల్లాలో గురువారం సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్‌కు చెందిన 86వ రైజింగ్ డే ఫంక్షన్ జరిగింది. అమిత్‌షా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంనుంచి నక్సలైట్లను ఏరివేయడంలో సిపిపిఎఫ్(సెంట్రల్ ఆర్మ్డ్ పోలీసు ఫోర్సెస్) తోపాటు సిఆర్‌పిఎఫ్‌కు చెందిన కోబ్రా బెటాలియన్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్(కోబ్రా) యూనిట్.. భద్రతా దళాల్లో ప్రత్యేకంగా పనిచేస్తున్నది. గెరిల్లా, జంగిల్ యుద్ధాల్లో ఆ దళం ఆరితేరి ఉన్నది. నక్సల్స్‌ను ఎదుర్కోవడంలో కోబ్రా దళం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నదన్నారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో సుమారు 400 ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్‌లను ఏర్పాటు చేసినట్లు షా వెల్లడించారు. దీని వల్లే ఈ ప్రాంతాల్లో హింస తగ్గిందన్నారు. సుమారు 70 శాతం హింస తగ్గినట్లు చెప్పారు. ఇప్పుడు చివరి దశకు చేరుకున్నట్లు ఆయన తెలిపారు. దేశ భద్రత కోసం సీఆర్పీఎఫ్ చేసిన సేవలు అసాధారణమైనవని పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాడటంలోనైనా, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి నెలకొల్పాలన్నా, నక్సలైట్లను ఎదుర్కోవాలన్నా.. సిఆర్‌పిఎఫ్ చేస్తున్న పోరాటం అసామాన్యమైందన్నారు. ప్రతి అచీవ్‌మెంట్‌లో సిఆర్‌పిఎఫ్ జవాన్ల పాత్ర కీలకంగా ఉన్నట్లు చెప్పారు. సిఆర్‌పిఎఫ్ సాధించిన అతి గొప్ప విజయాల్లో.. నక్సలిజాన్ని పారద్రోలడమే అని తెలిపారు. కోబ్రా కమాండోల గురించి విన్నప్పుడు నక్సల్స్ వణికిపోతున్నారన్నారు. ధైర్యానికి ప్రతీకగా కోబ్రా బెటాలియన్ నిలిచిందన్నారు. 86వ రైజింగ్ డే సందర్భంగా కోబ్రా యూనిట్ జవాన్లకు కంగ్రాట్స్ చెబుతున్నట్లు షా వెల్లడించారు. మీ నేతృత్వంలో సిఆర్‌పిఎఫ్ జవాన్లు .. నక్సలిజం రూపుమాపడంలో ముందుకెళ్లినట్లు చెప్పారు. 2026 మార్చి 31వ తేదీ నాటికి దేశం నుంచి నక్సలిజం పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని షా తెలిపారు. దేశం ఈ ప్రతిజ్ఞ తీసుకున్నదని, ఇక సిఆర్‌పిఎఫ్ వెన్నుముఖగా ఉందన్నారు. వాస్తవానికి ప్రతి ఏడాది మార్చి 19వ తేదీన సిఆర్‌పిఎఫ్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1950వ సంవత్సరంలో ఈ రోజునే కేంద్ర హోంమంత్రి వల్లభాయ్ పటేల్ జెండాను దళానికి అందజేశారు. అయితే ఈ ఏడాది సంబరాలను పొడిగించిన నేపథ్యంలో ఏప్రిల్ 17వ తేదీన పరేడ్ నిర్వహించారు. మధ్యప్రదేశ్ సిఎం మోహన్ యాదవ్ కూడా ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు. అయితే మధ్యప్రదేశ్‌లోని నీముచ్ జిల్లాలో 1939, జూలై 27వ తేదీన బ్రిటీష్ పాలకులు క్రౌన్ రిప్రజెంటేటివ్ పోలీసు శాఖను ఏర్పాటు చేశారు. దాన్నే 1949, డిసెంబర్ 28వ తేదీన సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్‌గా హోంమంత్రి పటేల్ మార్చేశారు.

## 1961 ఎన్నికల నియమావళికి తాజా సవరణలపై స్పందించేందుకు

# ఇసికి 'సుప్రీం' మూడు వారాల గడువు



### కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్, ఇతరులు పిటిషన్లు దాఖలు

**న్యూఢిల్లీ :** 1961 ఎన్నికల నియమావళికి ఇటీవల చేసిన సవరణలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్ అభ్యర్థనలపై స్పందించేందుకు గురువారం సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికి మూడు వారాల గడువు ఇచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం జైరామ్ రమేష్ పిటిషన్‌పై జనవరి 15న కేంద్రానికి, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీచేసి స్పందన కోరింది. సీనియర్ అడ్వకేట్ మనీందర్ సింగ్ ఎన్నికల సంఘం తరపున హాజరై దీనికి సమాధానం ఇచ్చేందుకు మూడు వారాల గడువు ఇవ్వాలని అత్యున్నతన్యాయస్థానాన్ని కోరారు. కాగా, మనీందర్‌సింగ్ అభ్యర్థనపై స్పందించిన ధర్మాసనం పిటిషన్ విచారణకు జులై 21ను ఖరారు చేసింది. జైరామ్ రమేష్‌తో పాటు, మరో ఇద్దరు శ్యామ్‌లాల్ పాల్, హక్కుల కార్యకర్త అంజలి భరద్వాజ్ దాఖలు చేసిన రెండు ప్రజాప్రయోజనాల వ్యాజ్యాలు (పిల్స్) కూడా పెండింగ్‌లో ఉన్నాయి. జైరామ్ రమేష్ తరపున సీనియర్ అడ్వకేట్లు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ ప్రాతినిధ్యం వహించారు.1961 ఎన్నికల నియమావళికి సవరణలు చాలా తెలివిగా చేశారని, ఓటరు గుర్తింపును బహిర్గతం చేస్తుందని పేర్కొంటూ సిసిటివి ఫుటేజీకి ప్రాప్యతను నిషేధించిందని పిటిషనర్లు చెప్పారు. సిసిటివి ఫుటేజీలు ఓట్లను బహిర్గతం చేయలేవని, ఓటింగ్ ఎంపికలు ఎప్పుడూ వెల్లడించలేదని అభిషేక్ సింఘ్వీ ఇంతకుముందు చెప్పారు. ఎన్నికల సంఘాన్ని, కేంద్రాన్ని తదుపరి తేదీ విచారణ ముందు వారి ప్రతిస్పందనలను దాఖలు చేసేలా చూడాలని ధర్మాసనాన్ని కోరారు. జైరామ్ రమేష్ అభ్యర్థన డిసెంబరులో దాఖలు చేయబడింది.ఎన్నికల ప్రక్రియకు సంబంధించి వేగంగా క్షీణిస్తున్న సమగ్రత'ను పునరుద్ధరించడానికి సహాయపడుతుందని రమేష్ తన అభ్యర్థనలో ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. దుర్వినియోగాన్ని నిరోధించడానికి అభ్యర్థుల వీడియో రికార్డింగ్స్ సహా సిసిటివి కెమెరా, వెబ్ కాస్టింగ్ ఫుటేజీ వంటి కొన్ని ఎలక్ట్రానిక్ పత్రాలను తనిఖీ చేయకుండా నిరోధించడానికి ప్రభుత్వం ఎన్నికలనియమావళిని సవరించింది.ఎన్నికల ప్రక్రియ సమగ్రత వేగంగా క్షీణిస్తున్నదని, దానిని పునరుద్ధరించడానికి సుప్రీంకోర్టుసహాయపడుతుందనిజైరామ్‌రమేష్ చెప్పారు. ఎన్నికలసంఘం సిఫారసుఆధారంగా కేంద్రన్యాయ మంత్రిత్వశాఖడిసెంబరులో1961నియమావళికి సంబంధించినరూల్ (93)(2)(a)సవరణలు చేసింది. సంబంధిత పత్రాలు, డాక్యుమెంట్ల రకాన్ని బహిరంగ తనిఖీ కోసం ఓపెన్‌చేయడాన్ని నియంత్రించింది. పిటిషనర్ తన అభ్యర్థనలో సవరణ గురించి తెలియజేస్తూ ఎన్నికల నియమావళి కండక్ట్ రూల్ 93(2) (a) ప్రకారం ఎన్నికల సంబంధిత రికార్డులను పబ్లిక్ యాక్సెస్‌ను నియంత్రించి, కుదించాలని అభ్యర్థించింది. ఎన్నికలకు సంబంధించిన కొత్త సవరణ నిబంధనలలో పేర్కొన్న విధంగా ఇతర పత్రాలనుబహిరంగతనిఖీకోసం సవరించినట్లు పేర్కొంది. ఈ సవరణ ఎన్నికల రికార్డుల బహిరంగ స్క్రూటినీలో పారదర్శకత తగ్గడానికి దోహదపడిందని పిటిషన్ ఆరోపించింది. ఎన్నికల పత్రాలకు ప్రాప్యతను పరిమితం చేయడం ద్వారా ఈ సవరణ సమాచార హక్కు చట్టం స్ఫూర్తికి విరుద్ధంగా ప్రభుత్వ జవాబుదారీతనాన్ని, పారదర్శకతను బలపరుస్తుందని వెల్లడించింది.

# లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం

**ప్రజాపక్షం/చర్ల :** మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోతే పునరావాసం కల్పిస్తామని ఎస్‌పి రోహిత్‌రాజ్ అన్నారు. గురువారం చర్ల మండలం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దున ఉన్న పూసుగుప్ప గ్రామం నుండి ఛత్తీస్‌గఢ్ బోర్డర్ వరకు రూ.3 కోట్లతో నిర్మించిన అంతరాష్ట్ర రహదారిని ఆయన ప్రారంభించారు.ఎస్‌పి విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో నెలరోజులపాటుభద్రతాబలగాల పహారా నడుమ 1.9కి.మీదూరంవరకు రహదారి నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ రహదారి పూర్తి కావడంతో తెలంగాణఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు పెరిగి సమీప అటవీ గ్రామాల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. క్రమంగా మావోయిస్టుల ప్రభావం తగ్గుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సరెండర్ పాలసీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ప్రవేశపెట్టిన చేయూత పథకం పట్ల ఆకర్షితులై ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 220 మంది మావోయిస్టులులొంగిపోయినట్లు ఎస్‌పి చెప్పారు. లొంగిపోయిన వారికి పునరావాస పథకం ద్వారా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి రెండేళ్ల క్రితం 44 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉండగా చేయూత పథకానికి ఆకర్షితులై పెద్ద సంఖ్యలో లొంగిపోయారని, ఇకా ఆరుగురు మాత్రమే అడవుల్లో ఉన్నారన్నారు. వారిని కూడా జనజీవన స్రవంతి లోనికి తీసుకొచ్చే ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పూసుగుప్ప, చెన్నాపురం వంటి మారుమూల గ్రామాల్లో అతిత్వరలో సకల సౌకర్యాలతో ఆస్పత్రులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎస్‌పి రాక సందర్భంగా చర్ల సిఐ రాజువర్మ ఆధ్వర్యంలో పోలీస్, సిఆర్‌పిఎఫ్ బలగాలు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్ తోపాటు ఎస్‌బి సిఐ శ్రీనివాస్, చర్ల సిఐ రాజువర్మ, ఎస్‌ఐ నర్సిరెడ్డితో పాటు సిబ్బంది ఉన్నారు.


SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS12UA 8875 | Srilatha Illendala | EIDHER 11.10 FBT | 2010 |
| 2 | TG261072 | Ravi Kodi | KUBOTA MU4501 | 2023 |
| 3 | TS02UA 3901 | Veeranna Vankudothu | MAHINDRA 475 DI | 2014 |
| 4 | TS26T 2010 | Gugulothu Sunitha | MAHINDRA BOLLERO MAXI TRUCK PLIS | 2017 |
| 5 | MACH 4241 | Anusha Nomula | KUBOTA DC 68G COMBINE HARVESTER | 2020 |

AUCTION DATE:19-04-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి ఐంది అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

H.No :15-1-237, Shop No. 1, 2 & 3, 2nd Floor Warangal City Center, Opp : L B College, Mulugu Road, Cell : 9000230006, 8008900443



# జనరల్

STATE & REGIONAL NEWS

## రాష్ట్ర ఆర్థిక వృద్ధి బాగా పడిపోవడం ఆందోళనకరం : హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధి గణనీయంగా పాడిపోతుండటం ఆందోళనకరమని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఇటీవల విడుదలైన కాగ్ మంత్లీ కీ ఇండికేటర్ల ప్రకారం, రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం 2023–24లో రూ.1,24,146.19 కోట్లు కాగా, 2024–25 నాటికి రూ.1,24,054.38 కోట్లకు చేరి, రూ.91.81 కోట్ల తగ్గినట్లు నమోదైందని తెలిపారు. 'కొవిడ్ 19 మహమ్మారి' సమయంలో తప్ప రాష్ట్రంలో ఇంతటి తగ్గుదల ఎప్పుడూ కనిపించలేదని, 2014–15 నుండి 2022–23 వరకు బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ 12 శాతం కాగ్ సిఎజిఆర్‌తో సొంత పన్నుల ఆదాయ వృద్ధిని సాధించిందని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలు, అవగాహన లేని పాలన రాష్ట్ర వృద్ధి తగ్గుదలకు కారణమయ్యాయని ఆరోపించారు.



## కీహోల్ శస్త్రచికిత్సతో మూత్రనాళాలు మార్చిడి

డాక్టర్ వి. చంద్రమోహన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కీహోల్ శస్త్రచికిత్స ద్వారా ఒక మహిళా రోగికి రెండువైపులా మూత్రనాళాలను మార్పినట్టు ప్రీతి యూరాలజీ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ చంద్రమోహన్ తెలిపారు. 13 రంధ్రాల ద్వారా ఇన్‌ఫెక్షన్‌కు గురైన రెండు మూత్రనాళాలను మార్చి, వాటి స్థానంలో కడుపులోని కొంత పేగుభాగాన్ని అమర్చామని,ఇటువంటి శస్త్ర చికిత్స దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా జరగలేదని వివరించారు. హైదరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూత్రనాళాల శస్త్ర చికిత్స వివరాలను డాక్టర్ వి.చంద్రమోహన్ వెల్లడించారు. 52 ఏళ్ల మహిళకు గర్భ సంచి తొలగించారని, దీంతో ఇన్‌ఫెక్షన్, లేదా మరో కారణంగా ఆమె రెండు మూత్రనాళాలుపై నుంచి కిందివరకు పాడైపోయాయని, తద్వారా కిడ్నీల పనితీరు కూడా దెబ్బతిన్నదని వివరించారు. ఇలాంటి సమస్యలు రావడం అత్యంత అరుదని, ప్రపంచం మొత్తం మీద తొమ్మిది కేసులకు మాత్రమే ఇలాంటి వ్యాదికి చికిత్స జరిగినట్టు వివరించారు. పాడైన మూత్రనాళాలను తొలగించి, వాటి స్థానంలో చిన్న పేగులో నుంచి 35 సెంటీమీటర్లను రెండు భాగాలుగా తీసుకుని, వాటిని కిడ్నీ తొడిమ నుంచి బ్లాడర్‌కు అమర్చినట్టు డాక్టర్ చంద్రమోహన్ వివరించారు. శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత రోగి లేచి నడుస్తున్నారని వివరించారు. భారత దేశంలో తొలిసారిగా పూర్తి లాపరోస్కోపిక్ (కీహోల్) పద్ధతిలో మూత్రనాళాలను రెండువైపులా సరిచేశామని, అత్యాధునిక పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు, వారికి మూత్రనాళాల పునర్నిర్మాణ నైపుణ్యాలు ఉండడంతోనే ఈ శస్త్ర చికిత్స విజయవంతమైందని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

## 22న ఆర్‌టిసి కార్మిక సంఘాల 'సమ్మె' సన్నాహక సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వచ్చేనెల 7వ తేదీ నుంచి తలపెట్టిన సమ్మె సన్నాహాల్లో భాగంగా అన్ని కార్మిక సంఘాలతో ఈనెల 22వ తేదీన బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, కోచైర్మన్ కె.హనుమంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎం.డి.మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, యాజమాన్యాలు యూనియన్‌లను విభజించి పాలించే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. యూనియన్‌ల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. కార్మిక విస్తృత ప్రయోజనాల కోసం సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం డిపోలలో కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందుల నుండి కాపాడటం కోసం కార్మిక సంఘాలన్ని తమ తమ భేదాభిప్రాయాలు ప్రక్కనపెట్టి, భేషజాలు విడనాడి, విశాల ఐక్యతను చాటి చెప్పే విధంగా సంఘాలన్ని 'ఒకే మాట ఒకే బాట అదే సమ్మె బాట' అనే నినాదంతో ముందుకు వచ్చి జెఎసి నిర్ణయించిన సమావేశానికి రావాలని కోరారు. సమ్మె వైపు కార్మికులను వెళ్ళనీయకుండా చేస్తున్న ప్రభుత్వ, యాజమాన్యాల కుట్రలు, కుతంత్రాలను కార్మిక వర్గమంతా తిప్పికొట్టి, కార్మిక ఐక్యత చాటాలన్నారు. మే 7న జరిగే సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు భాగస్వామ్యం కావాలని నేతలు కోరారు.



## పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలం

మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచం ఎంత శరవేగంగా అభివృద్ధి చెందుతుంటే అంతే వేగంతో ఆతిథ్య, టూరిజం రంగాలు కూడా వృద్ధి చెందుతున్నాయని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ (నిథిమ్)లో యూరోపియన్ యూనియన్ సహకారంతో నిథిమ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్ఐపిఎఎస్ ప్రాజెక్ట్ కు సంబంధించిన టూరిజం స్టేక్‌హోల్డర్స్ వర్క్‌షాప్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు టూరిజంప్లాజాలో జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగాప్రారంభించారు. నిథిమ్ విద్యార్థులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. అనంతరం www.sipas.in వెబ్ సైట్ ను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. యూరోపియన్ ప్రాజెక్టును అమలు చేయడానికి చొరవ తీసుకున్నందుకు నిథిమ్ డైరెక్టర్ జెండాగే హనుమంత్ కొండిబా ను మంత్రి జూపల్లి అభినందించారు. ఈ సందర్భంగా లాట్వియా లోని విడ్జెమ్ యూనివర్శిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ ప్రొఫెసర్ అగిట, పోర్చుగల్ లోని ఇన్‌స్టిట్యూటో పాలిటెక్నికో డి సెటుబల్ ప్రొఫెసర్ దురాటే జారా బ్రాసిల్, పాండిచ్చేరి యూనివర్శిటీ ప్రొఫెసర్ సంపద కుమార్ స్వైన్, సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కర్ణాటక అసోసియేట్ ప్రొఫెసర్ & హెడ్ డాక్టర్ జి. మహేందర్, ఇతర కన్సార్టియం సభ్యులను మంత్రి జూపల్లి కృష్ణారావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్ రెడ్డి, పర్యాటక శాఖ, నిథిమ్ సంచాలకులు జెండాగే హనుమంత్ కొండిబా, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి, సిపాస్ వివిధ రాష్ట్రాలు, లాట్వియా, పోర్చుగల్ దేశాలకు చెందిన సిపాస్ ప్రాజెక్ట్ కన్సార్టియం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్ కు తాజ్ గ్రూప్, గ్రీన్ పార్క్, రాడిసన్ బ్లూ వంటి ప్రముఖ హోటళ్ల ప్రతినిధులు, జనరల్ మేనేజర్లు, ట్రావెల్ ఏజెన్సీలు, టూర్ ఆపరేటర్లు హాజరయ్యారు.

# ఎకో టూరిజంపై వేగంగా అడుగులు వేయండి

అటవీ శాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో ఎకో టూరిజంపై వేగంగా అడుగులు వేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. విదేశీయులను కూడా ఆకర్షించే విధంగా ప్రణాళికలు రూపకల్పన చేయాలని సూచించారు. దీనికి సంబంధించి అటవీ, టూరిజం, పరిశ్రమల శాఖలతో కూడా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే, రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు కీలకమని మంత్రి సురేఖ అభిప్రాయపడ్డారు. సచివాలయంలోని గురువారం 'తెలంగాణ హరిత నిధి' రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, అటవీ శాఖ అధికారులు ఏలూ సింగ్ మేరు, డాక్టర్ సువర్ణ, డాక్టర్ జి. రామలింగం, డాక్టర్ బీమా నాయక్, డాక్టర్ ప్రభాకర్, పలు జిల్లాల డీఎఫ్ఓలు, ఆర్థిక శాఖ సహా ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో హరితనిధి వినియోగంపై సమగ్ర చర్చించారు. నర్సరీలను ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడం, నీళ్లు పోయడం, సంరక్షించడం, మొక్కల లెక్కలు తేల్చడం, పచ్చదనంపై అవగాహన పెంచే కార్యక్రమాలు, ప్రణాళికల రూపకల్పన, అమలు, పర్యవేక్షణ వంటి అవసరాలకు మంత్రి సురేఖ ప్రత్యేక సూచనలు చేశారు. 2024–25 హరిత నిధి బడ్జెట్, 2025–26 బడ్జెట్ మీద మంత్రి అనుమతులను అధికారులు స్వీకరించారు.

అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ... కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి, మన రాష్ట్రం పట్ల చాలా సానుకూలంగా ఉన్నారని గుర్తు చేశారు. ఏమైనా పెండింగ్ అంశాలు ఉంటే త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఫారెస్ట్ ఫైర్స్ మీద కూడా సమావేశంలో చర్చ జరగ్గా వాటిని తగ్గించేందుకు ప్రస్తుతం అవలంభిస్తున్న విధానాలపై మంత్రి ఆరా తీశారు. వీటిపై రానున్న రోజుల్లో మరింత శాస్త్రీయంగా ముందుకు వెళ్ళేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

**వానరాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు..**

రాష్ట్రంలో వానరాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఒకసారి వనాలను వీడిన వానరాలు మళ్ళీ అడవి బాట పట్టవని, అందువల్ల వాటి కోసం కొన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. హరిత నిధిలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీలలో ఇచ్చే మొక్కల్లో ఎక్కువగా వానరాలు తినే మొక్కలు అందజేయాలని సూచించారు. దాని వల్ల వాటిని సంరక్షించినట్టు అవుతుందని చెప్పారు. ఈ విషయంపై సమగ్రంగా నివేదికలు తయారు చేసుకోని ముందుకు వెళ్ళాలని అన్నారు.

## వక్ఫ్ సవరణ చట్టం ఏ వర్గానికి వ్యతిరేకం కాదు

కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు వక్ఫ్ సవరణ చట్టం ఏ వర్గానికి వ్యతిరేకం కాదని కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో 'వక్ఫ్ సుధార్ జనజాగరణ అభియాన్' వర్క్‌షాప్‌లో కిషన్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో వక్ఫ్ బోర్డు పరిధిలో 77 వేల ఎకరాల భూమి, 35 వేల ఆస్తులు ఉన్నాయని, వాటి ఆదాయ వివరాలు రేవంత్ రెడ్డి, ఓవైసీ చెప్పాలని, పేద ముస్లింలకు ఎంత సహాయం చేశారో చెప్పాలన్నారు. 2013లో యుపిఏ ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో మార్పులు చేసిందని, వక్ఫ్ బోర్డు అధికారాలను అపరిమితంగా విస్తరించి, భూములను ఏకపక్షంగా స్వాధీనం చేసుకునే అవకాశం కల్పించిందని విమర్శించారు. వక్ఫ్ బోర్డు లాభం మజ్లిస్ పార్టీ నాయకులు, మతపెద్దలు, భూ కబ్జాదారులు, రియల్ ఎస్టేట్ కంపెనీలు మాత్రమే పొందారన్నారు. పేద ముస్లింలకు వక్ఫ్ బోర్డు నుంచి ఎంత మేలు జరిగిందో అసదుద్దీన్ ఓవైసీ, రాహుల్ గాంధీ చెప్పగలరా?, ల్యాండ్ మాఫియా ప్రచారానికి మద్దతు తెలుపుతున్నారని మండిపడ్డారు. 2006లో వక్ఫ్ ఆస్తుల పరిమాణం 4.9 లక్షల ఎకరాలు కాగా, ఆదాయం రూ. 160 కోట్లు మాత్రమే వచ్చిందన్నారు. భూముల విలువ పెరిగినా, వక్ఫ్ బోర్డు ఆదాయం ఎందుకు పెరగలేదో సమాధానం చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అంచనా ప్రకారం వక్ఫ్ ఆస్తులను సక్రమంగా వినియోగిస్తే ప్రతి సంవత్సరం రూ. 12 వేల కోట్ల ఆదాయం రావచ్చు అన్నారు. ఈ ఆదాయాన్ని పేద ముస్లింలకు వినియోగిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని కిషన్ రెడ్డి తెలిపారు.

## సిజేరియన్ డెలివరీలు చేస్తే.. ప్రైవేటు ఆస్పత్రులపై కఠినచర్యలు

మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సరైన కారణం లేకుండా సిజేరియన్ డెలివరీలు చేస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్ పైన కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఇందుకు సి సెక్షన్ ఆడిట్‌ను మరింత పక్కద్బందీగా నిర్వహించాలని, ప్రభుత్వ ఆస్పత్రులలో సాధారణ డెలివరీల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని టిజిఎంఎస్ఐడిసి కార్యాలయంలో వైద్యాధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ నార్మల్ డెలివరీ వల్ల కలిగే లాభాలను, సి సెక్షన్ వల్ల జరిగే నష్టాలను యాంటి నాటల్ పరీక్షలను గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు వివరించాలన్నారు. సాధారణ డెలివరీల సంఖ్య పెంచేందుకు, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పని చేస్తున్న నర్సులకు మిడ్ వైఫరీ ట్రైనింగ్ ఇప్పించాలన్నారు. మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో వసతులను మరింత మెరుగు పర్చాలని, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో డెలివరీ చేయించుకునేలా గర్భిణులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఎండలు, అధిక ఉష్ణోగ్రతలతో హాస్పిటల్స్‌లో గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని హాస్పిటల్స్‌లో ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన వార్డులలో ఉన్న ఏసిలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక భద్రతపైన ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియపై మంత్రి ఆరా తీశారు. గతేడాది 8 వేలకు పైగా పోస్టులను భర్తీ చేశామని, మరో 6200లకు పైగా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు మంత్రి దామోదర రాజనర్సింహకు వివరించారు. ఈ పోస్టులన్నింటికీ రాత పరీక్షలు పూర్తి కాగానే వెంటనే ఫలితాలు విడుదల చేసి, నెల రోజుల్లో భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందికి సకాలంలో పదోన్నతులు ఇవ్వాలని అధికారులకు సూచించారు.

## విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యాన్ని పెంచుకోవాలి

ఎస్కి డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** క్రీడలు శారీరక దారుడ్యాన్ని పెంచుతాయని, మనిషిలో క్రమశిక్షణతో పాటుగా మానసిక ఉత్తేజం, తేజస్సు వృద్ధి చెందుతాయని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు అన్నారు. ఎస్కి లో భాగమైన స్కూల్ అఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ విద్యార్థుల క్రీడా కౌశలంను డైరెక్టర్ గురువారం ప్రారంభించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ మేనేజిమెంట్, జనరల్ మేనేజిమెంట్, ఇన్నోవేషన్ అండ్ వెంచర్ డెవలప్ మెంట్ మేనేజ్ మెంట్ కోర్సులకు సంబంధించిన 105 మంది విద్యార్థులు పాల్గొంటున్న క్రీడా కౌశలంలో క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్స్ పోటీలను డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు, కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అశోక్‌తో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు నిత్య జీవితంలో చురుగ్గా ఉత్సాహవంతంగా ఉండాలంటే క్రీడలు అవసరమన్నారు. కాలేజ్ సమయం తరువాత ఎస్కి మైదానంలోని విశాలమైన స్థలాన్ని వాలీబాల్, బాస్కెట్ బాల్, క్రికెట్, కబడ్డీ లాంటి ఔట్ డోర్ గేమ్స్‌కు వినియోగించుకోవాలని సూచించారు. త్వరలోనే ఔట్ డోర్ గేమ్స్‌కు అవసరమైన కోర్టులు క్రీడా సామాగ్రిని పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందిస్తామన్నారు. కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం స్థాపించబోయే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణలో అద్భుతమైన క్రీడాకారులకు అవకాశం ఉంటుందని, క్రీడల ద్వారా దేశ ప్రతిష్టను నిలబెట్టాలనుకుంటే విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమం కాలేజ్ చీఫ్ ఎస్. లక్ష్మి కాంత రావు, డాక్టర్ పి. రాజారావు పర్యవేక్షణలో జరుగగా, కాలేజ్ ఫ్యాకల్టీలు డాక్టర్ వెంకట్ రెడ్డి, అలిగ రాజు, డాక్టర్ సింధు మెండ, ఛాయా పద్మకుమారి, డాక్టర్ రాజేశ్వరి, రఘు వీరా రెడ్డి, రమావత్ కిషన్‌తో పాటుగా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 2029 నాటికి రూ.3 లక్షలకోట్లు

# రక్షణ ఉత్పత్తుల లక్ష్యం

'ద వీక్' డిఫెన్స్ కాంక్లేవ్‌లో రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశంలో రక్షణ ఉత్పత్తులను రాబోయే నాలుగేళ్ళలో మూడులక్షల కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు ఆ శాఖామంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. 'డిఫెన్స్ సమాలోచన–2025' అనే అంశంపై 'ద వీక్' మ్యాగ్జైన్ నిర్వహించిన సదస్సులో రాజ్‌నాథ్ సింగ్ గురువారంనాడు మాట్లాడుతూ, ఈ ఏడాదిలో రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.60 లక్షల కోట్లకు పెరుగుతుందని, సైనికరంగంలో 2029 నాటికి హార్డ్‌వేర్ ఉత్పత్తుల లక్ష్యాన్ని రూ.3 లక్షలకోట్లుగా నిర్దేశించామని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో రక్షణరంగాన్ని పునరుద్ధరించి, స్వయంసమృద్ధితో బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యమన్నారు. ఈనాడు రక్షణ పరికరాలు, ఆయుధవ్యవస్థ జాబితాలో మొత్తం 506 పరికరాలున్నాయనీ, ఇప్పుడు వాటన్నింటినీ దేశంలోనే ఉత్పత్తిచేస్తామనీ అన్నారు. దేశీయ కంపెనీల నుండే రక్షణపరికాల సేకరణకు రక్షణబడ్జెట్‌లో 75 శాతం మొత్తాన్ని కేటాయించామన్నారు. భారతదేశ ఆలోచనాదృక్పథంలో మార్పుతీసుకురావడం అనేదే తమ ప్రభుత్వానికి ప్రధానమైన సవాలు అన్నారు. రక్షణరంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని భారతదేశం తగ్గించుకుందన్నారు. గతంలో తరహా పరిస్థితులు ఇప్పుడు లేవని, రక్షణరంగంలో స్వయంసమృద్ధి సాధించామన్నారు. రక్షణరంగ ఉత్పత్తులు కేవలం దేశీయ అవసరాలు తీర్చడమే కాకుండా విదేశాలకు కూడా భారీగా ఎతుమతులుచేసేస్థాయికి భారత్ చేరుకుంటుందన్నారు. ''భారతదేశం అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరేరోజు ఇంకెంతోదూరంలో లేదు, కానీ మన సైనిక శక్తిని కూడా ప్రపంచంలో అగ్రస్థానానికి తీసుకువెళ్ళాల్సిన అవసరం ఉంది'' అని ఉద్ఘాటించారు. జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని దేశం తన రక్షణపాటవాన్ని, శక్తిసామర్థ్యాలను అపారంగా పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా సరఫరాలోపాలు ఏర్పడుతున్నాయని, సమస్యలు మొదలయ్యాయనీ, వీటిని అధిగమించాలంటే స్వయంసమృద్ధి ఒక్కటే మార్గమని అన్నారు. ఈ ఏడాది భారతదేశ రక్షణ ఎగుమతులు రూ.30,000 కోట్లకు చేరుకుంటుందని, 2029నాటికి ఎగుమతులు రూ.50,000 కోట్లకు చేరుకుంటాయని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. భారతదేశ రక్షణపాటవ అభివృద్ధి ఇతర దేశాలపై కయ్యానికి కాలుదువ్వడానికి కాదనీ, భారత రక్షణపాటవం శత్రువును విశ్వసనీయతతో ఆటంకపరచడంకోసమేననీ, శాంతి,సామరస్యాలు కాపాడటం ద్వారా బలోపేతం కావడమే భారత్ లక్ష్యమని ఆయన అన్నారు. స్వయంసమృద్ధి అనేది భవిష్యత్తు కోసం సన్నద్ధంకావడమేనన్నారు. దేశీయ ఉత్పత్తులు, దేశీయ సామర్థ్యం పెంపుదలతోపాటు నవతరం సాధనాలను వృద్ధిచేసుకుని ప్రపంచనాయకత్వస్థానానికి చేరుకోవడమే ప్రధాన ఉద్దేశమన్నారు.

## ఉస్మానియా ఆస్పత్రిలో అరుదైన 'కాలేయ మార్పిడి'



15 గంటల పాటు సాగిన శస్త్ర చికిత్స
ప్రపంచంలోనే తొలి శస్త్ర చికిత్సగా రికార్డ్
మీడియా సమావేశంలో ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తీవ్రమైన హెపటోపల్మనరీ సింద్రోమ్ కలిగిన 14 ఏళ్ల బాలునికి ఉస్మానియా ఆస్పత్రి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. మార్ఫన్ లాంటి జన్యు సంబంధిత రుగ్మతలు కలిగిన హెపటో పల్మనరీ సింద్రోమ్ రోగికి చేసిన 'కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స ' ఆధునీక వైద్య శాస్త్ర పురోగతికి నిదర్శనమని ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. వైద్య రికార్డుల ప్రకారం ఇటువంటి శస్త్ర చికిత్స ప్రపంచంలోనే మొదటిదని ఆస్మానియా ఆస్పత్రి సూపరింటెంటెండ్ డాక్టర్ రాకేష్ సహాయ్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం హెచ్ఒడి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ రాకేష్ సహాయ్, డాక్టర్ మధుసూదన్ కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కృష్ణ జిల్లా, మాచీలీపట్నం, రెడ్లపాలేం గ్రామానికి చెందిన మనుమద్ రెడ్డి, స్వాతి దంపతుల కుమారదు జి.నిఖిల్ రెడ్డి (14)కాలేయ సమస్యతో పాటు వివిధ రకాల వ్యాదులతో బాధపడుతున్నారు. ఐదు నెలల క్రితం ఉస్మానియా ఆస్పత్రిలోని గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగంలో చేరగా, డాక్టర్ మధుసూదన్ అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఆ బాలునికి కాలేయ మార్పిడి అత్యవసరమని గుర్తించారు. అయితే కాలేయ మార్పిడికి తల్లి స్వామి ముందుకొచ్చింది. సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, నెఫ్రాలజీ, అనస్తిషియా, కార్డియాలజీ వంటి విభాగాల సమన్వయంతో సుమారు 15 గంటల పాటు బాలునికి కాలేయ మార్పిడిని విజయవంతంగా పూర్తి చేశారు. తల్లి, కుమారుడు ఇద్దరూ క్షేమంగా కోలుకోవడంతో వారిని వైద్యులు బుధవారం డిశ్చార్జ్ చేశారు. ఇటువంటి అరుదైన శస్త్ర చికిత్స చేసి విజయవంతం కావడంతో పాటు, కాలేయాన్ని ఇచ్చేందుకు ముందుకొచ్చిన తల్లి స్వాతిని కూడా వైద్యులు సన్మానించారు. కాగా కనీసం చికిత్సకు అవసరమైన మందులకయ్యే ఖర్చులను కూడా రోగి కటుంబ సభ్యులు భరించే పరిస్థితి లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పాటు తెలంగాణ ప్రభుత్వం కూడా సాయం అందించినట్టు వైద్యులు తెలిపారు. అనంతరం డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.హెపటోపల్మనరీ సింద్రోమ్ వ్యాదితో బాధపడుతున్న బాలునికి కాలేయం, గుండె, ఊపిరితిత్తులు, కంటి,ఎముకలకు సంబంధించిన పలు వ్యాదులతో బాదపడుతున్నారని వివరించారు. ఈ వ్యాది ప్రతి పదివేల మందిలో ఒక్కరికి ఉంటుందన్నారు. ఇలాంటి రోగులకు 60 శాతం మాత్రమే శ్వాస తీసుకుంటారని, ఈ క్రమంలో శస్త్ర చికిత్స చేయడం పెద్ద సవాలు లాంటిదని, ఇలాంటి సవాలును ఉస్మానియా ఆస్పత్రిని అధిమగించామని చెప్పారు. ఉస్మానియా ఆస్పత్రిలోని అన్ని విభాగాల కృషితోనే ఈ శస్త్ర చికిత్స సాధ్యమైందని, ఇటువంటి చికిత్సకు ప్రైవేటు రంగంలో సుమారు కోటీ రూపాయాలు ఖర్చు అవుతుందని చెప్పారు. ఇటువంటి చికిత్స ప్రపంచంలో ఎక్కడైనా చేశారోమే అని ఆరా తీశామన్నారు. ఈ శస్త్ర చికిత్సను ప్రపంచ వైద్య సదస్సులో చర్చకు తీసుకొస్తామని, దీనిని ప్రపంచ రికార్డుల్లోకి ఎక్కించేందుకు తమ వంతు ప్రయత్నిస్తామనిడాక్టర్ మధుసూధన్ తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్లు ఉమ, డాక్టర్ రమేష్, డాక్టర్ అభిమన్యు తదితరులు పాల్గొన్నారు.

## మెట్రో వల్ల చారిత్రక కట్టడాలకు నష్టం రావొద్దు

హైకోర్టు

**హైదరాబాద్ :** హైదరాబాద్ పాతబస్తీలో మెట్రో రైలు నిర్మాణం పేరుతో చారిత్రక కట్టడాలకు నష్టం చేకూర్చరాదని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలను జారీ చేసింది. పురావస్తు శాఖ గుర్తించిన చారిత్రక కట్టడాల వద్ద ఎలాంటి పనులు చేపట్టరాదని ఉత్తర్వులు జారీ చేసింది. చారిత్రక కట్టడాలకు సమీపంలో నిర్మాణాలు చేయడం వల్ల పురావస్తు సంపదకు ఏవిధమైన నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది. పురావస్తు శాఖ గుర్తించిన చారిత్రక కట్టడాలు, మెట్రో రైలు నిర్మాణం జరిగే ప్రాంతాలను నివేదించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది. ఈమేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. పాతబస్తీలో మెట్రో రైలు నిర్మాణ పనులు చేపట్టడం వల్ల పురావస్తు శాఖ గుర్తించిన చారిత్రక కట్టడాలకు నష్టం వాటిల్లుతుందని దాఖలైన పిల్‌ను గురువారం హైకోర్టు విచారించింది. ఎంజీబీఎస్ నుంచి శంషాబాద్ వరకు చేపట్టిన నాలుగో కారిడార్ నిర్మాణంలో భాగంగా మెట్రో రెండో దశ విస్తరణ పనులను ఆపివేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలంటూ యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ (ఏపీడబ్ల్యూఎఫ్) అధ్యక్షుడు మహమ్మద్ రహీంఖాన్ పిల్ దాఖలు చేశారు. పాతబస్తీలో మెట్రో రైలు పనులు చేపట్టకుండా మధ్యంతర స్టే ఆదేశాలు జారీ చేయాలని పిల్ తరఫు న్యాయవాది కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ మహ్మద్ ఇమ్రాన్ ఖాన్ ప్రతివాదన చేస్తూ, మెట్రో రైలు నిర్మాణ పనులు చేయడం వల్ల చారిత్రక కట్టడాలకు నష్టం లేకుండా, అవి దెబ్బ తినకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. చారిత్రక కట్టడాల కూల్చివేతలు చేపట్టబోమని హామీ ఇచ్చారు.

ఇతర నిర్మాణ యజమానులకు, భూమిని నష్టపోయే వాళ్లకు ప్రభుత్వం పరిహారం చెల్లించాకే వాటి సేకరణ చేపడతామని కూడా చెప్పారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని కోరడంతో అందుకు ధర్మాసనం అనుమతిచ్చింది. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి తదుపరి విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది.

## ప్రభుత్వ పాఠశాలలోనే చదివించండి

**ప్రజాపక్షం/ మోటకొండూరు**: పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చదివించి, ద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని మోటకొండూరు మండల విద్యా శాఖాధికారి కేతిరెడ్డి రఘురాం రెడ్డి అన్నారు. ఆయన గురువారం ప్రోపేసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో బాగంగా 2025 /26 విద్యా సంవత్సరంనకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోటకొండూర్, మోటకొండూర్ మండలంలో ఆరెగూడెం, మహబూబ్ పేట, వర్టూర్ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6వ తరగతిలో నూతనంగా సుమారు 20మంది విద్యార్థులు పాఠశాలలలో అడ్మిషన్ పొందినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులు, విద్యార్థులకు ట్రావెలింగ్ అలవెన్సు, 6,7 తరగతులు బాల బాలికలకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పిస్తున్నామని, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ప్రతి విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌లు, రుచికరమైన భోజనం, రాగి జావా విద్యార్థులు అందరికి అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు కలకోట రాజగోపాల్, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అండాలు, ఆచంట భాగ్యశ్రీ ,రాజశేఖర్ రెడ్డి, మంచాల భవాని, సుధారాణి, శ్రీలత, రమేష్ పాల్గొన్నారు.

## లబ్ధిదారుడి ఇంట్లో ఎమ్మెల్యే భోజనం

**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎం) :** సన్న బియ్యం లబ్ధిదారుడు కూరెళ్ళ అనిల్ ఇంట్లో ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, కలెక్టర్ హనుమంతరావు వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, తహసిల్దార్ లావణ్య, ఎంపీడీవో రాములు నాయక్, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలం గౌడ్, మాజీ జెడ్పిటిసి నరేందర్ గుప్తా, యాస లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



# భూభారతితో భూ సమస్యలకు పరిష్కారం

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

### పేద ప్రజల భూ సమస్యల పరిష్కారానికి నాంది

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం)** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న భూభారతి పోర్టల్ ద్వారా రాష్ట్రంలోని భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో ప్రజల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయనే దానికి భూభారతి ముఖ్య ఉదాహరణ అని వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పరిపాలనలో ధరణి పోర్టల్ ద్వారా రెవెన్యూ శాఖలో అనేక చిక్కులు ఏర్పడ్డాయని విమర్శించారు. అధికారులు భూ సమస్యలను పరిష్కరించడంలో ధరణి పోర్టల్ ద్వారా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భాలు ఉన్నాయన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల లేసి, జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, తహసిల్దార్ లావణ్య పాల్గొన్నారు.

### రైతుల మేలు కోసమే భూ భారతి చట్టం..ఎంఎల్ఏ బాలునాయక్



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; రైతుల మేలు కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం 2025ను రూపొందించిందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో రైతులకు ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో అన్నారు. పేదల రైతుల మేలుకు కోసం ప్రభుత్వం ధరణీ స్థానంలో భూ భారతి చట్టం తీసుకువచ్చిందని అన్నారు. ఈ చట్టంతో 80 శాతం సమస్యలు తహశీల్దార్ ద్వారా 20 శాతం సమస్యలు ఆర్డీవో, జిల్లా కలెక్టర్ల ద్వారా పరిష్కారం అవుతాయని అన్నారు. గత ప్రభుత్వం ధరణీ పేరుతో రైతులకు తీవ్రమైన అన్యాయం చేసిందని విమర్శించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ధరణీలో 35 మాడ్యుల్స్ ఉండగా భూ భారతిలో ఆరు షెడ్యూల్‌లు మాత్రమే ఉన్నాయన్నారు. అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల చివరి వరకు అన్ని మండల కేంద్రాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి భూ భారతి గురించి ప్రతి ఒక్క రైతుకు అవగాహన కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, అడిషనల్ ఎస్పి మౌనిక, డిపిఆర్‌వో వెంకటేశ్వర్లు, ఏడిఏ శ్రీలక్ష్మి , తహశీల్దార్ అన్వర్ హుస్సేన్, ఎంపిడివో బాలరాజురెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### భూ భారతి చట్టం పేదలకు వరం : కలెక్టర్

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** భూ భారతి చట్టం2025 నిపుణులు, మేధావులు, విశ్రాంత ఉద్యోగులు, అందరి సలహాలతో సరణంగా సులభంగా రూపొందించిందని ఇది పేదలకు వరం లాంటిదని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్ఆర్ ఫ్రైడ్ కన్వెన్షన్ హాల్‌లో భూ భారతి చట్టం 2025పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ ఈ చట్టాన్ని ప్రభుత్వం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున ప్రారంభించిందన్నారు. రైతుల భూ సమస్యలు జిల్లా స్థాయిలోనే పరిష్కారమవు తాయన్నారు. నాలుగు మండలాల్లో ఒక ఫైలెట్ ప్రాజెక్టు కింద దీనిని అమలు చేయడం జరుగుతుందన్నారు. నేరేడుచర్ల మండలంలో 1126 సాదాబైనామా దరఖాస్తులు పరిశీలించి క్రమబద్ధీకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ శ్రీనివాసులు, తహసీల్దార్ సైదులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ విజయ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.







## సుందరీమణుల ఆతిథ్యానికి విజయ విహార్ ముస్తాబు

### శరవేగంగా ఆధునికీకరణ పనులు

**ప్రజాపక్షం/నందికొండ:** మే7వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరుగనున్న 72 వ మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ వేదిక అవుతున్న సందర్భంగా ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ లోని విజయవిహార్ ని ఆధునీకరిస్తున్నారు.అందాల పోటీలకు సమయం సమీపిస్తున్న సందర్భంగా ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి హైదరాబాదులో జరగనున్న పోటీలకు 140 దేశాల నుండి వస్తున్న సుందరీమణులు మే 12 న నాగార్జున సాగర్ ని సందర్శించనున్నారు. భారతదేశం నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా ఈ పోటీలలో పాల్గొననున్నారు దీంతో నాగార్జున సాగర్లో విడిది చేయడానికి అంతర్జాతీయ స్థాయి లో విజయవిహార్ లోని గదులను ఆధునీకరిస్తున్నారు. రూ.5కోట్ల వ్యయంతో 38 గదులను ఆధునీకరణ చేస్తున్నారు. ప్రస్తుత మిస్ వరల్డ్ చెక్ రిపబ్లిక్ కు చెందిన క్రిస్టినా పిస్కోవా ఈ ఈవెంట్ ముగింపులో ఎన్నికైన వారిని తన వారసురాలిగా పట్టాభిషేకం చేయనున్నారు.

## మంత్రులు కష్టపడుతుంటే అసత్యపు ఆరోపణలా?

### నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/చిట్యాల :** ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు అహర్నిశలు కృషి చేస్తుంటే వారిపై అసత్యపు ఆరోపణలు చేయడం జిల్లా మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డికి పరిపాటిగా మారిందని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం విమర్శించారు. నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాల యాజమాన్య బోర్డు జలాల విషయంలో జగదీష్ రెడ్డి చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. నీళ్ళు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ పార్టీ కృష్ణా జలాల వాటాలు తేల్చలేలని అసమర్థులని విమర్శించారు. బ్రాహ్మణ వెల్లంల, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువ, డిండి, నక్కలగండి లాంటి ఒక్క ప్రాజెక్టును కూడా మంత్రిగా పూర్తి చేయించలేక పోయాడని అన్నారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్‌ను పట్టించుకోలేదన్నారు. మ్మడి జిల్లాలలో ప్రాజెక్టుల పనులన్నీ వేగంగా నడుస్తున్నాయని అన్నారు. జగదీష్‌రెడ్డి మా ప్రభుత్వం పై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని లేని పక్షంలో కార్యకర్తలు చూస్తూ ఊరుకోబోరని వీరేశం అన్నారు.


## బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు విస్తరింపచేసేందుకు కృషి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** మారుమూల గ్రామాలలో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు నేటికీ అందక వినియోగదారులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అటి గ్రామాలలో 4జి సేవలు విస్తరింపచేసేందుకు కృషి చేస్తామని లోక్ సభ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర లు అన్నారు.బిఎస్ఎన్ఎల్ ఉమ్మడి నల్లగొండ,ఖమ్మంజిల్లాల బిజినెస్ ఏరియా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సమావేశం గురువారం పానగల్ రోడ్లు లో గల ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో జరిగింది. నల్లగొండ బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి. వెంకటేశం ఈ ఉమ్మడి జిల్లాలలో బిఎస్ఎన్ఎల్ చేపడుతున్న తాజా అభివృద్ధి, ప్రగతిపై సమగ్రంగా వివరించారు. 4జిసాచురేషన్ ప్రాజెక్ట్ మరియు ప్రస్తుతం ఉన్న 2జి 3జి టవర్లను 4జి సాంకేతికతతో ఆధునీకరించడంపై విస్తృతంగా చర్చించడం జరిగింది. నల్లగొండ ఖమ్మం ఉమ్మడి జిల్లాల పరిధిలో 4జి సేవలు అందని గ్రామాల వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని కమిటీ సభ్యులు సూచించారు, తద్వారా అవసరమైన చర్యలు తీసుకుని బీఎస్ఎన్ఎల్ ద్వారా టవర్లు ఏర్పాటు చేయగలిగేలా కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకురాగలమని తెలిపారు. ఈ సమావేశంలో డిజిఎంలు రవి ప్రసాద్,శ్రీనివాస రావు,ఏజిఎంలు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## గుండె సంబంధిత వ్యాధులకు ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులో

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ జ్యోతి ఆసుపత్రిలో గుండె సంబంధిత వ్యాదులకు ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయని రోగులకు ఉచితంగా వైద్యసేవలు అందించనున్నట్లు ఆసుపత్రి ఎండి డాక్టర్ మువ్వా రామారావు అన్నారు. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైద్రాబాద్‌లో లభించే అత్యున్నత స్థాయి కార్డియాలజి వైద్య సేవలు ఇప్పుడు మిర్యాలగూడలో అందుబాటులో తీసుకొచ్చామని, గుండెపోటుకు గురైన వారిని తమ ఆసుపత్రికి తీసుకొస్తే 20 నిమిషాల వ్యవధిలోనే స్టంట్లు వేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద ఈ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేష్, జీవనజ్యోతి, మువ్వా శ్రీహర్ష, ఆదిల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ఎదుగుదలను చూసి ఓర్వలేక అక్రమ కేసులు



ఎమ్మెల్సీ శంకర్ నాయక్



**ప్రజాపక్షం /నల్లగొండ:** కాంగ్రెస్ ఎదుగుదలను చూసి ఓర్వలేక కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలపై అక్రమ కేసులు బనాయిస్తుందని ఎమ్మెల్సీ, డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసిసి అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై ఈడి అక్రమంగా చార్జ్ షీట్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని గడియారం సెంటర్లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి ఈడి ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.కాంగ్రెస్, పార్టీ బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పాటు పడే పార్టీ అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, నాయకులు కేసాని వేణుగోపాల్ రెడ్డి, జూలకంటి శ్రీనివాస్, సమద్, బొజ్జ శంకర్, ఇంతియాజ్ హుస్సేన్, అల్లి సుభాష్ యాదవ్, గాలి నాగరాజు, మామిడి కార్తీక్, ఇటికాల శ్రీనివాస్, ఇంతియాజ్ అలీ, గురిజ వెంకన్న, కత్తుల కోటి, వంగాల అనిల్ రెడ్డి,దుబ్బ రూప, నాగమణి రెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విపక్షాల గొంతును అణిచివేయాలనే దొరణిలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై నేషనల్ హెరాల్డ్ పత్రికలో మానిలాండరింగ్ జరిగిందని కేసులో వేసిన చార్జీషీటును వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్ రావు డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోస్టాఫిస్ సమీపంలో కేంద్ర ప్రభుత్వం సోనియా, రాహుల్‌పై కేసులు నమోదు చేసి చార్జీషీట్ దాఖలు చేయడాన్ని నిరసిస్తూ మహాధర్నా నిర్వహించచారు. ఈ కేసును చట్టపరంగా ఎదుర్కొంటామని, బిజెపి ప్రేరిత ఈడి, ఐటి శాఖల అక్రమ చార్జీషీటులు తమను ఏమి చేయలేవని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ బైరు శైలేందర్, నాయకులు నూకల సుదర్శన్ రెడ్డి, పోలగాని బాలు గౌడ్, ధరావత్ వీరన్న నాయక్ పాల్గొన్నారు.

## మట్టి రోడ్డు పనులను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



**ప్రజాపక్షం/మానవపాడు :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం ఈ మండల కేంద్రం నుండి సందాపురం రైల్వే స్టేషన్ కు వెళ్లే మట్టి పొలాలకు వెళ్లే రోడ్లును జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజిఎస్) ద్వారా చేపడతున్న రోడ్డు పనులను పరిశీలించేందుకు జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు విజిట్ చేశారు. ఈ విజిట్‌లో అడిషనల్ కలెక్టర్ మానవపాడు మండలం ఎంపీడీవో భాస్కర్ మాట్లాడుతూ కూలీల పని వేళలు, కూలి డబ్బులు, పని తీరు వంటి అంశాలను పరిశీలించారు. అంతేకాకుండా ఉపాధి హామీ పనులను పెద్ద ఎత్తున చెపట్టేందుకు తగిన లేబర్ సరుకులను మొబైలైజ్ చేయాలని ఎంపీడీవో కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని అన్ని గ్రామాల ఉపాధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరుతూ ప్రతి గ్రామంలో ఉన్న యాక్టివ్ వేజఖ సీకర్స్‌లో కనీసం 50శాతం మందికి ఉపాధి పనులు కల్పించేలా ప్రణాళికలు ఉండాలని మండల పరిషత్ ప్రభుత్వ అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/దేవరకొండ :** ఏప్రిల్ 21, 22 రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్లో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని భవన నిర్మాణ కార్మికుల బోర్డులో దళారుల బెడదను అరికట్టాలని బోగస్ కార్డులు ఏరివేయాలన్నారు. తంబు సిస్టం తీసేసి మాన్యువల్ విధానాన్ని అమలు చేయాలన్నారు. శంషాబాద్‌లో జరిగే రాష్ట్ర మహాసభలలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వారి యొక్క ఇబ్బందులు పై చర్చించి భవిష్యత్తు ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు రామస్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ డివిజన్ కోశాధికారి వెంకటరాములు, మండల కార్యదర్శి మల్లయ్య, అధ్యక్షులు సైదులు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీ నారాయణ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి నూతన కోర్టు

### హైకోర్టు న్యాయమూర్తి,జిల్లా పోర్టు పోలియో జడ్జి రాధారాణి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి నూతన కోర్టు ఎంతగానో ఉపయోగపడుతుందని హైకోర్టు న్యాయమూర్తి,సూర్యాపేట జిల్లా పోర్టు పోలియో జడ్జి రాధా రాణి ఆకాంక్షించారు. హుజూర్‌నగర్‌కు నూతనంగా మంజూరైన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును గురువారం హైకోర్టు న్యాయమూర్తి, సూర్యాపేట జిల్లా పోర్టు పోలియో జడ్జి రాధా రాణి,హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వినోద్‌కుమార్,జస్టిస్ లక్ష్మ ణ్, జస్టిస్ సుజన లతో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో పెండింగ్ కేసుల సంఖ్య అధికంగా ఉందని కేసుల పెండింగ్ భారాన్ని తగ్గించడానికి నూతన కోర్టులను మంజూరీ చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రాంరెడ్డి పదే పదే విన్నవించగా ఆయన అభ్యర్థన మేరకు నూతన కోర్టును మంజూరీ చేశామని తెలిపారు. ఈ కోర్టును ప్రారంభించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నూతన కోర్టును కేటాయిస్తే తప్ప జడ్జిని నియమించడం సాధ్యం కాదని అందువల్ల ఈ కోర్టును ప్రారంభించడం జరిగిందని తెలిపారు. నూతన కోర్టుల సముదాయాన్ని అలాగే న్యాయమూర్తుల వసతి గృహాల నిర్మాణాల కొరకు బార్ అసోసియేషన్ సభ్యులు రాంరెడ్డి ఆధ్వర్యంలో నిరంతర కృషి చేసి ప్రభుత్వం నుండి నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయింపు చేసుకోవడం సంతోషదాయకమన్నారు. జస్టిస్ లక్ష్మ ణ్ మాట్లాడుతూ హుజూర్‌నగర్ న్యాయవాదుల చిరకాల వాంఛ ఈనూతన కోర్టు ప్రారంభోత్సవంతో నెరవేరినట్లుగా భావిస్తున్నానన్నారు. పాలకవీడు,మఠంపల్లి,మేళ్ళచెర్వు,చింతలపాలెం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని క్రిమినల్ కేసులు ఆయా మండలాల లోని సివిల్ కేసులు మొత్తం 3067 కేసులను నూతన కోర్టుకు కేటాయించామని ఆ కేసులను నూతన కోర్టులో విచారించనున్నట్లు ఆయన తెలిపారు. న్యాయమూర్తుల ఎంపిక కొరకు పరీక్షలు రాసిన అభ్యర్థులలో అనుకున్న స్థాయిలో న్యాయమూర్తులుగా సెలెక్ట్ కాకపోవడం మూలంగా ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయలేక పోతున్నామన్నారు. సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్‌శ్రీ మాట్లాడుతూ హుజూర్‌నగర్ న్యాయవాదుల అభ్యర్థన మేరకు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును మంజూరీ చేయడం పట్ల హైకోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్,ఎస్.పి కె.నరసింహా,హుజూర్‌నగర్,కోదాడ, సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జిలు జిట్టా శ్యామ్‌కుమార్,సురేష్,పర్వీన్ కౌసర్,జూనియర్ సివిల్ జడ్జి భవ్యశ్రీ,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు,సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని పోలేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద పార్వతీ పుత్ర హెల్పింగ్ హాండ్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పిసిసి సభ్యులు, పిఏసిఎస్ చైర్మన్ జాలే నర్సింహారెడ్డి ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలేపల్లి మరియు పరిసర ప్రాంతం ప్రజలు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి ఒక్కరు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి పార్వతి, శివ, తిరుపతయ్య, శ్రీను, ఆంజనేయులు, మహేష్, అంజి, సతీష్, పార్వతిపుత్ర హెల్పింగ్ హాండ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## రూ.6వేల పింఛన్ కోసం పోరాటం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వికలాంగుల హక్కుల పోరాట సమితి మిర్యాలగూడ నియోజకవర్గం స్థానిక ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో విహెచ్పిఎస్ సీనియర్ నాయకులు ఎండి అహ్మద్ ఖాన్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగినది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కొత్త వెంకన్న యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫల అయిందన్నారు. వికలాంగుల పెన్షన్ 6వేల చేయూత పెన్షన్ 4వేల చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల 19న హైదరాబాదు నడిబొడ్డులో మందకృష్ణ మాదిగ తలపెట్టిన ముఖ్య కార్యకర్తల సమావేశం జరగనున్నదని ఈ సమావేశంలో విహెచ్‌పిఎస్ ముఖ్య నాయకులు హాజరయ్యి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వానికి వికలాంగుల సంక్షేమ శాఖ స్వతంత్రంగా ఏర్పాటుచేయాలని,వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలనీ,ఇందిరమ్మ ఇళ్లలో మొదట ప్రాధాన్యత ఇవ్వాలనీ, వికలాంగులకు స్థానిక ఎన్నికల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని కొరారు.ఈ సమావేశాన్ని సమావేశంలో చర్చించి తదుపరి కార్యాచరణకు సిద్ధపడతామని వికలాంగుల అందరూ ప్రభుత్వానికి సవాలుగా నిలవాలని సూచించారు, ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కసిరెడ్డి చైతన్య రెడ్డి,జిల్లా నాయకులు రాచూరి సైదులు,గుగులోతు మదన్ నాయక్, పొలం దాస్ శీను,రత్నకుమారి,ఎండి కలీం,సుధాకర్,సైదిరెడ్డి,కిషన్ నాయక్,షరుద్దీన్,గౌస్,నజీర్ బాబా పాల్గొన్నారు.



## ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**ప్రజాపక్షం / వీపనగండ్ల:** మహిళలు అన్ని రంగాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వీపనగండ్ల ఎస్ఐ కె. రాణి న్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎం. ఎంపీపీఎస్ వీపనగండ్ల పాఠశాల లో ఇంటరాక్షన్ ఆఫ్ గర్ల్ స్టూడెంట్స్ విత్ రోల్ మోడల్స్ అండ్ హైయర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్అనే కార్యక్రమంలో ఎస్ఐ కె.రాణి మాట్లాడారు.స్త్రీలు ఉన్నత స్థాయిలో ఉంటూ సమాజానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. వీర వనిత ఝాన్సీ లక్ష్మీ బాయ్ , భారతదేశం మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే, నాసా వ్యామగామి సునీత, విలియమ్స్ , రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురించి వివరించారు. వారు సమాజంలో వారు చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులు ముఖ్యంగా బాలికలు బాలికలు చిన్న వయసులో వివాహాలు కాకుండా తల్లిదండ్రులను ఒప్పించి ఉన్నత చదువులు చదివి సమాజానికి , కుటుంబాలకు మంచి పేరు కీర్తి ప్రతిష్టలు తీసుకొని రావాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. గతంలో పాఠశాలలో చదివి ప్రతిభ గల విద్యార్థినీయులకు ప్రోత్సాహకరంగా నగదు బహుమతులను ఉపాధ్యాయులు విద్యార్థులకు అందజేశారు.

## పరిశ్రమల స్థాపన కోసం వినతి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ పార్లమెంటుపరిధిలో ఉన్నటువంటి ఏడు నియోజకవర్గాలలో నిరుద్యోగ వ్యవస్థలేకుండా ఉద్యోగ మేళాలు నిర్వహించడం , నిరుద్యోగులుగా ఉన్నటువంటివారికి పరిశ్రమల స్థాపనకోసం, స్కిల్‌డెవలప్‌మెంట్‌కై రాష్ట్ర ఎంపిలఫోరం రాష్ట్ర కన్వీనర్, ఎంపి మల్లురవి పాల్గొన్నారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని పరిశ్రమలపై స్టాండింగ్ కమిటిలో ఆయన పాల్గొన్నారు. యంగ్ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని పైలట్‌ప్రాజెక్టుకింద నాగర్‌కర్నూల్ పార్లమెంటు పరిధిలో నిర్వహించాలనే ప్రతిపాదనలోభాగంగా యంగ్ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటి రిజిస్టర్అండ్ ఓఎస్‌డి చమన్‌మోతకు తనప్రతినిధి ద్వారా వినతి పత్రాన్ని అందజేశారు.



## సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై తనిఖీలు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు, దేవరకద్ర అసిస్టెంట్ డైరెక్టర్ యశ్వంత్ రావు, మహబూబ్‌నగర్ జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రత్నం, స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి మురళీధర్‌లతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఈ బృందం భూత్పూర్ మండల పరిధిలోని సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. మా అగ్రి బయోటెక్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్, పోతులమడుగు, సికోన్‌స్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్, భూత్పూర్, సుదివ్య సీడ్ ప్రాసెసింగ్ యూనిట్, భూత్పూర్, ఆద్యా సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, భూత్పూర్, సాయి తేజ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్, పోతులమడుగులలో తనిఖీలు చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ యశ్వంత్ రావు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంలో అలసత్వం తగదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సీడ్ ప్రాసెసింగ్ జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. విత్తన శుద్ధి, ప్యాకింగ్, గోదాముల నిర్వహణ వంటి అంశాల్లో పూర్తి సమీక్ష జరిపామని తెలిపారు.

## రైతుల అభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/కల్వకుర్తి:** రాష్ట్రప్రభుత్వం రైతులకు పెద్దపీటవేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతుందని, కల్వకుర్తి పట్టణంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో పట్టణంలో సంజాపూర్‌కు చెందిన రైతులకు మంజూరైన స్ప్రింక్లర్‌పైపులను కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డిఆధ్వర్యంలోలబ్దిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం రైతుల పక్షాన ఎల్లప్పుడూఉంటుందన్నారు. రైతుల సంక్షేమంకోసం సబ్సిడిలద్వారా రైతులకు మేలుచేసేదిశగా వెళుతుందన్నారు. జంగయ్య, లక్ష్మయ్య, శ్రీను, తాటికొండ ముత్యం, శ్రీను పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణకు పాదయాత్ర

**ప్రజాపక్షం/వెల్దండ :** రాజ్యాంగ పరిరక్షణకోసమే జైబాపు , జైభీమ్, జైసంవిధాన్ చేపట్టినట్లు మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ అన్నారు. గురువారం మండలపరిధిలోని చల్లంపల్లి, బొల్లంపల్లి , బండోనిపల్లి గ్రామాలలో ఏఐసిసిపిలుపుమేరకు పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కిసాన్ సెల్ తాలుకా అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి వెంకట్‌రెడ్డి, శంకరయ్య, యువజనకాంగ్రెస్ మాజీ కార్యదర్శి తక్కళ్లపల్లి శేఖర్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్రకార్యనిర్వాహకఅధ్యక్షులు శంకర్‌నాయక్, జిల్లాసేవాదల్ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య, యువజనకాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, ప్రసాద్, మహిళాకాంగ్రెస్ నాయకురాలు రాణి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు బ్రహ్మచారి, వినోద్, శేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, వెంకట్‌రావు పాల్గొన్నారు.

## ఆలయాల పునరుద్ధరణకు కృషి



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** రోడ్ల విస్తరణలో భాగంగా పాత బజార్ కాళిమాత గుడిని పునర్‌నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవడం పూర్వజన్మ సుకృతమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.గురువారం పాతబజార్ శ్రీశ్రీశ్రీ దక్షిణ కాళికాంబ సమేత కమటేశ్వర స్వామి అమ్మవారి విగ్రహ ప్రతిష్టలో గుడిని నిరంజన్ రెడ్డి సందర్శించారు. అనంతరం గుడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ వనపర్తి ప్రజలను దృష్టిలో పెట్టుకొని రోడ్ల విస్తరణ చేయడం జరిగిందని, పాత బజార్ వీరాంజనేయ స్వామి, కాళిమాత గుడి అత్యంత ప్రశస్తమైన దేవాలయాలను వాటిని పునరుద్దరించడం సంతోషదాయకమన్నారు. దర్గాలను ప్రజల కోరిక మేరకు అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకోచ్చమని, సహకరించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మోదీకి గుణపాఠం చెబుతాం

**ప్రజాపక్షం / వనపర్తి:** కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి ఓర్వలేని మోడి సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్ గాంధీల పేర్లు నమోదు చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడారు. ప్రతిపక్షాల మద్దుతుతో ప్రభుత్వాన్ని కూడగట్టుకొని వెంటిలేషన్ పై సర్కారును కొనసాగిస్తున్న మోడి ప్రభుత్వానికి త్వరలోనే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. జిల్లా డిసిసిబి అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ , జిల్లా ఘనపురం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ్ కుమార్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఒకరికి జైలుశిక్ష, మరొకరికి జరిమానా

**ప్రజాపక్షం / వీపనగండ్ల:** మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు కోర్టు శిక్షశ్ర విధించినట్లు వీపనగండ్ల ఎస్ఐ కె. రాణి తెలిపారు. మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామానికి చెందిన ఇంద్రకంటి చిన్నకృష్ణ అనే వ్యక్తి ఆటో నడుపుతూ డ్రండ్ అండ్ డ్రైవ్ లో పోలీసులకు పట్టబడటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. గద్వాల జిల్లా అతనపు గ్రామానికి చెందిన సింగారి కృష్ణయ్య మద్యం తాగి వాహనం అందుకు కేసు నమోదు చేసి ఇరువురిని వనపర్తి కోర్టులో హాజరు పర్చడంతో ఫస్ట్ అడిషనల్ జడ్జి బండారి శ్రీలత సంగినేనిపల్లి ఇంద్రకంటి చిన్న కృష్ణకు రెండు రోజులు జైలు శిక్ష, అనంతపూర్ కు చెందిన సింగారి కృష్ణయ్యకు వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐకె. రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు కానిస్టేబుల్ రాజేందర్ ఉన్నారు.

## జాతీయ ఒబిసి చైర్మన్‌కు సన్మానం



**ప్రజాపక్షం/పాన్‌గల్:** ఏఐసిసి జాతీయ ఓబిసి చైర్మన్‌గా నూతనంగా నియమితులైన డాక్టర్ అజయ్ జై హింద్ యాదవ్‌ను ఢిల్లీలో ఓబిసి జాతీయ కో ఆర్డినేటర్ డాక్టర్ కేతూరి వెంకటేష్ కలిశారు. జాతీయ ఓబీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జైహింద్ యాదవ్‌ను సన్మానించారు.

# వేసవిలో ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు సరఫరా

### నాగర్‌కర్నూలు కలెక్టర్ బదావత్ సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశమందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, వేసవిలో తాగునీరు అంశాలపై అదనపు కలెక్టర్ లోకల్‌బాడీస్ దేవసహాయం, సంబంధితశాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 754 హాబిటేషన్ కేంద్రాలకుగాను739 కేంద్రాలకు గ్రిడ్ ద్వారా వాటర్‌సప్లై చేస్తున్నట్లు, 15ఐసోలేటేడ్ కేంద్రాలకు లోకల్‌సోర్సు ద్వారా సోలార్‌కరెంటుద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటిపై కార్యాచరణ ప్రణాళిక ప్రకారం మున్సిపల్, పంచాయతీరాజ్, మిషన్‌భగీరథ, మండల ప్రత్యేకాధికారులు, మండలపరిషత్ అభివృద్ధి అధికారులు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమగ్రప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు అధికారులు సిద్దంగా ఉండాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లనిర్మాణంకొరకు ప్రభుత్వం మొదటిదశలో పునాది నిర్మాణంకొరకు లక్ష రూపాయల ఆర్థికసాయం అందిస్తుందని లబ్దిదారులకు తెలియజెప్పాలని సూచించారు. ఎటువంటి పైరవీలకు తావులేకుండా పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులు నిర్వహించాలన్నారు. ఇండ్లనిర్మాణం కొరకు దరఖాస్తుచేసుకున్న దరఖాస్తులను పూర్తిస్థాయిలో లోతుగా పరిశీలించాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారని అధికారులకు గుర్తుచేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ చిన్న ఓబులేసు, డిపిఓ , మిషన్‌భగీరథ అధికారులు, జడ్పి డిప్యూటిసిఇఓ గోపాల్, ఆర్‌డిఓలు, ఎంపిడిఓలు, మండల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

# ఆటలతోనే జీవితంలో క్రమశిక్షణ, ఉన్నతస్థితి సాధ్యం

### ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** యువతనిత్యం ఆటలపోటిల్లో క్రమంతప్పకుండా భాగస్వాములుకావడం ద్వారా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాలెం వాంటెడ్‌హెల్పింగ్‌హ్యాండ్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వారంరోజులపాటు నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ పోటిల్లో గెలుపొందిన జట్లకు గురువారం మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు, నగదు ప్రోత్సహాకాలనను అందజేసి మాట్లాడారు. యువత క్రీడల్లో పాల్గొనడంద్వారా గంజాయి, డ్రగ్స్, తాగుడువంటి వ్యసనాలకు లోనవకుండా క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదుగుతారని ఆశాభావం వ్యక్తంచేశారు. గ్రామీణస్థాయి నుండి అంతర్జాతీయస్థాయివరకు క్రీడాకారులు తయారవుతారని అన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గపరిధిలో పది ఎకరాలస్థలంలో ఇండోర్, ఔట్‌డోర్‌స్టేడియాలను నిర్మించి అన్నిరకాల వసతులను కల్పించి క్రీడలకుపెద్దపీట వేసేందుకు రూ.15కోట్ల నిధులు విడుదల చేయాలని సిఎం రేవంత్‌రెడ్డిదృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.20వేలు అందజేసిన తమటం జయకృష్ణను, రెండోబహుమతి నగదును అందజేసిన ముద్దం వెంకటేష్‌రెడ్డిని, పోటీల నిర్వహణకు ఆర్థికసాయం అందజేసిన లిటిల్‌రోజేస్‌హైస్కూల్ యాజమాన్యం భీమని ప్రశాంత్, ట్రోఫిలప్రధాత గంగనమోని సంపత్‌లను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దెరాములు, మాజీ పిఎసిఎస్‌చైర్మన్ వెంకటస్వామి, బంగారి పర్వతాలు, కాంగ్రెస్‌జిల్లా నాయకులు గోవిందు,రామకృష్ణ, రామచందర్‌నాయక్, వాల్యానాయక్, చిక్కొంద్రరాములు, పరుషరాములు, బంగారయ్య, శ్రీకాంత్, సంజీవ, బాలస్వామి, క్రీడాకారులు యాదగిరి, కుర్మయ్య, అభిలాష్, అజయ్, నరేష్ ఉన్నారు.

## కొనసాగుతున్న మట్టి తవ్వకాలు



**ప్రజాపక్షం/అచ్చంపేట :** శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సొరంగంలో జరిగిన ప్రమాదప్రదేశంలో డి2 ప్రాంతంలో సహాయక చర్యల్లోభాగంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు ప్రత్యేకాధికారి శివశంకర్‌లోతేటి తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమలపెంటలోని ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌లోపలకొనసాగుతున్నసహాయక చర్యలపై టన్నెల్ ఇన్‌లెట్1 ఆఫీసువద్ద సహాయకబృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకి తెలుసుకునేందుకు డి1, డి2 ప్రాంతాలలో అన్వేషణ జరిగిందని, ప్రస్తుతం డి2 ప్రాంతంలో పూర్తిస్థాయిలో మట్టి తవ్వకాలు,టిబిఎంకత్తిరింపుపనులు జరుపుతూ కార్మికుల జాడకై నిరంతరం సహాయక బృందాలు శ్రమిస్తున్నట్లు తెలియజేశారు.అత్యధికంగా ఉన్నటువంటి మట్టిని కన్వేయర్‌బెల్టుగుండా టన్నెల్ బయటికి పంపుతున్నట్లు, ఊటనీటిని నిర్విరామంగాబయటకు పంపించేస్తున్నట్లు తెలిపారు.

## డిజె సాంప్రదాయానికి స్వస్తి చెప్పండి

### వనపర్తి జిల్లా ఎస్‌పి గిరిధర్

**ప్రజాపక్షం /వనపర్తి టౌన్ :** సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని వనపర్తి జిల్లాలో శుభకార్యాలలో, మతపరమైన ఊరేగింపుల్లో, డిజే నిషేదం, జిల్లాలోని డిజే యజమానులకు జిల్లా ఎస్పీ అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు డిజే సౌండ్ సిస్టమ్ సాంప్రదాయానికి స్వస్తి పలకాలని చిన్న పిల్లలు, వృద్దులు,గుండె జబ్బు రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా , శబ్ద కాలుష్యం నుంచికాపాడేందుకు భారీ శబ్దాలతో కూడిన డిజే సౌండ్ వినియోగంపై నిషేదాజ్ఞలు విధిస్తున్నామని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశ భవనంలో జిల్లాలోని అన్ని మండలాల డిజే యజమానులు , నిర్వహకులకు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి ననిర్వాహకులకు అవగాహన కల్పించారు. అధిక శబ్ద తీవ్రత గల డిజే సౌండ్ సిస్టమ్ ను పెళ్లిళ్లు, శుభకార్యాలు, ర్యాలీలో ఉపయోగించడం వల్ల అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అందరికి తెలుసని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా యువకులు ఈ డిజే సంప్రదాయానికి అలవాటు పడి తప్పతాగి విచ్చలవిడిగా చిందులు వేయడం ఒక ఫ్యాషన్‌గా మారిందని ఆయన వివరించారు. ఈ నిబంధనలు ప్రభుత్వ అనుమతులను ఉల్లంఘిస్తే 223, 280, 292,293,324, బిఎన్ఎస్ఎస్ 152, పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్ 15 కింద కేసులు నమోదు చేస్తామని ఎస్పీ వెల్లడించారు. వనపర్తి అదనపు ఎస్పీ ఉమామహేశ్వరరావు, వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు, వనపర్తి సిఐ కృష్ణ, కొత్తకోట సిఐ రాంబాబు, ఆత్మకూర్ సిఐ శివకుమార్ , స్పెషల్ బ్రాంచ్ సిఐ నరేష్ , ఎలక్ట్రానిక్ సౌండ్ సిస్టమ్స్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## సోనియా, రాహూల్‌పై అక్రమ కేసులు అన్యాయం

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి:** నేషనల్ హెరాల్డ్ పత్రిక నిర్వహణలో భాగంగా యంగ్ ఇండియా ట్రస్ట్ స్థాపించిన కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, ఆమె తనయుడు, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తప్పుడు పద్ధతిలో దొడ్డి దారిన అక్రమ కేసులు బనాయించిందని తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ సామాజికవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అహ్మద్‌ఖండించారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులు భాగంగా ప్రతిపక్ష కాంగ్రెస్‌పై తప్పుడు కేసులు బనాయించి ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను స్వాతంత్రోద్యమాని కంటే ముందే తొలి భారత ప్రధాని జవహర్లాల్ నెహ్రూ స్థాపించారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఆ పత్రిక దేశవ్యాప్తంగా కొనసాగిందని పేర్కొన్నారు.పత్రిక నిర్వహణక్రమంలో ఇన్ ఇండియా సొసైటీని ఏర్పాటు చేసి పత్రిక నిర్వాహనకు నిధులు సమీకరించిన విషయాన్ని బీజేపీ ప్రభుత్వం తప్పుగా చిత్రీకరించి మచ్చలేని మహానాయకులైన కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ,రాహుల్ గాంధీలపై ప్రజల్లో తప్పుడు అభిప్రాయాన్ని కలిగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేస్తున్నదని చేసిందని విమర్శించారు. లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది రాయిగా పేర్కొనే భారతదేశాన్ని సంఘ్ పరివార్ శక్తుల చర్యలు దేశాన్నితలదించుకునేలా చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీలు తమ ఐక్యతను చాటాలని, మేధావులు విద్యార్థులు యువత కలిసి కేంద్రంలోని బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలని హనీఫ్ అహ్మద్ పిలుపునిచ్చారు.

## దళితరత్న అవార్డు పట్ల హర్షం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన షెడ్యూల్‌కులాల అభివృద్ధిశాఖ వర్కింగ్‌చైర్మన్లు చెరుకురాంచందర్, ఇటికరాజుల సమక్షంలో నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలకేంద్రానికి చెందిన చింతసత్తికి దళితరత్న అవార్డురావడం అభినందనీయమని రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షులు పిల్లిసుధాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని మున్నూరుకాపు ఫంక్షన్‌హాలులో చింతసత్తికి దళితరత్నఅవార్డు దక్కడం జిల్లాకేకాకుండా దళిత సమాజానికి ఒక నిదర్శనమన్నారు.



## మల్లీశ్వరి కేసులో నిందితులను శిక్షించాలి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రాష్ట్రంలో దళిత యువతులకు రక్షణకరువైందని స్వేరో సీనియర్ నాయకులు దుబ్బనాగేష్ అన్నారు. నల్గొండ జిల్లా బొక్కముంతల పహాడ్ గ్రామానికిచెందిన ధర్మవరపు మల్లీశ్వరి అనే 27ఏళ్ల దళిత యువతి ఆత్మహత్య చేసుకుందన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లీశ్వరి మృతికి కారణమైన వారిని జాన్‌రెడ్డిని ఉరితీయాలని డిమాండ్‌చేశారు. పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాదగ్గర ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌డిఓకు అందజేశారు. కులవివక్షతతో మల్లీశ్వరి మృతిచెందిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని నిందితులను ఉరితీయాలని డిమాండ్‌చేశారు. ఉజ్వలభవిష్యత్తు ఉన్నస్టాఫ్‌నర్సు మల్లీశ్వరిమృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో భీముడు, సీనియర్ పాత్రికేయులు రాజన్న, డివిజన్ అధ్యక్షులు కిశోర్, వెల్దండ మండల అధ్యక్షులు శివ, ఎమ్మార్పీఎస్ రంగారెడ్డిజిల్లా ఉపాధ్యక్షులు కిరణ్, నాయకులు విష్ణు,ఊర్కొండ మాజీ సర్పంచ్ రాజు, తిమ్మాయిపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్‌కార్డుల దరఖాస్తులపై పరిశీలన



**ప్రజాపక్షం/వెల్దండ :** కొత్తగా రేషన్‌కార్డులకోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న ఆర్జీలను గురువారం మండలరెవెన్యూ అధికారులు వివిధ గ్రామాల్లో పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ కార్తీక్‌కుమార్ తెలిపారు. మండలపరిధిలోని చిక్కన్నపల్లి గ్రామంలో దరఖాస్తుల పరిశీలన తీరును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో 3656కొత్తగా రేషన్ కార్డులకోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. దరఖాస్తుల పరిశీలన కోసం ఇద్దరు ఆర్‌ఐలతోపాటు మరో ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లతో క్షేత్రస్థాయిలో ఇంటింటికితిరిగి పరిశీలించడం జరుగుతుందని , అందులో దరఖాస్తుదారుల్లో ఎవరైన ప్రభుత్వ ఉద్యోగి ఉన్నడా, లేదా, ఏడున్నర ఎకరాలకన్న ఎక్కువగా ఏమైనాభూమి ఉందా లేదా అనే వివరాలను సేకరించి ఎప్పటికప్పుడు ఎఫ్ఎస్సి యాప్‌లో నమోదుచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు శంకర్‌నాయక్, శైలజ, జూనియర్ అసిస్టెంట్లు సహదేవ్, దయాకర్, రమేష్, అనిత, స్వరూపరాణి, రమేష్ తదితరులు ఉన్నారు.

## అక్రమ కేసులకు నిరసనగా దిష్టిబొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం/ పెబ్బేరు :** పెబ్బేరు పట్టణ కేంద్రంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కారుపాకుల వెంకట్ రాములు యాదవ్ ఆధ్వర్యంలో ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ , పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడి దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. అనంతరం మోడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెబ్బేరు మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అక్కి శ్రీనివాస్‌గౌడ్, మాజీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గంధం రాజశేఖర్ , మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్ మోతే రాములు, మాజీ కౌన్సిలర్ ఎల్ల స్వామి, మండల ఎస్సి సెల్ అధ్యక్షులు బాలచందర్ , పెబ్బేరు పట్టణ కిసాన్ ససెల్ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్‌సురేందర్‌గౌడ్, తోకల సత్యనారాయణ, యాపర్ల రాంరెడ్డి, భాను ప్రకాశ్ రెడ్డి, గుమ్మడం వెంకట్రాంరెడ్డి, దయాకర్ రెడ్డి, షకీల్, జైపాల్ రెడ్డి, ఆశన్న నాయుడు, వెంకటేష్, కాటమోని వెంకటయ్యగౌడ్, గుమ్మడం రాఘవేందర్, పెంచికలపాడు జనార్ధన్ , రంగం నర్సింహ, రమేష్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 'భూభారతి'తోనే భూ సమస్యలు పరిష్కారం

### జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి







**ప్రజాపక్షం/జడ్చర్ల:** తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ప్రవేశపెడుతున్న భూభారతి పోర్టల్ ద్వారా రాష్ట్రంలోని భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం జడ్చర్ల కేంద్రంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో ప్రజల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయనే దానిక భూభారతి ముఖ్య ఉదాహరణ అని వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పరిపాలనలో ధరణి పోర్టల్ ద్వారా రెవెన్యూ శాఖలో అనేక చిక్కుల ఏర్పడ్డాయని విమర్శించారు. అధికారులు భూ సమస్యలను పరిష్కరించడంలో ధరణి పోర్టల్ ద్వారా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భాలు ఉన్నాయన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణి పోర్టల్ తీసుకొచ్చి రెవెన్యూ శాఖకు ప్రజలకు మధ్య సంబంధాలు లేకుండా చేశారని తెలిపారు. ప్రతిరోజు హైదరాబాద్ లోని నా నివాసానికి ఎంతోమంది భూ సమస్యల పై వస్తుంటారని అనిరుధ్ రెడ్డి గుర్తు చేశారు. ప్రజలు ఇచ్చిన భూ ఫిర్యాదులన్నిటిని ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ పంపించి వాటిని పరిశీలన చేయాలని కోరానని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులుగా ఉన్న మా యొక్క భూ సమస్యలే పరిష్కారం కావడం లేదని, పేద ప్రజల భూ సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ఆయన వివరించారు. నేను కూడా భూభారతిలో నా యొక్క భూ సమస్యలపై దరఖాస్తు చేసుకుంటానని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. భూభారతి పై నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అధికారులతో కలిసి వెళ్లి అవగాహన సదస్సులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

**మక్తల్ :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో మండల తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి చట్టంపై ఏర్పా టు చేసిన అవగాహన సదస్సు కార్యక్రమంలో ము ఖ్య అతిథిగా పాల్గొన్న నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డా॥ వాకిటి శ్రీహరి. వారు మాట్లాడుతూ, రైతులు చట్టాల పై సంబంధిత సెక్షన్ ల పై పూర్తి అవగాహనతో ఉండడం ఎంతో అవసరమని అన్నారు. చట్టాలను తెలుసుకొని మాట్లాడడం ద్వారా పనులు త్వరిత గతినపూర్తి చేసుకోవడానికి అస్కారం ఉంటుందని అన్నారు.

ఫోకస్

# నేల లేని 'హైడ్రోపోనిక్' వ్యవసాయం!



దేశంలో భూసార విలువలు తగ్గుతున్నాయని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఫలితంగా నేల లేకుండానే వ్యవసాయ విధానాలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. వివిధ అధ్యయనాల అభిప్రాయం ప్రకారం, ఇటీవలి కాలంలో వ్యవసాయం పురుగుమందులు మరియు రసాయనాలపై ఎక్కువగా ఆధారపడుతున్నది. ఈ రసాయనాలు, నేలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. కాలుష్యం పెరుగుతున్నది. పెద్ద ఎత్తున నేల క్షీణతతో పాటు, వాతావరణ మార్పుకస కారణమవుతున్నది. ఈ అంశాలు పంటలను పండించే భూమి సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి, ఇది ప్రపంచవ్యాప్తంగా ఆహార కొరతకు దారితీస్తున్నది. ఇటీవలి సంవత్సరాలలో, వ్యవసాయ పద్ధతులు శాశ్వత సంస్కృతి , పంటల భ్రమణ, పాలీ కల్చర్, హైడ్రోపోనిక్ వ్యవసాయం వంటి స్థిరమైన ఆహార పెంపకం పద్ధతుల వైపు ప్రధాన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వీటిలో హైడ్రోపోనిక్ వ్యవసాయం ప్రధానమైనది. గ్రీకు పదాలైన "హైడ్రో" (నీరు), "పోనోస్" (శ్రమ) నుండి ఉద్భవించిన హైడ్రోపోనిక్స్ అంటే "నీటితో పనిచేయడం" అని అర్థం. ఈ పదం ముఖ్యంగా నేల లేకుండా పంటలను పండించే పద్ధతిని సూచిస్తుంది. ఇది విరుద్ధమైనదిగా అనిపించవచ్చు. ఎందుకంటే మొక్కలు వాటి పెరుగుదలకు అవసరమైన పోషకాలను నేల నుండి పొందుతాయి, అవి లేకుండా అవి చనిపోయే అవకాశం ఉంది. అయితే, హైడ్రోపోనిక్ మొక్కలు నీటి ద్రావణ మాధ్యమం నుండి అవసరమైన అన్ని పోషకాలను పొందుతాయి, అందువల్ల నేల ఉనికి దాని మనుగడకు అనవసరం అవుతుంది. హైడ్రోపోనిక్ వ్యవసాయం యొక్క ప్రధాన ప్రయోజనాల్లో ఒకటి, ఈ పద్ధతిని చిన్న, పెద్ద తరహా వ్యవసాయంలో ఉపయోగించవచ్చు. అపార్ట్‌మెంట్లలో నివసించేవారు లేదా తోట లేనివారు వంటి పెద్ద స్థలం లేని వ్యక్తులు మొక్కలను పెంచడానికి హైడ్రోపోనిక్‌లను విజయవంతంగా ఉపయోగించవచ్చు. స్థిరమైన ఆహార సాగు పద్ధతిని అందించడం పట్ల హైడ్రోపోనిక్స్ సాగుదారులలో సానుకూల ఆకర్షణను పొందుతున్నప్పటికీ, హైడ్రోపోనిక్ వాతావరణంలో సరిగ్గా పెరగని కొన్ని మొక్కలు ఉన్నాయి. వీటిలో బంగాళాదుంపలు, పొడవుగా పెరిగే మొక్కలు మరియు తీగలు వంటి లోతైన వేర్లు ఉన్నవి ఉన్నాయి. ఒక మొక్క పెరగాలంటే, మూడు విషయాలు చాలా ముఖ్యమైనవి: సూర్యరశ్మి, నీరు మరియు పోషకాలు. సాంప్రదాయ వాతావరణంలో, మొక్కలను నేలలో పెంచుతారు, ఇది వాటికి అవసరమైన పోషకాలు, నీటిని పొందే మాధ్యమంగా పనిచేస్తుంది. హైడ్రోపోనిక్ మొక్కలు వివిధ రకాల పరికరాల ద్వారా వేర్లకు చేరే ద్రావణం ద్వారా అన్ని అవసరమైన పోషకాలను పొందుతాయి. హైడ్రోపోనిక్ వాతావరణంలో రెండు రకాల సాగు పద్ధతులు ఆధిపత్యం చెలాయిస్తాయి... యాక్టివ్ సిస్టమ్‌మొక్కల వేర్లు పంపుల నుంచి ప్రసరించే నీటి ద్రావణం ద్వారా పోషకాలను నేరుగా పొందే వ్యవస్థను యాక్టివ్ సిస్టమ్ అంటారు. ఈ వ్యవస్థ మరింత క్లిష్టంగా ఉంటుంది, కాబట్టి కొంతమంది సాగుదారులు దీనిని సంక్లిష్టంగా భావించవచ్చు. యాక్టివ్ సిస్టమ్ పోషక ద్రావణాన్ని రిజర్వాయర్ నుండి వేళ్లకు తరలించే పంపులను ఉపయోగిస్తుంది. వేర్లు గ్రహించలేని అదనపు ద్రావణం తిరిగి జలాశయంలోకి ప్రయాణిస్తుంది. నిష్క్రియాత్మక వ్యవస్థనిష్క్రియాత్మక వ్యవస్థకు ద్రావణాన్ని ప్రసరింపజేయడానికి పంపు అవసరం లేదు. బదులుగా, మొక్కలను దావణంలో వేలాడదీస్తారు. తరువాత గురుత్వాకర్షణ, వరదలు లేదా కేశనాళిక వ్యవస్థలపై ఆధారపడే వివిధ పద్ధతుల ద్వారా మూలాలను చేరుతాయి. ఈ రకమైన హైడ్రోపోనిక్ వ్యవసాయం పంపుల ప్రమేయం లేనందున ఉపయోగించడం సులభం. అయితే, రైతు తరచుగా నీటిని మార్చాల్సి ఉంటుంది. అంతేకాకుండా, పంపులు లేకపోవడం వల్ల ఆల్గే పెరగడం సులభం అవుతుంది, ఇది నీటి నాణ్యతను దిగజార్చవచ్చు. హైడ్రోపోనిక్ వ్యవసాయం యొక్క ప్రయోజనాలు మొక్కలను పెంచడానికి హైడ్రోపోనిక్స్ ఒక ప్రభావవంతమైన వ్యవస్థ, మరియు రాబోయే భవిష్యత్తులో, ఇది ఆహార ఉత్పత్తికి అత్యంత ఉపయోగకరమైన స్థిరమైన మార్గాలలో ఒకటిగా మారే అవకాశం ఉంది.

## వ్యవసాయం ప్రయోజనాలు..

అధిక జనాభాకు అధికనాణ్యత గల ఆహారాన్ని ఉత్పత్తి చేయడం. హైడ్రోపోనిక్ వాతావరణంలో, పెంపకందారులు పురుగుమందులను ఉపయోగించరు. ఎందుకంటే ఇండోర్ స్థానం కారణంగా తెగుళ్ల ముట్టడి ప్రమాదం తక్కువగా ఉంటుంది. అదనంగా, మొక్కలు అవసరమైన పోషకాలను నేరుగా ద్రావణంలో పొందుతాయి. ఇది వాటిని వేగంగా అభివృద్ధి చేయడానికి, వ్యాధుల నుండి విముక్తి పొందటానికి వీలుకల్పిస్తుంది. ఉత్పత్తి మంచి నాణ్యతతో ఉండటమే కాకుండా, హైడ్రోపోనిక్ సెటప్ నగర ప్రాంతాల్లోని అధిక జనాభాకు అనుగుణంగా ఉంటుంది, అంటే నగరాల్లో స్థానిక ఆహారం లభ్యతను సూచిస్తుంది. తగ్గిన నీటి వినియోగం సాంప్రదాయ వ్యవసాయంతో పోలిస్తే హైడ్రోపోనిక్ వ్యవసాయం చాలా తక్కువ నీటిని ఉపయోగిస్తుంది. దీనికి కారణం నీటి ద్రావణాన్ని తిరిగి ఉపయోగించడం... పైపుల ద్వారా హైడ్రోపోనిక్ సెట్టింగ్‌లో తిరిగి ప్రసరణ చేయడం. అదనపు నీటిని పోషక ద్రావణ జలాశయానికి తిరిగి తీసుకువెళతారు. ఇది కరువు కారణంగా నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో హైడ్రోపోనిక్స్‌ను మంచి వ్యవసాయ సాంకేతికతగా చేస్తుంది. సాంప్రదాయ వ్యవసాయంలో దీనికి విరుద్ధంగా, పెద్ద మొత్తంలో నీరు ఉపయోగించబడుతుంది, దీనిలో ఎక్కువ భాగం బాష్పీభవనం, సరైన నీటిపారుదల లేకపోవడం వల్ల వృథా అవుతుంది. చివరికి, చాలా తక్కువ శాతం నీరు మాత్రమే మొక్కలకు చేరుతుంది. హైడ్రోపోనిక్స్‌లో మొక్కలను పెంచడానికి నేల అవసరం లేదు. ఇది నేల ద్వారా సంక్రమించే వ్యాధులను తగ్గిస్తుంది. అదనంగా, ఈ వ్యవసాయ పద్ధతి ఇంటి లోపల జరుగుతుంది. ప్రతి నియంత్రిత సెటప్‌లో ఉంటుంది కాబట్టి, తెగుళ్ల వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. మెరుగైన దిగుబడిహైడ్రోపోనిక్స్ మొక్కలను పెరగడానికి నియంత్రిత, పర్యవేక్షించబడిన వాతావరణాన్ని అందిస్తుంది. అదనంగా, అవసరమైన పోషకాలను నేరుగా వేర్లకు సరఫరా చేయడం వల్ల అవి వేగంగా పెరగడానికి సహాయపడుతుంది. సాగుదారులు రుతువులపై ఆధారపడాల్సిన అవసరం లేదు కాబట్టి ఇంటి లోపల వాతావరణం కూడా దిగుబడిపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. దీని అర్థం పంటలను ఏడాది పొడవునా పండించవచ్చు, తెగుళ్ల జబ్బు, వాతావరణ మార్పులు, నేలపై జంతువులు, పక్షుల నుండి ఇబ్బందులు వంటి బాహ్య కారకాల వల్ల పంటలను కోల్పోయే సమస్య తగ్గుతుంది. ప్రాంతం లేదా ప్రాంతీయ వైవిధ్యానికి అనుగుణంగా ఇందులో మార్పులుచేర్పులు చేసుకునే అవకాశం ఉంది. హైడ్రోపోనిక్ వ్యవసాయం యొక్క ఉత్తమ ప్రయోజనాల్లో ఒకటి అది స్థలాన్ని ఆదా చేస్తుంది. సాంప్రదాయ వ్యవసాయంలో, మొక్కలు నేలలో పోషకాల కోసం వెతకాలి, దీని కారణంగా మొక్కల లోతైన వేర్లు పెరుగుతాయి. మరోవైపు, హైడ్రోపోనిక్స్‌లో, పోషకాలు నేరుగా వేర్లకు సరఫరా చేయబడతాయి, కాబట్టి అవి వాటి కోసం వెతకాల్సిన అవసరం ఉండదు. తక్కువ దట్టమైన వేర్లు కలిగిన మొక్కలు తక్కువ స్థలాన్ని తీసుకుంటాయి, దీని వలన క్లోజ్డ్ ప్రాంతాలు, ఎడారి పీడిత ప్రాంతాలు, అతి శీతల ప్రాంతాలలో నివసించే నగరవాసులకు హైడ్రోపోనిక్స్ అనువైన ఎంపిక. హైడ్రోపోనిక్స్ వ్యవసాయం పోషకాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి అనుమతిస్తుంది. ఎందుకంటే మొత్తం వాతావరణం దాదాపుగా నియంత్రణలో ఉంటుంటుంది. మొక్కలకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలు మాత్రమే అందుతాయి. పెరుగుదలకు అవసరమైన సరైన పోషకాలను అందించడం ద్వారా, హైడ్రోపోనిక్స్ ద్వారా పెరిగిన మొక్కలు సాంప్రదాయ వ్యవసాయం ద్వారా పెరిగిన మొక్కలతో పోలిస్తే మెరుగైన దిగుబడి, అధిక వృద్ధి రేటును సాధిస్తాయి. ఇక్కడ మొక్కలు వివిధ పర్యావరణ పారామితులపై ఆధారపడిన నేలలో ఉండే పోషకాలపై ఆధారపడి ఉంటాయి. ఉదాహరణకు, తేమ, ఉష్ణోగ్రత, నీటి నాణ్యతలో వైవిధ్యం మొక్కలను ఒత్తిడికి గురి చేస్తుంది, ఇది వాటి జీవరసాయన నిర్మాణాన్ని ప్రభావితం చేస్తుంది, ఇది పెరుగుదల, ఉత్పత్తుల నాణ్యతను ప్రభావితం చేస్తుంది. 6. సమయం ఆదా చేసే వ్యవస్థసాంప్రదాయ వ్యవసాయంలో దున్నడం, కలుపు తీయడం, నీరు పెట్టడం వంటి పనులను పర్యవేక్షించడానికి రైతుల నుండి చాలా శ్రమ, సమయం అవసరం. ఇవన్నీ నాణ్యత, పరిమాణం పరంగా ఎల్లప్పుడూ తగినంత లేదా సంతృప్తికరంగా ఉండకపోవచ్చు. దీనికి విరుద్ధంగా, హైడ్రోపోనిక్స్‌లో, మీకు కావలసిందల్లా మీకు నచ్చిన స్థలంలో దానిని ఏర్పాటు చేసి, మీ మొక్కలు పెరగడాన్ని చూడటం. దీనికి ప్రారంభ పెట్టుబడి, సమయం అవసరం కావచ్చు కానీ, బాగా నిర్వహించినట్లయితే, ఇది దీర్ఘకాలిక అధిక రాబడిని హామీ ఇస్తుంది. హైడ్రోపోనిక్ వ్యవసాయం యొక్క ప్రతికూలతలు సాంప్రదాయ వ్యవసాయంతో పోలిస్తే హైడ్రోపోనిక్ వ్యవసాయం సులభం మరియు మరింత ప్రభావవంతంగా ఉంటుంది.



## సమస్యలు..



హైడ్రోపోనిక్ వ్యవసాయం కూడా కొన్ని లోపాలను కలిగి ఉంది. మొదటగా, అధిక సెటప్ ఖర్చుహైడ్రోపోనిక్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ఖరీదైనది. అనుకూలీకరించిన డిజైన్‌ను ఉపయోగించే పెద్దస్థాయి వ్యవస్థకు ఇది ప్రత్యేకంగా వర్తిస్తుంది. హైడ్రోపోనిక్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఉపయోగించే యాంత్రికీకరణ, సాంకేతికత ఆధారంగా, నీటి శుద్ధి కర్మాగారం, పోషక ట్యాంక్, లైటింగ్, ఎయిర్ పంప్, రిజర్వాయర్, ఉష్ణోగ్రత నియంత్రిక, ఆమ్లత్వ నియంత్రణ, ప్లంబింగ్ వ్యవస్థలు వంటి వాటి ప్రారంభ సంస్థాపనకు భారీ ప్రారంభ బడ్జెట్ అవసరం కావచ్చు. స్థిరమైన విద్యుత్ సరఫరా/వ్యవస్థపై ఆధారపడటంమరో సమస్య.హైడ్రోపోనిక్ వ్యవసాయ వ్యవస్థ దాని వివిధ భాగాలను నిరంతరం పని చేయడానికి విద్యుత్తుపై ఎక్కువగా ఆధారపడుతుంది. విద్యుత్తు అంతరాయం ఏర్పడితే, మొత్తం వ్యవస్థ విఫలమయ్యే ప్రమాదం ఉంది, ఇది మొక్కలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. బోవరీ ఫార్మింగ్ వంటి కొత్త తరం పొలాలు సౌరశక్తితో నడిచే హైడ్రోపోనిక్ వ్యవస్థలను ఉపయోగిస్తున్నప్పటికీ , సౌరశక్తిని ప్రధాన విద్యుత్ సరఫరాగా ఉపయోగించే ఇండోర్ వర్టికల్ హైడ్రోపోనిక్ గార్డెన్‌లు విద్యుత్ వనరుల కొనసాగింపును నిర్వహించడానికి ప్రారంభ కార్యాచరణ ఖర్చుల గురించి ఇప్పటికీ సవాళ్లు ఉన్నాయి. పునరుత్పాదక శక్తి వనరుల వాడకం ఖచ్చితంగా పెరుగుతున్నప్పటికీ, శిలాజ శక్తిపై ఆధారపడటం ఇప్పటికీ ప్రతికూలతగా ఉంది. కాగా, ఉన్నత స్థాయి నిర్వహణ, పర్యవేక్షణ హైడ్రోపోనిక్ వ్యవస్థలోని వివిధ భాగాలు కలిసి పనిచేస్తాయి, తద్వారా మొక్కలకు పోషకాలు సజావుగా సరఫరా అవుతాయి. ఈ భాగాలలో దేనిలోనైనా వైఫల్యాన్ని నివారించడానికి, పెంపకందారులు చాలా అప్రమత్తంగా ఉండాలి. పంపులు సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా ఉష్ణోగ్రత, వెలుతురు సరిపోతాయో లేదో తనిఖీ చేయడానికి నిరంతరం పర్యవేక్షణ అవసరం. నీటి ద్వారా వచ్చే వ్యాధులకు గురయ్యే అవకాశంహైడ్రోపోనిక్ వ్యవస్థలో మొక్కలను పెంచడం వల్ల నేల ద్వారా సంక్రమించే వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది, అయితే వ్యవస్థ ద్వారా నీటి నిరంతర ప్రసరణ మొక్కలను కొన్ని నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందికొన్నిసార్లు, ఈ వ్యాధులు ఒక మొక్క నుండి మిగిలిన మొక్కకు నీటి ద్రావణం ద్వారా వ్యాపిస్తాయి. ఇది వ్యవస్థలోని అన్ని మొక్కలను నాశనం చేసే అవకాశం ఉంది. అంతేగాక, ప్రత్యేక నైపుణ్యం అవసరం.హైడ్రోపోనిక్ వ్యవస్థలో చాలా సాంకేతిక అంశాలు ఉంటాయి. ఈ వ్యవస్థలో ఉండే పరికరాలు, సాంకేతికతలకు వాటిని ఎలా ఉపయోగించాలో సరైన జ్ఞానం మరియు నైపుణ్యం ఉన్న వ్యక్తి అవసరం. తగిన నైపుణ్యం లేకుండా మొక్కలు పెరగకపోవచ్చు, ఇది దిగుబడిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది, దీనివల్ల భారీ నష్టం జరుగుతుంది. సేంద్రీయ లేబుళ్ల చర్చనీయాంశ స్వభావంహైడ్రోపోనిక్ వ్యవసాయంలో పురుగుమందులు ఉపయోగించరు కాబట్టి, హైడ్రోపోనిక్ మొక్కలను సేంద్రీయంగా ధృవీకరించడానికి అది తగినంత కారణం అవుతుందా? సేంద్రీయ వ్యవసాయం అంటే నేల నాణ్యతను మెరుగుపరచడం. దాని సారాన్ని మెరుగుపరచడం అనే లక్ష్యంతో పనిచేయడం కాబట్టి కొంతమంది సేంద్రీయ రైతులు ఈ ఆలోచనను వ్యతిరేకిస్తున్నారు. ఏదిఏమైనా, ప్రతి అంశంలోనూ లాభనష్టాలు ఉంటాయి. సానుకూల పరిస్థితులను పరిగణలోకి తీసుకొని, ముందుకు వెళ్లడం మంచిది. స్థూలంగా చూస్తే, హైడ్రోపోనిక్ వ్యవసాయం అనేది ఇంటి లోపల మొక్కలను పెంచడానికి ఒక ప్రభావవంతమైన పద్ధతి. దీనికి వివిధ మార్గాల్లో దాని స్వంత ప్రయోజనాలు ఉన్నాయి. ఇది పెంపకందారులు పురుగుమందుల వాడకం లేకుండా పోషకాలు అధికంగా ఉండే మొక్కలను చాలా వేగంగా ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది. ఇది కొన్ని ప్రతికూలతలతో వచ్చినప్పటికీ, దాని ప్రయోజనాలు లోపాల కంటే ఎక్కువగా ఉంటాయి. పునరుత్పాదక ఇంధన వనరుల సరైన జ్ఞానం మరియు వినియోగంతో, వ్యక్తులు, సంస్థలు, సమాజాలు ఏడాది పొడవునా వ్యాధి రహిత మొక్కలను పెంచడానికి హైడ్రోపోనిక్స్‌ను ఉపయోగించవచ్చు.

## అకాల వర్షానికి నష్టపోయిన పంటలను పరిశీలించిన సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి :** రాజాపూర్ మండల పరిధిలోగల గుండ్ల పొట్లపల్లి గ్రా మంలో గురువారం అకాల వడగళ్ల వర్షానికి నష్టపోయిన మొక్కజొన్న, వరి, కూరగాయల తోటలు సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్ పరిశీలించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాడు భారీగా వనగండ్ల వర్షం కురవడం వల్ల నష్టపోయిన పంటలను పరిశీలిచిన ఆయన మాట్లాడుతూ ఒక ఎకరానికి మొక్కజొన్నకు పెట్టుబడి ఖర్చు 25 నుంచి 30 వేల వరకు, వరి ఎకరానికి పెట్టుబడి ఖర్చు 30 వేల వరకు వస్తుంది ఇప్పుడు వనగండ్ల వర్షం వల్ల పూర్తిగా పంట నష్ట పోవడం జరిగినది కావున ప్రభు త్వం పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక ఎకరానికి మొక్కజొన్నకు రూ.40 వేలు, వరికి రూ.50వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.కృష్ణ యాదవ్, వ్యవసాయ కార్మిక సం ఘం జిల్లా అధ్యక్షులు జి.సత్యనారాయణ రెడ్డి, మాడెమోని ఆంజనేయులు, రైతులు, యాదగిరి, ఎం.గోవర్ధన్, కే.మహేష్, ఆకుల నర్సింలు, హనుమం తు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


## 29న ఎఐవైఎఫ్ యాదాద్రి జిల్లా 2వ మహాసభలు

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా 2వ మహాసభల కరపత్రాన్ని బొమ్మలరామారం మండల కేంద్రంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబొయిన మహేందర్ మాట్లాడుతూ యాదగిరి గుట్ట పట్టణంలోని లక్కీ పంక్షన్ హాల్‌లో ఈనెల 29న జరిగే 2వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ దేశంలో పెరుగుతున్న మత ఛాందసవాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తుల ఐక్యత కొరకు యువత పనిచేయాలని ఈ దేశ సమగ్రత సమైక్యతను కాపాడుట కొరకు యువత ఉద్యమాలు నిర్వహించాలన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించడానికి ఈ మహాసభలు నాంది కావాలని యువతకు సూచించారు. పని హక్కు ప్రాథమిక హక్కుగా గుర్తించాలని సమగ్ర యువజన విధానం కోసం పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం ఎఐవైఎఫ్ అని, ప్రకృతి సంపద ప్రజలకే దక్కాలన్నారు. ఈ నెల 29న యాదగిరిగుట్టలో జరిగే జిల్లా మహాసభకు యువకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేష్, కల్లెపల్లి మహేందర్, గోపగాని రాజు, ఏఐవైఎప్ మండల కన్వీనర్ తుమ్మల జ్యోతి, శ్రీను నాయక్, ప్రశాంత్ నాయక్, టి.జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కేంద్ర ఆస్పత్రిని.. వెయ్యి పడకలకు పెంచాలి

### సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి : ఎఐటియుసి డిమాండ్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచాలని, మెడికల్ కళాశాల నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, జిల్లా అధ్యక్షులు సుధాకర్ అన్నారు. గురువారం ప్రభుత్వ ఆస్పత్రి నిజామాబాద్‌లో రాష్ట్ర డిఎంఇ నరేంద్ర కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచాల్సిన అవసరముందని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచాల్సిన అవసరముందని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ప్రతిరోజు నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలకు చెందిన రోగులు రోజుకు సుమారు 2500 మంది అవుట్ పేషన్స్, 1200 మంది ఇన్ పేషంట్స్‌లకు పైగా రోగులు చికిత్స కోసం వస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిని మరింత మెరుగ్గా తయారుచేయాల్సిన అవసరముందన్నారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వారిపై పని భారం పెరుగుతున్నందున రెగ్యులర్ సిబ్బందితో పాటు శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీని పెంచాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి స మాన వేతనం చెల్లించాలని కోరారు. మెడికల్ కళాశాలలో గత టెండర్ కంటే బడ్జెట్ తగ్గించి టెండర్ వేయటంతో కార్మికులపై పని భారం పెరుగుతుందని బడ్జెట్‌ను పెంచి కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. డిఎంఇ స్పందిస్తూ ప్రభుత్వ ఆ స్పత్రికి రోగులకు పెరుగుతున్నారని చెబుతున్నందున పెంచే ప్రయత్నం చేస్తామని సిబ్బంది కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారని తెలిపారు. డిఎంఇని కలిసిన వారిలో యూనియ న్ నాయకులు భాగ్యలక్ష్మి , అహ్మది, స్వరూప, వెంకటేష్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించుకునేందుకు కార్మికులందరూ ఏకం కావాలి

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు గన్నారపు రమేష్



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ఈనెల 21,22 తేదిలలో జరిగే తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు గన్నారపు రమేష్ అన్నారు. వరంగల్ శివనగర్ తమ్మెరభవన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గన్నారపు రమేష్ మాట్లాడుతూ దేశంలో ఉత్పత్తిలో కీలకమైన కార్మికులకు సంపదను పంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి విఫలమయ్యాయన్నారు. ఈ దేశ నిర్మాణ రంగంలో ప్రముఖ పాత్ర కార్మికులదేనని, అయినా పాలక ప్రభుత్వాలు కార్మికుల కోసం ఉన్న చట్టాలను అమ్మలు పరచకుండా నిర్వీరం చేస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు కార్మిక సోదరులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి యూనియన్ సమక్షంలో సంఘటితమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్ 21,22న శంషాబాద్ రంగారెడ్డి జిల్లాలో జరగబోయే 4వ మహాసభలకు వరంగల్ జిల్లా భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలు కార్మికులు హాజరై విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు గుండె భద్రి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మియాపురం గోవర్ధన్, జిల్లా అధ్యక్షులు ఎండి యాకుబ్, జిల్లా కోశాధికారి దండు లక్ష్మ ణ్, జిల్లా ఆఫీస్ బేరర్స్ ఉప్పుల రవి, యోగానంద చారి, నల్ల తీగల కుమార్, గజవెల్లి చిరంజీవి, జన్ను రాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం : దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చా రు. గురువారం మండల సిపిఐ కౌన్సిల్ సమావేశం జూలూరు మహేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని ఆరోపించారు. గ్యాస్ సిలిండర్ ధర 50 పెంచి పేద ప్రజలపై భారం వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ ఫలాలు ప్రజలకు అందకుండా బిజెపి అడ్డుకుంటుందని ఆరోపించారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని ఆయన కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం ప్రజలకు అండగా నిలిచి పోరాడుతుందని దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య, సహాయ కార్యదర్శి వెంగలయ్య, కృష్ణారెడ్డి, మహేష్, కిష్టయ్య, లాలయ్య, హనుమంతు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం 20న యువ కార్మికుల సదస్సు

### ఎఐటియుసి నాయకులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం, కార్మికుల సంక్షేమం కోసం వారి హక్కుల సాధన కోసం, ఉద్యోగ భద్రత కోసం, కొత్త గనులు రావడం కోసం ఈ నెల 20న గోదావరిఖనిలో యువ కార్మికుల సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని, అట్టి సదస్సును విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు పేర్కొన్నారు. గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని సివిల్ డిపార్ట్మెంట్‌లో వారు కార్మికులను కలిసిన అనంతరం మాట్లాడుతూ, సింగరేణిలో బొగ్గు నిలువలు ఐదు సంవత్సరాల వరకు ఉన్నాయని, కొత్త గనులు వస్తేనే సింగరేణికి మనుగడ కొనసాగుతుందని లేకుంటే యువ కార్మికులకు ఉద్యోగ భద్రత కొరవడుతుందని వారు అన్నారు. ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి యూసఫ్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ శంకర్ నారాయణలు పాల్గొని సింగరేణి భవిష్యత్తు, దశదిశ, యువ కార్మికుల భవిష్యత్తు గురించి ప్రసంగించెదరని వారు పేర్కొన్నారు. ఇట్టి సదస్సులో యువ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఎఐటియుసి డిపార్ట్మెంట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, బ్రాంచి ఆఫీస్ బేరర్ ఆకునూరి శంకరయ్య, ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ గౌస్, ఎఐటియుసి డిపార్ట్మెంట్ సలహా దారులు బిట్టి వెంకటేశ్వర్లు, నాయకులు బి.ఆర్.కె.రెడ్డి, జెరిపోతుల దేవయ్య, బొల్లి శ్రీనివాస్, తోట చెంద్రయ్య, సునిల్, రామకృష్ణ, శంకరయ్య, లక్ష్మ య్య, మేకల లింగయ్య, వీరేశం, సతీష్, హరికాంత్, రవిందర్, బిక్షపతి, ప్రేమలత, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## యూనియన్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/శంకరపట్నం :** మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్క్ అండ్ యూనియన్ మహాసభల వాల్ పోస్టర్‌ను కరీంనగర్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య ముఖ్య అతిధిగా హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 21, 22 తేదీలలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో జరిగే మహాసభలకు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బొజ్జ సదానందం, మేకల పరమేష్, గోదారి లక్ష్మ ణ్, రమేష్, శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## 'సన్న బియ్యం' పథకం విపక్షాలకు మింగుడు పడటం లేదు

ప్రజాపక్షం/ఎల్బీనగర్ : సన్న బియ్యం పథకంతో ప్రతిపక్ష పార్టీలకు మింగుడు పడటం లేదని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సన్న బియ్యం పంపిణీలో భాగంగా డివిజన్లోని భూపేష్ గుప్తా నగర్ కాలనీ చెందిన లలిత కుటుంబ సభ్యులతో కలిసి సన్న బియ్యంతో వండిన భోజనాన్ని భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గొడిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రాజు గౌడ్, మమతా మల్లేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.



## అధికారులు సమన్వయంతో పనిచేయాలి




ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై అధికారులు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎంఎల్ఏ అరెకపూడి గాంధీ, జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిలు విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎంఎల్ఏ అరెకపూడి గాంధీ మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని సూచించారు. పెండింగ్లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, అదే విధంగా అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తయ్యేలా చూడాలని అధికారులను తెలిపారు. కొత్త ప్రతిపాదనలు తీసుకురావాలని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని అరెకపూడి గాంధీ తెలిపారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ జికెడి ప్రసాద్, ఇఇ ఇంద్రబాయి, డిఇలు దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శివారు కాలనీలకు నూతన భూగర్భ డ్రైనేజీ



ప్రజాపక్షం/ఎల్బీనగర్ : బిఎన్రెడ్డి నగర్ డివిజన్ శివారు కాలనీలకు త్వరలోనే నూతన భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామని బిఎన్రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, జలమండలి జిఎం శ్రీనివాస్రెడ్డిలు అన్నారు. గురువారం డివిజన్లోని బృందావన్ మెడోస్, శ్రీనివాస కాలనీ, జక్కిడి నగర్ కాలనీలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా డ్రైనేజ్ పైప్లైన్ ఏర్పాటుచేయకపోవడంతో కొన్ని కాలనీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని, డ్రైనేజీ సమస్యను త్వరలోనే పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు. నూతన డ్రైనేజీ పనులు బృందావన్ మెడోస్, శ్రీనివాస కాలనీ మీదుగా జక్కిడి నగర్ కాలనీ నుంచి బ్యాంక్ కాలనీలోని శ్రీవెన్నెల మెడికల్ షాపు వరకు నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పనులు జరుగుతాయన్నారు. సోమవారం నుంచి డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని జలమండలి జనరల్ మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిఎం రాజగోపాల్, మేనేజర్ సిరిపెన్నెల, కాలనీల అధ్యక్షులు శశికాంత్, చిత్రంజన్, యాదిరెడ్డి, నందకిషోర్, అశోక్రెడ్డి, జగన్మోహన్ చారి, శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు ఆస్తి పన్ను చెల్లించి ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిహెచ్ఎంసి చందానగర్ ఉప కమిషనర్ మోహన్రెడ్డి ప్రజలకు సూచించారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో రెవెన్యూ విభాగంతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో డిసి మోహన్రెడ్డి మాట్లాడుతూ ఎవం సిలు, బిల్ కలెక్టర్లు ఏప్రిల్ నెల ముందస్తు లక్ష్యమైన 64.41 కోట్లు ఎర్లీ బర్డ్ పథకం ద్వారా పనులు చేయాలని, సెలవు రోజులలో కూడ ఆస్తి పన్ను వసూళ్ళు చేయాలని ఆదేశించారు. గృహ, వాణిజ్య ప్రాంతాలకు సంబంధించిన ఆస్తి పన్ను ముందుగా చెల్లించాలని దాని ద్వారా తెలంగాణ ప్రభుత్వం 5 శాతం రాయితీ కల్పించిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని శుక్ర, శని, ఆదివారంతో పాటు అన్ని సెలవు రోజులలో సైతం బిల్ కలెక్టర్లు, సర్కిల్ ఆఫీస్ సిటిజన్ సెంటర్లు సైతం అందుబాటులో ఉంటాయని ఈ అవకాశం ఏప్రిల్ 30వ తేది వరకు వర్తిస్తుందని తెలిపారు.

## భూదాన్, అసైన్డ్, వక్ఫ్బోర్డు భూములకు పట్టాలు ఉంటే రద్దు చేస్తాం : కలెక్టర్



ప్రజాపక్షం/షాద్నగర్: మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్పు ప్రభుత్వ భూములను, భూదాన్, అసైన్డ్, వక్ఫ్బోర్డ్, ఎండోమెంట్ భూములకు ప ట్టాలు పొందితే వాటిని రద్దు చేసే అధికారం సంబంధిత మండల రెవిన్యూ అధికారులకు ఉంటుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. గురువారం షాద్నగర్లో నిర్వహించిన భూ భారత్ నూతన చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో స్థానిక గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నక్క బాల్రాజ్ యాదవ్ ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్బోర్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయించి పట్టాదారు పాస్పుస్తకాలు ఇస్తామని కొంతమంది దళారులు చెబుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు కలెక్టర్ నారాయణరెడ్డి స్పందిస్తూ అలాంటి భూ ములను ఎవరు కొనటం కానీ, అమ్మడం కానీ చేయరాదని, చట్టరీత్య నేరమనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. భూ వ్యవహారంతో మోసాలకు పాల్పడుతున్న దళారుల మాటలను ఎవరు నమ్మవద్ద ని కలెక్టర్ సూచించారు. ఈ భూములకు సంబంధించి ఎవైనా సవరణలు ఉంటే మండల స్థాయిలో తహశీల్దార్, ఆర్డిఒ, కలెక్టర్ను సంప్రదించాలని సూచించారు.

## యాచారం మండలంలో ఉపాధి సామాజిక తనిఖీకి సహకరించాలి

ప్రజాపక్షం/యాచారం : యాచారం మండలంలో ఉపాధిహామి పథకం సామాజిక తనిఖిని విజయవంతం చేయడానికి అధికారులందరు సహకరించాలని జిల్లా విజిలేన్సు అధికారి కొండయ్య అన్నారు. గురువారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామి పథకం ఫీల్డ్ అసిస్టేంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొండయ్య ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. వచ్చే వారంలో మండలంలో ఉపాధి సామాజిక తనిఖీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. గ్రామాల వారిగా ఉపాధి హామి పథకం కింద చేసినటువంటి పనులకు సంబంధించిన రికార్డులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ నరేంధర్రెడ్డి, ఎంపిఒ శ్రీలత, ఉపాధి హామి పథకం ఇంజనీర్ శివ శంకర్రెడ్డి, ఉపాధి ఎపిఒ లింగయ్య, వివిధ గ్రామాలకు చేందిన పంచాయతీ కార్యదర్శులు,ఫిల్డ్ అసిస్టేంట్లు తదితరులు పాల్గోన్నారు.



## నల్లాకు అక్రమంగా బిగించిన మోటార్లు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్ఎంసితో పాటు ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరించిన హైదరాబాద్ మహా నగరానికి జలమండలి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి పైపు లైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో వినియోగదారులు తమ నల్లాలకు మోటార్ల బిగించుకోవడం జలమండలి అధికారుల దృష్టికి వచ్చింది. దీని వల్ల మిగిలిన వినియోగదారులకులో ప్రెజర్తో నీటి సరఫరా జరుగుతోంది. ఇలా చేయడం చట్టరీత్యా నేరమని జలమండలి అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జలమండలి విజిలెన్స్ అధికారులు క్రమంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జలమండలి పైపులైనుకు నేరుగా విద్యుత్ మోటార్లు బిగించి నీటిని అక్రమంగా తోడుతున్న మోటార్లు సీజ్ చేశారు. గురువారం ఓ అండ్ ఎం డివిజన్ నంబర్5, నారాయణగూడ పరిధిలోని పర్దాగేట్ ప్రాంతాలో ఓ అపార్ట్మెంట్లలో నల్లాకు మోటార్లు బిగిస్తున్నారని స్థానికులు జలమండలి విజిలెన్సు అధికారులకు వాట్సలో సమాచారం అందించారు. దీంతో స్పందించిన అధికారులు నీటి సరఫరా సమయంలో పర్యటించి పైపులైనుకు అక్రమంగా బిగించిన 6 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అపార్ట్మెంట్లో మొత్తం 6 ఫ్లోర్లు ఉండగా, ఆయా యజమానులు ఫ్లోర్ ఒకటి చొప్పున 6 మోటార్లు బిగించి నీటిని తోడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఎవరైనా వినియోగదారులు ఇలా తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే, వారిపై జలమండలి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు మోటార్లు సీజ్ చేస్తారు. రెండోసారి మోటార్లు బిగిస్తే రూ.5 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తారు. కాబట్టి వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఒకవేళ తక్కువ ప్రెజర్తో నీరు వస్తే, లేదా ఇతర సమస్యలు తలెత్తినా తమకు దగ్గరలోని సంబంధిత మేనేజర్, డిజిఎం, జిఎం అధికారులను సంప్రదించాలన్నారు. జలమండలి కస్టమర్ కేర్ నెంబరు 155313కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు.



## కలుషిత నీటి సరఫరాను అరికట్టిన అధికారులు

అధికారులు, సిబ్బందిని అభినందించిన ఎండి. అశోక్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నం4 రెడ్ హిల్స్ పరిధిలోని పుత్లిబౌలిలో కలుషిత నీటి సరఫరాను అధికారులు అరికట్టారు. పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మెషిన్ సాయంతో లీకేజీని గుర్తించి, మరమ్మతులు చేసి కలుషిత నీరు సరఫరా రాకుండా చేశారు. ఫలితంగా కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కారమైంది. పుత్లిబౌలి చౌరస్తా వద్ద నాలాలోంచి నిర్మించిన 350 ఎంఎం దయా సిఐ ట్రంక్ మెయిన్ పైప్ శిధిలం అయినట్లు గుర్తించారు. దీనివల్ల ఈ ప్రాంతంలో కలుషిత నీరు సరఫరా అవుతోందని ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. అయితే ఎక్కడ లీకేజీ అవుతోందో గుర్తించడం అధికారులకు కష్టమైంది. చివరికి పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మెషిన్ సాయంతో ట్రంక్ మెయిన్లోకి పంపిన కెమెరా సహాయంతో దెబ్బతిన్న ప్రాంతాన్ని గుర్తించారు. ఈ లీకేజీ గుర్తించిన ప్రదేశం ప్రధాన రహదారిపై ఉండడం, చాలా రద్దీగా ఉండే ప్రధాన రోడ్డులో మధ్య భాగంలో ఉండటంతో ట్రాఫిక్కు ఎలాంటి అంతరాయం లేకుండా ట్రాఫిక్, పోలీస్ అధికారులతో సమన్వయంతో గత మూడు రోజులుగా రాత్రింబవళ్ళు నిరంతరంగా పనులు చేపట్టి కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కరించారు. ప్రధాన రహదారిపై ఉన్న పనులు చేపట్టి కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కరించి, సరఫరా పునరుద్ధరించిన అధికారులు, సిబ్బందిని జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి అభినందించారు. సిజిఎం, జిఎంతో సహా మొత్తం బృందం చేసిన పని నిజంగా అభినందనీయమైంది. ఈ పని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, మనం నిబద్ధతతో పనిచేస్తే ఎన్నో సమస్యలు శాశ్వతంగా పరిష్కరించవచ్చు అశోక్ రెడ్డి అన్నారు.



## పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు




ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: పోషకాలు స మృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డిఎం అండ్హెచ్ ఒ) డాక్ట ర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ప్ర పంచ హిమోఫీలియా డేను పురస్కరించుకొని సరూర్ నగర్ పిహెచ్సిలో జిల్లా వైద్య ఆరోగ్యశా ఖ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి డిఎంఅండ్హెచ్ వో వెంకటేశ్వరరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిమోఫీలియా బాధితులు తినాల్సిన ఆహారాలు,నివారించాల్సిన ఆహారాలకు అధిక ప్రాధాన్యత నివ్వాలని చెప్పారు. ముఖ్యంగా ఆకుకూరలు, పండ్లు, తృణధాన్యాలు వంటి విటమిన్ కె, సి సమృద్ధిగా ఉండే ఆహారాలు రక్తం గడ్డకట్టడంలో సహాయపడతాయని తెలిపారు. జన్యు పరివర్తన వల్ల రక్తంగడ్డకట్టకుండా నిరోధించే జన్యు రక్తస్రావం రుగ్మతల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి సరూర్నగర్ పిహెచ్సిలో ర్యాలీ ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్హెచ్ ఓ డాక్టర్ గీత,అర్బన్ హెల్త్ పిఒ డాక్టర్ వినోద్,ఎన్హెచ్ ఎండిపి ఒ అక్రమ్,సరూర్నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అర్చన,డాక్టర్ వెంకట్ రమణ,సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్లో 'గ్లో బై కీర్తిలాల్స్' ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్ : హౌస్ ఆఫ్ కీర్తిలాల్స్ నుండి, సమకాలీన డైమండ్ గోల్డ్ జ్యువెలరీ బ్రాండ్ అయిన 'గ్లో బై కీర్తిలాల్స్', హైదరాబాద్లోని జూబ్లీ హిల్స్లో తన సరికొత్త ప్రత్యేక షోరూమ్ను ప్రారంభించింది. ఈ షోరూమ్ ప్రారంభంతో భారతదేశం అంతటా బ్రాండ్ పెరుగుతున్న ఉనికికి ప్రతీకగా ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ అన్నారు. వ్యూహాత్మకంగా హైదరాబాద్ అత్యంత ఉన్నతమైన పరిసరాలలో ఒకటైన, కొత్త 'గ్లో బై కీర్తిలాల్స్' షోరూమ్ బ్రాండ్ సిగ్నేచర్ ఆభరణాలను, సొగసైన, తేలికపాటి సహజ వజ్రం బంగారు ఆభరణాలను, ఆదునిక పట్టణ ఖాతాదారులకు అందిస్తుందన్నారు. ఈ షోరూమ్, నేటి ఆధునిక మహిళ శైలి సున్నితత్వాలను ప్రతిబింబించేలా రూపొందించబడిందన్నారు. ఈ కొత్త దుకాణం రోజువారీ దుస్తులు ధరించే సామర్థ్యాన్ని కాలాతీత విలాసాలతో సజావుగా మిళితం చేసే సేకరణలను ప్రదర్శిస్తుందన్నారు. గ్లో బై కీర్తిలాలను జూబ్లీ హిల్స్లో విస్తరించడంతో బ్రాండ్ ఫిలాసఫీని సంపూర్ణంగా పూర్తి చేసే డైనమిక్ ట్రెండ్ సెట్టింగ్ ప్రాంతంగా నిలుస్తుందన్నారు. మహిళలు వారి జీవనశైలికి తగిన ఆభరణాలను కనుగొనగల గమ్యాన్ని అందించడంలో తాము ముందున్నామన్నారు. గ్లో బై కీర్తిలాల్స్ అనేది హౌస్ ఆఫ్ కీర్తిలాల్స్ సమకాలీన వజ్రాలు బంగారు ఆభరణాల బ్రాండ్ అన్నారు. ఇది 85 సంవత్సరాలకుపైగా చక్కటి హస్తకళలో వారసత్వానికి ప్రసిద్ధి చెందిందని ఆయన తెలిపారు.



## భూముల భద్రత కోసమే 'భూ భారతి'

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజాపక్షం/షాద్నగర్: ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపించేందుకే భూ భారతి2025చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వివరించారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్నగర్ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో భూ భారతి2025 ఆర్ఓఆర్పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిధిగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతీమాసింగ్, షాద్నగర్ ఆర్డిఒ సరితలు హాజరయ్యారు. అదే విధంగా కేశంపేట మండల కేంద్రంలో భూ భారతి2025చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ దేశంలోని 18రాష్ట్రాల్లో భూ చట్టాలను పరిశీలించి ఆధ్యాయనం చేసిన తరువాతే తెలంగాణ రాష్ట్రంలో భూ భారతి2025 చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. 1935నుండి 1950వరకు మాత్రమే భూములకు సర్వేలు చేసి హద్దులు గుర్తించారని వివరించారు. నిజాం ప్రభుత్వ హయాంలోనే గైరాన్, గౌంటాన్, లావుని, వ్యవసాయేత భూములను అప్పట్లోనే గుర్తించారని తెలిపారు. 1954లో కస్రా పహానీ పట్టం అమల్లోకి తీసుకువచ్చారని, 1971, 2020, 2025 నూతన భూ పట్టాలను తీసుకువచ్చారని వివరించారు. ప్రభుత్వ భూములపై పట్టాలు తీసుకుంటే వాటిని రద్దు చేసే హక్కు మండల రెవిన్యూ అధికారులకు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఒకే రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు మొటేషన్ తక్ష ణమే చేయడం జరుగుతుందని, మండల తహశీల్దార్ స్థాయిలో జరిగే రిజిస్ట్రేషన్లో తప్పులు జరిగితే ఆర్డిఓకు ధరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. విరాసత్ విషయంలో మండల తహశీల్దార్ 30రోజుల్లో విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ధరఖాస్తు చేసుకున్న వ్యక్తికే రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని చట్టంలో పేర్కొన్నారు. ధరణి పోర్టల్లో 2020 భూ చట్టంలో సాధాబైనామాను పెండింగ్ పెట్టారని, ప్రస్తుత భూ భారతి2025చట్టంలో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామ పంచాయతీ స్థాయిలోనే నాలుగు రకాల రెవిన్యూ రికార్డులను నమోదు చేయడం జరుగుతుందని, ప్రతి సర్వే నంబర్కు భూధాన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంతోనే సత్వర భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వివరించారు. వీలునామా ద్వారా భూమిపై హక్కులు సక్రమిస్తే తహశీల్దార్ విచారణ చేసి హక్కుల రికార్డులు మ్యూటేషన్ చేస్తారని, నిర్ణీత సమయంలో తహశీల్దార్ చేయకుంటే డీమ్డ్ మ్యూటేషన్గా పరిగణించబడుతుందని వివరించారు. సివిల్, లేదా రెవిన్యూ కోర్టు తీర్పు లోక్ ఆదాలత్ అవార్డు అసైన్మెంట్ పట్టా38సర్టిఫికెట్, 13బి సర్టిఫికెట్ ఓఆర్సిసేల్ సర్టిఫికెట్ మొదలగు వాటి ద్వారానే హక్కులు సంక్రమిస్తే ఆర్డిఓకు దరఖాస్తు చేసుకుంటే హక్కుల రికార్డులో మార్పులు చేసి పట్టాదారు పాస్పుస్తకం జారీ చేస్తారని వివరించారు. ఏన్నో ఏళ్ళుగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలను తక్ష ణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మెర్ బాబర్ఖాన్, తహశీల్దార్ పార్థసారధి, కమీషనర్ సునీత, డిప్యూటి తహశీల్దాన్ ఆనంద్, వ్యవసాయ శాఖ ఏడిఎ రాజారత్నం, ఏఒ నిశాంత్కుమార్, ఎంఇఒ మనోహార్తోపాటు వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్తో రైతు దుర్మరణం

చిన్న ఎల్కిచర్ల సబ్స్టేషన్ ముందు శవంతో గ్రామస్థుల ధర్నా





ప్రజాపక్షం/కొందుర్గు: విద్యుత్ షాక్తో ఓ రైతు దుర్మరణమైన సంఘటన గురువారం మండల పరిధిలోని చిన్న ఎల్కిచర్ల గ్రామ పంచాయితీ పరిధిలోని పుల్లప్పగూడలో జరిగింది. గ్రామస్థుల కథ నం మేరకు... మొదళ్లగూడ గ్రామానికి చెందిన చింతల రవీందర్ రెడ్డి గత 20 సంవత్సరాల క్రితం కొందుర్గు మండల పరిధిలోని చిన్న ఎల్కిచర్ల శివారులోని ఓ పోలం వద్ద షేడ్ వేసుకోని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రవీందర్ రెడ్డికి అశోక్రెడ్డి(30), శ్రీనివాస్రెడ్డి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అశోక్రెడ్డి గురువారం తాము కౌలుకు తీసుకోని చేస్తున్న పుల్లప్పగూడ పోలం వద్దకు వెళ్లాడు. గత మంగళవారం వర్షం కురువడంతో గాలివానకు పొలం వద్ద ఉన్న ఓ విద్యుత్ స్థంబం విరిగిపోయింది. స్థంబం వద్ద కు గురువారం 3 గంటల సమయంలో అశోక్రెడ్డి వెళ్లగా, విద్యుత్ షాక్ రావడంతో అక్కడికక్కడే అశోక్రెడ్డి దుర్మరణం పాలయ్యాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో పొలం వద్దకు చేరుకొని శవాన్ని స్థానిక సబ్స్టేషన్ వద్దకు తీసుకువచ్చి ధర్నాకు దిగారు. విద్యుత్ అధికారుల నిరక్ష్యంతోనే ఓ నిండు ప్రాణం బలైందని, మూడు రోజులుగా విద్యుత్ తీగలను సరిచేయక పోవడం తో అశోక్రెడ్డి మృతి చెందాడని, మృతి చెందిన రైతు అశోక్రెడ్డి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, బాధ్యులైన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకొవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. మృ తుడికి భార్య అక్ష య, ఇద్దరు చిన్న కుమారులు రాఘవేందర్ రెడ్డి(7), త్రిలోక్రెడ్డి (5) ఉన్నారు. విషయాన్ని తెలుసుకున్న షాద్నగర్ ఎసిపి రంగస్వామి, రూరల్ సిఐ నర్సయ్య సంఘటన స్థలానికి చేరుకొని, మృతుడి కుటుంబ సభ్యులతో, గ్రామస్థులతో మాట్లాడారు. మృతి చెందిన అశోక్రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ద్వారా రూ.5లక్షలు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని ట్రాన్స్కో ఎఇ రవికుమార్ తెలిపారు.



## కాంగ్రెస్ అగ్రనేతలపై బిజెపి కక్షసాధింపు చర్యల

షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




ప్రజాపక్షం/షాద్నగర్: కాంగ్రెస్ అగ్రనేతలపై కక్షసాధింపు చర్యలకు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పాల్పడటం సమంజసం కాదని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం హైదరాబాద్లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఇడి కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాకు ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన నేషనల్ హెరాల్డ్కు రూ.90కోట్ల రుణం ఇస్తే మనిలాండరింగ్ ఎలా జరిగినట్లు అవుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సోనియాగాంధీ, రాహుల్గాంధీలపై అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## కేంద్రం బురదజల్లే ప్రయత్నాలను తిప్పికొడతాం : డా.కోట నీలిమ

ప్రజాపక్షం / ఖైరతాబాద్ : ఎఐసిసి అధినేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై కేంద్రం బురదజల్లే ప్రయత్నాలను తిప్పికొడతామని కాంగ్రెస్ సనత్నగర్ నియోజకవర్గ ఇన్చార్జి డా.కోట నీలిమ అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్గాంధీలను చార్జిషీట్లో చేర్చడాన్ని తీవ్రంగా నిరసిస్తూ ఎఐసిసి పిలుపు మేరకు గురువారం ఇడి కార్యాలయం ముందు టిపిసిసి నిర్వహించిన ధర్నాలో నీలిమ మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ నేతలను లక్ష్యం చేసుకొనేముందు దేశవ్యాప్తంగా లక్షలాది మంది తమ పార్టీ కార్యకర్తలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. నిజం ఎప్పటికీ విజయమే సాధిస్తుందన్నారు. సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు మహేశ్కుమార్ గౌడ్, ఎఐసిసి ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## తాగునీటి సమస్య పరిష్కారానికి 19న ధర్నా



ప్రజాపక్షం/గండిపేట: తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చే స్తూ శనివారం మధ్యాహ్నం బుద్వేల్ వాటర్ సప్లై కార్యాలయం ముందు నిర్వహించతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని బిజెపి రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్, జిహెచ్ఎంసి మైలార్ దేవులపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఆపార్టీ నియోజకవర్గ క న్వీనర్ పొన్నామోని మల్లేష్ యాదవ్తో కలిసి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లో తీవ్ర మంచినీటి ఎద్దడితో పాటు రోడ్లపైనే ప్రవహిస్తున్న డ్రైనేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇట్టి విషయంపై అనేకమార్లు జిహెచ్ఎంసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ సమస్యను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తోకల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. దీంతో డివిజన్ వ్యాప్తంగా ప్రజలను సమీకరించి ఉన్నతాధికారులు దిగివచ్చే విధంగా స్థానిక వాటర్ బోర్డు కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్,చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి,జిల్లా కార్యదర్శి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## టిడిపి సభ్యత్వం ద్వారా రూ.5 లక్షల ప్రమాద బీమా



**ప్రజాపక్షం/నాగారం:** టిడిపి సభ్యత్వం ద్వారా 5 లక్షల ప్రమాద భీమా లభిస్తుందని మేడ్చల్ మల్కాజ్‌గిరి పార్లమెంటు అధ్యక్షులు కె.అశోక్‌కుమార్ అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను కార్యకర్తలు, నాయకులకు అందజేశారు. ఈ కార్డులను మున్సిపల్ అధ్యక్షులు కొండా జంగారెడ్డి ఆధ్వర్యంలో అశోక్‌గౌడ్ వేముల సంజీవగౌడ్, కూతాడి నరసింహ, వెంకటేష్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెంట్ కౌన్సిలర్ కొండ సుజాత, ఎన్ కృష్ణారావు, జగన్మోహన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఉమాశంకర్‌గౌడ్, కోటేశ్వరరావు, రామయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ఆధార్ తరహాలో 'భూధార్'

### భూ భారతితో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారంః కలెక్టర్ గౌతం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** త్వరలో ఆధార్ కార్డు తరహాలో భూధార్ కార్డులు రానున్నాయని జిల్లా కలెక్టర్ గౌతంపేర్కొన్నారు. ఈ కార్డుల్లో భూమికి సంబంధించి సర్వేచేసి కొలతలు, హద్దులు వంటి సమగ్రమైన వివరాలతో భూధార్ తీసుకురానుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, జిల్లా రెవెన్యూ అ ధికారులకు నిర్వహించిన అవగాహనా సదస్సులో అనపను కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కల్సి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టంలోని అన్ని అంశాలను సమగ్రంగా చదివి అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

1989 ఆర్ఓఆర్ చట్టంలోని అన్ని అంశాలు భూభారతిలోని అంశాలు కొంతవరకు ఒకే మాదిరిగా ఉన్నాయని, అంతే కాకుండా రెవెన్యూ అధికారులకు ధరణిలో లేని అధికారాలు భూభారతిలో ఉన్నాయన్నారు. ఈ అధికారాలతో రెవెన్యూ అధికారులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

భూభారతికి సంబంధించి అన్ని అంశాలను ఆన్‌లైన్ డిజిటల్ రికార్డులను నిర్వహించాలని సూచించారు. రెవెన్యూ అధికారులకు పూర్తి స్థాయి అధికారాలు వచ్చే వరకు ప్రొసీడింగ్స్ మాన్యువల్‌గా నిర్వహించాలని, నూతన మార్గదర్శకాలతో సమ్మతించటం, తిరస్కరించటం చేయాలని కలెక్టర్ సూచించారు.

ప్రభుత్వం కొత్త అంశాలను పొందుపరుస్తూ నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకొని వచ్చిందని, ధరణి స్థానంలో నూతనంగావచ్చిన భూభారతి వ్యవస్థను ఇకపై అమలు చేయనున్నట్లు కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. భూభారతి–2025 చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు ఉన్నాయన్నారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడిందని, భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వేచేసి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల పరిష్కారం ఈ చట్టం ద్వారా త్వరితగతంగా పూర్తి అవుతుందని, వారసత్వ భూముల మ్యుటేషన్‌ను గడువులోగా పూర్తి చేయటం, హక్కుల సంక్రమణను అధికారికంగా నమోదు చేయటం ద్వారా వ్యవస్థ మరింత నిబద్ధతతో పని చేస్తుందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెండంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందన్నారు. ఇంటిస్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థలను సమగ్రంగా అభివృద్ధి చేయటం, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సాయం అందించే దిశగా చర్యలు తీసుకొంటున్నామని కలెక్టర్ చెప్పారు.

గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను శాస్త్రీయంగా చేస్తూ నే మోసపూరితంగా పొందిన ప్రభుత్వ భూములపై పట్టాలను రద్దుచేసే అధికారం భూభారతి చట్టం ద్వారా కల్పించబడిందని, దీంతో పాటు రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారంగా ఉపయోగపడుతుందన్నారు. అంతే కాకుం డా భూ సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కల్పించే భూభారతి చట్టంపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు.

ఈ నెల 19 నుండి జిల్లాలో అవగాహన సదస్సులు ఉంటాయని, వీటి ద్వారా భూభారతి చట్టంపై ప్రజలకు, రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, లా అధికారి చంద్రావతి, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యాం ప్రకాష్, డిప్యూటి కలెక్టర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.




## 19న జగద్గిరిగుట్టలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పర్యటన

### ఎఐటియుసి, సిపిఐ నాయకుల పిలుపు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** సిపిఐ నల్గొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పర్యటనను విజయవంతం చేయాలని ఎఐటియుసి, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 19న మధ్యాహ్నం షాపూర్‌నగర్ పోట్లూరి నాగేశ్వర్ రావు భవన్‌లో నిర్వహిస్తున్న సమావేశానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం జగద్గిరిగుట్టలో పర్యటించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని రంగాల కార్మికులు పాల్గొని ఘనంగా సన్మానించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, నియోజకవర్గం అధ్యక్షులు హరినాథ్ రావు, నాయకులు జంబూ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌బి కాలనీలో కుళ్లిన మృతదేహం గుర్తింపు

**ప్రజాపక్షం/నాగారం:** ఓ ఇంట్లో కుళ్లిన దశలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కుషాయి గూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హెచ్‌బి కాలనీ నవోదయ నగర్ కమ్యూనిటీ హాలు సమీపంలో ఓ ఇంటిలో దుర్వాసన వస్తుండంతో పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించగా బొంకూరి యాకుబ్(55) అనే వ్యక్తి తన మంచం పక్కన మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించిందని,మృతి చెంది రెండు మూడు రోజులై ఉంటుందని దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



## రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### డివిజినల్ సెక్రెటరీ రవీందర్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** రైల్వే కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజినల్ సెక్రెటరీ పి. రవీందర్ అన్నారు. ఈ సందర్భంగా చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. వారు రైల్వే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజినల్ సెక్రెటరీకి ఘట్‌కేసర్ సందర్శించారు. రైల్వే కార్మికులు వారి సమస్యలు నైట్ డ్యూటి పెట్రోల్‌మెన్స్‌ను ఇద్దరిని ఇవ్వాలని, అందరికి రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, చర్లపల్లి టర్మినల్‌లో అన్ని విభాగాలలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డివిజినల్ సెక్రెటరీకి తెలిపారు. రైల్వే కార్మికుల సమస్యలపై స్పందించి డివిజనల్ రైల్వే మేనేజర్‌తో చర్చించి మీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా అని సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్ సెక్రెటరీ పి.రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన ఉండే ఒకే ఒక యూనియన్ సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ మాత్రమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ బ్రాంచ్ చైర్మన్ టి విజయ కుమార్, సికింద్రాబాద్ డివిజన్ కోశాధికారి నర్సింహ్మా రెడ్డి, సెక్రెటరీ వినయ్, అసిస్టెంట్ సెక్రెటరీ దిలిప్ కుమార్, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, ప్రవీణ్ కుమార్, అశోక్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ వైద్య సేవల్లో కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు భాగస్వాములు

### డిఎంహెచ్ఒ డాక్టర్ ఉమాగౌరి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** పేద ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు తమ వంతుగా సహకారం అందించేందుకు కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ ఉమాగౌరి కోరారు. చెన్నైలోని కెరీర్ ట్రీ హెచ్ ఆర్ సొల్యూషన్ ప్రయివేట్ లిమిటెడ్, హైదరాబాద్‌లోని యునైటెడ్ ఫార్మకోపియా సంస్థల సామాజిక బాధ్యతగా మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలకుగాను వినియోగించే బేబీ వార్మర్లు, బయో కెమిస్ట్రీ ఎనలైజర్లు, సెల్ కౌంటర్ మిషన్లు, డెలివరీ బ్లేడ్లు వంటి పలు వైద్య పరికరాలను జిల్లా కలెక్టరేట్‌లో డిఎంహెచ్‌ఒకు ఆయా సంస్థల ప్రతినిధులు అందచేసారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా డిఎంహెచ్ఒ డా.సత్యవతి, కార్యాలయ సూపరిటెండెంట్ మహ్మద్ సలీం, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి మజుల, రాజేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అఘోరీపై శామీర్‌పేట ఠాణాలో ఫిర్యాదు

**ప్రజాపక్షం/శామీర్‌పేటః** శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో లేడి అఘోరిపై జోగిని సంధ్య గురువారం ఫిర్యాదు చేశారు. శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌కు ఫిర్యాదు పత్రాన్ని జోగిని సంధ్య అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అఘోరిగా వేషాధారణ చేసుకుని ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. సనాతన ధర్మం పేరిట లక్షల్లో డబ్బులు వసూలు చేస్తుందని , మహిళలను, యువతులను పూజల పేరిట వశపర్చుకుని పైశాచిక ఆనందం పొందుతుందన్నారు. ఇలాంటి వారిని సమాజం నుంచి తరిమికొట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి లేడి అఘోరిపై చర్యలు తీసుకోవాలన్నారు. పిర్యాదును స్వీకరించిన ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు.

## మరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో 2వ రోజు బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/అల్వాల్ :** వెంకటాపురం డివిజన్ కానాజీ గూడ లో వెలసిన మరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామి వారికి సుప్రభాత సేవ విశేషాలు అభిషేకం మూలమాత్ర జపము మండప స్థాపిత దేవత పూజలు నిర్వహించిన ఆలయ వ్యవస్థాపక కార్యనిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్ర వెల్లడించారు. ఆలయంలో స్వయంగా భక్తులచే లక్ష్మీ గణపతి హోమం లక్ష్మీ కుబేర హోమం లక్ష్మీనరసింహ హోమం సుదర్శన హోమం చండీ హోమం మృతంజయ రుద్ర హోమం వంటి హోమాలను చేయించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హోమాలలో పాల్గొన్నారు.



## తాండూర్‌లో వడగండ్ల వానతో అపార నష్టం

**ప్రజాపక్షం/తాండూర్:** వికారాబాద్ జిల్లా లోనపి తాండూర్‌లో వర్షం బీభత్సం సృష్టించింది. అకాల వర్షనికి పట్టణంలో ప్రజలు ఇబ్బందుల పాలయ్యారు. భద్రేశ్వర స్వామి జాతర ఉత్సవాలను పరిష్కరించుకొని ఏర్పాటుచేసిన స్వాగత తోరణాలు కుప్పకూలినాయి. వర్షధాటికి ప్రజలు ఇబ్బందుల పాలయ్యరు. వడగండ్ల వాన, ఈదురు గాలులతో ప్రజలు ఇబ్బందులకుగురయ్యారు. వడగండ్ల వానతో చేతికి వచ్చిన పంట నేలకొరిగొంది.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించడం మన బాధ్యత

### మేడ్చల్ ట్రాఫిక్ ఎసిపి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేటః** రోడ్డు భద్రత నియమాలను పాటించడం మనందరి బాధ్యత అని మేడ్చల్ ట్రాఫిక్ ఎసిపి వెంకట్‌రెడ్డి, వివిఎస్‌బి విద్యా సంస్థల ఎంబిఎ డైరక్టర్ మదన్‌మోహన్‌లు అన్నారు. గురువారం తెలంగాణ ట్రాఫిక్ పోలీస్, విశ్వవిశ్వాని స్కూల్ ఆఫ్ బిజినెస్ సంయుక్తంగా రోడ్డు భద్రతా వారోత్సవాలను తూంకుంట లోని క్యాంపస్‌లో ప్రారంభించారు. తెలంగాణలో ట్రాఫిక్ నియమాలు పాటించడానికి ప్రజలను ప్రోత్సహిస్తు, బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌ను అభివృద్ధి చేయడంలో భాగంగా తెలంగాణ ట్రాఫిక్ పోలీస్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, విశ్వవిశ్వాణి స్కూల్ ఆఫ్ బిజినెస్(వివిఎస్‌బి) తూంకుంట సంయుక్తం గా రహదారి భద్రత అవగాహన ప్రచారాన్ని ఉమ్మడి శామీర్‌పేటలో పది గ్రామాల్లో ప్రారంభించారు. మేడ్చల్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ హనుమాన్‌గౌడ్, డాక్టర్ బిఎస్ఎన్ దేవి(ఐఎంబిఎ) హెచ్‌ఒడి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివారెడ్డి, ప్రొఫెసర్ మీర్ ఇర్ఫాన్ ఉల్‌హాక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నేహాలిక భవ్య ముఖ్య అతిథులుగా విచ్చేసి రోడ్డు సేఫ్టీ వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. విశ్వవిశ్వాణి కళాశాల విద్యార్థులచే రోడ్డు ర్యాలీలు, బుర్రకథలు, స్కిట్స్, మాబ్స్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రొఫెసర్ మీర్ ఇర్ఫాన్ ఉల్‌హాక్ మాట్లాడుతూ రోడ్డు సెఫ్టి అనేది సమాజంలో ప్రతి ఒక్కరి భాద్యత అని అన్నారు. అనవసరమైన మరణాలనుతగ్గించేందుకు రోడ్డు భద్రత నియమాలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## విధిగా అగ్ని మాపక పరికరాలు ఏర్పాటు

### అగ్నిమాపకదళాధికారి గణేష్ యాదవ్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అపార్ట్‌మెంట్లు,పరిశ్రమలు, ఆస్పత్రుల్లో విధిగా అగ్ని మాపక పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని నాచారంలోని మల్కాజిగిరి అగ్నిమాపకదళాధికారి గణేష్ యాదవ్ సూచించారు. ఈ నెల 14 నుండి 20 వరకు నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం హబ్సిగూడలోని ఆనంద్ నేత్ర వైద్యశాల, చిలుకనగర్‌లోని శ్రీనివాస హైట్స్ అపార్ట్‌మెంట్‌లో అవగాహనా సదస్సులు నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవించగానే అగ్నిమాపక దళాధికారులకు సమాచారం ఇచ్చి తమ వద్ద ఉన్న అగ్ని మాపక పరికారాల ద్వారా మంటలను ఆర్పేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకొంటూ ప్రయత్నించాలన్నారు.
ప్రమాదం జరగిందని తెలియగానే భవనాన్ని వెంటనే ఖాళీ చేయాలని, సమీపంలోని ఫైర్ అలారం మోగించి అక్కడ ఉన్న వారందరి ని అప్రమత్తం చేయాలన్నారు. బయటకు వెళ్లలేక పోవటం, పొగతో మూసుకొని పోవటం, జరిగితే సురక్షితమైన గదిలోకి వెళ్లి పొగలు లోపలికి ప్రవేశించకుండా బట్టలను అడ్డుపెట్టుకోవాలన్నారు. అగ్నిమాపక దళ సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పదవీ విరమణ చేసిన లీడింగ్ ఫైర్‌మాన్ లింగారెడ్డి, సందీప్‌లను సన్మానించి వారి అనుభవాలను పంచుకొన్నారు.

## ప్రతిపక్షాల గొంతు అణిచివేసే లక్ష్యంగా సోనియా, రాహుల్ గాంధీలు

### టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం




**ప్రజాపక్షం/కూకట్‌పల్లిః** ప్రతిపక్షాల గొంతును అణిచివేసేందుకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను లక్ష్యంగా చేసుకున్నారని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం అన్నారు. నేషనల్ హోరాల్డ్ పత్రిక కేసులో కాంగ్రెస్ పార్టీ అఖిల భారత నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఇడిచార్జిషీట్‌లో చేర్చడానికి నిరసనగా టిపిసిసి ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఇడి కార్యాలయం ముందు చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వ్యవస్థలను శాసిస్తుందన్నారు. స్వయం ప్రతిపత్తి గల సంస్థలను తమ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటూ ఆ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. నేషనల్ హోరాల్డ్ పత్రిక కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చేర్చడం వారి రాజకీయ స్వార్థమేనని స్పష్టమవుతుందన్నారు. ఇడి, సిబిఐ లాంటి సంస్థల ద్వారా కేసుల నమోదుతో ప్రతిపక్ష పార్టీ నేతలను బెదిరిస్తూ గొంతు నొక్కాలని చూస్తుందన్నారు. పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా నిరాధారమైన కేసులు మోపుతూ వారిని వేధిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ సైనికులుగా మోడీ ప్రభుత్వ చర్యలపై పోరాటం చేయాలన్నారు.

## విద్యార్థి దశ నుంచే పాఠ్యాంశంగా ఈత బోధన

### సామాజిక కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** పిల్లల నిండు ప్రాణాలను అరికట్టాలంటే విద్యార్థి దశ నుంచే ఈతను ఒక పాఠ్యాంశంగా చేర్చి భోధన చేయాలని సామాజిక కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం వచ్చిందంటే చాలు చెరువులు, కుంటలు, నదులలో దిగి పిల్లలు, యువకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈతపై అవగాహన లేని చిన్నారులు భయంతో నీరు తాగి మునిగిపోయి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పైన ఉన్న వారు కర్ర, తాడు, చున్నీ , దోతి లాంటి సాధనాలను అందిస్తే వారిని కాపాడవచ్చన్నారు. పెద్దల సహాయంతో ఈత నేర్చుకున్నచో పరీక్షలలో అధనంగా 2 మార్కు లు ఇస్తామని, ప్రభుత్వ ఉద్యోగాల కొరకు ప్రయత్నించే వారికి ఈత రావాలి అని ప్రభుత్వం ప్రోత్సహిస్తే భావి పౌరుల ప్రాణాలను రక్షించగలరన్నారు. గత 20 సంవత్సరాలుగా పోరాడుతున్న సామాజిక అవగాహనతో పోరాడుతూ గత ముఖ్య మంత్రులు వైఎస్ఆర్, కెసిఆర్, అధికారులకు, 30 జిల్లా కలెక్టర్లకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు వినతి పత్రాలు, అభ్యర్థనలు అందజేశాము కానీ ఫలితం శూన్యమన్నారు. ఈ రోజు ఖమ్మంలో సరదగా ఈతకు వెళ్ళి ఇద్దరు విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయన్నారు. ఈత ఒక సాధన అని తెలియక రెండు తెలుగు రాష్ట్రాలలో 1000 నుంచి 1200 మంది ఇక దేశంలో 30 వేల నుంచి 50 వేల మంది విద్యార్థుల, యువకుల ప్రాణాలు కేవలం ఈతరాక చనిపోతున్నారన్నారు. కన్న తల్లిదండ్రుల కడుపు కోత మిగిలిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

## కొడంగల్‌లో పట్టపగలే ఇసుక అక్రమ రవాణా

**ప్రజాపక్షం/కొడంగల్:** కొడంగల్ నియోజకవర్గంలో పట్టపగలే అక్రమ ఇసుక రవాణా మూడుపువ్వులు ఆరు కాయ లుగా సాగుతున్న అధికారులు నిమ్మకు నెరెత్తినట్లు వ్యవహరించడంతో తీవ్ర విమర్శలకు తావిస్తుంది. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం పలువురికి అధికారికంగా లైసెన్స్‌లు ఇవ్వడం. ఇందిరమ్మ ఇండ్ల పేరిట మరికొంతమంది దాళారులు నామమాత్రపు లైసెన్స్‌లు తీసుకుని అధికారులకు బురిడి కోట్టిస్తూనే విచ్చలవిడిగా మాముళ్లు అందజేస్తు అందినకాడికి దోచుకుంటున్నారని పలువురు రాజకీయ వేత్తలు బహిరంగంగా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కొడంగల్‌లో ఏకంగా పోలీస్‌స్టేషన్ ముందు నుంచే యాలాల్ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకున్న దర్జాగా ఇలా పోతావుంటే పోలీసులు ఎందుకు మౌనం పాటిస్తూన్నారే అర్థం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీని పై పోలీసులను వివరణ కోరగా కొడంగల్‌కు వచ్చే ప్రతి ట్రాక్టర్‌కు లైసెన్స్‌లు ఉన్నాయని, అనుమతులతోనే నడుపుతున్నారని సమాదానాలు ఇస్తూ దాటవేస్తున్నారు.
తాండూర్ కాగ్నా నది, బోంరాస్‌పేట మండలంలోని దుప్‌చర్ల తదితర వాగుల నుంచి వందల సంఖ్య లో ట్రాక్టర్‌లు, టిప్పర్‌లతో ఇసుకను అక్రమంగా తరలిస్తూన్నారు. దీని కారణంగా పర్యవరణానికి తూట్లు పడటమే కాకుండా భూగర్భజలాలు అడుగంటి పోవటంతో అధికారులే ముఖ్యసూత్రులుగా బావించవచ్చాని పలువురు విద్య వక్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## నకిలీ వైద్యుడు అరెస్టు... చదివింది బికాం !



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** చదివింది బికాం, ఓ వైద్యుడి వద్ద అసిస్టెంట్ గా పని చేస్తూ పొందిన కాస్తంత అనుభవంతో డాక్టర్‌గా చలామణి అవుతూ వైద్యసేవలు అందిస్తున్నాడు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకొన్న నాచారం పోలీ సులు డెకాయి ఆపరేషన్ నిర్వహించి నిందితుడిని క్లినిక్‌లో అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ప్రభాకరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్‌లోని బ్రహ్మపూరి కాలనీలో నివసించే బొడి బికాష్ గోల్దార్ (21) గత కొద్దికాలం నుండి ఓల్డ్ మల్లాపూర్‌లో నాగమాత క్లినిక్ నెలకొల్పి డాక్టర్ అన్న బోర్డు పెట్టుకొన్నాడు. క్లినిక్‌కు వచ్చే రోగులకు వైద్యం చేస్తూ మందులు ఇవ్వటం, ఇంజక్షన్లు ఇవ్వటం ద్వారా ఫీజులు తీసుకొంటున్నాడు. ఎలాంటి వైద్యవిద్య లేకుండా రోగులను వంచిస్తున్న అతడిపై కేసు నమోదు చేసారు.

## గుండల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన విద్యాశాఖ అధికారి



**ప్రజాపక్షం/దోమ :** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని గుండల్ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సందరిశంచి కంప్యూటర్ శిక్షణ తరగతులను పశీలించారు. ఎ1ద్వారా భోదన విద్యార్థులు చురుకుగా, ఇష్టంతో నేర్చుకుంటారని ఉపాధ్యాయులు కూడా ఈ విషయంలో విద్యార్థులకు 100శాతం హాజరు నమోదు అయ్యోటట్లు చూడాలని తెలిపారు. దాదాపూర్ గ్రామంలో విద్యార్థులు దుస్తులు కుట్టే టైలర్స్‌ను సందర్శించి పలు సూచానలు చేశారు. ఎస్ఎ2 పలితలను అన్‌లైన్లో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోమ మండల విధ్యాధికాని వెంకట్ తదితరులు పాల్గోన్నారు.

## శ్రీవిష్ణు శివాలయంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలోని అతి పురాతణమైన అక్కన్న మాదన్నలు నిర్మించిన శ్రీ విష్ణు శివాలయంలో పలు అభివృద్ధి పనులకు గురువారం టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజి ఎంఎల్ఎ మలిపెద్ది సుదీర్‌రెడ్డిలు భూమిపూజ చేశారు. ఆలయంలో రెండు రాజగోపురాలు, పుష్కరణి, నీరాలి మంటపం, పుష్కరఘాట్ లాంటి పనులకు ప్రభుత్వం రూ. 50లక్షలు కేటాయించడంతో అభివృద్ధి పనులను ప్రారంబించుటకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉద్దెమర్రి నర్సింహారెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మాజి సర్పంచ్‌లు దోసకాయల వెంకటేష్, పట్టా బాల్ నర్సింహా, మాజి వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విష్ణుగౌడ్, వెంకటేష్, రాజిరెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడ

# సన్‌రైజర్స్ పై ముంబయి విజయం





ఐపిఎల్ 2025లో భాగంగా తాజాగా జరిగిన మ్యాచులో సన్‌రైజర్స్ హైదరాబాద్ పై ముంబయి ఇండియన్స్ విజయం సాధించింది. ఆల్ రౌండ్ ప్రదర్శనతో.. 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ సీజన్ లో ఆడిన ఏడు మ్యాచుల్లో ముంబయి జట్టుకు ఇది మూడో విజయం. 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబయి ఇండియన్స్.. 18.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ముంబయి బ్యాటర్లందరూ మంచి ప్రదర్శనే చేశారు. రియాన్ రికల్టన్ (23 బంతుల్లో 5 ఫోర్ల సాయంతో 31 పరుగులు), రోహిత్ శర్మ (16 బంతుల్లో 3 సిక్సుల సాయంతో 26 రన్స్), విల్ జాక్స్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 36 పరుగులు), సూర్యకుమార్ యాదవ్ (15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 26 రన్స్) రాణించారు. చివర్లో వచ్చిన హార్దిక్ పాండ్య 9 బంతుల్లో ఏకంగా 233.33 స్ట్రైక్ రేటుతో 3 ఫోర్లు, 1 సిక్స్ సాయంతో 21 పరుగులు దూకుడుగా ఆడాడు. విజయానికి 14 బంతుల్లో 2 పరుగులు అవసరమైన నేపథ్యంలో మ్యాచును సిక్స్ బాది ముగిద్దామనుకున్నాడు. కానీ ఇషాన్ కిషన్ కు క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. ఆ తర్వాత వెంటనే నమన్ ధీర్ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. తిలక్ 21 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. ప్యాట్ కమిన్స్ 3 వికెట్లు తీయగా.. ఎషాన్ మలింగ 2, హర్షల్ పటేల్ తలో వికెట్ దక్కించుకున్నారు.

అంతకుముందు బ్యాటింగ్ కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ తడబడింది. అభిషేక్ శర్మ (28 బంతుల్లో 7 ఫోర్ల సాయంతో 40), ట్రావిస్ హెడ్ (29 బంతుల్లో 3 ఫోర్ల సాయంతో 28 పరుగులు) చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేదు. ఇషాన్ కిషన్ (3 బంతుల్లో 2 పరుగులు) మళ్లీ నిరాశపరిచాడు. తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి (21 బంతుల్లో 1 ఫోర్ సాయంతో 19 పరుగులు) బ్యాటింగ్ లో ఫెయిల్ అయ్యాడు. కానీ ఫీల్డింగ్ లో బానే రాణించాడు. ఆఖర్లో హెన్రిచ్ క్లాసెన్ (28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 37 రన్స్) కాసేపు దూకుడుగా ఆడి స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లాడు. కానీ దూకుడు ఉన్న అతడిని.. బుమ్రా ఔట్ చేశాడు. ఆ తర్వాత వచ్చిన అనికేత్ వర్మ (8 బంతుల్లో 18), కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (8) కాసేపు దూకుడుగా ఆడి నాటౌట్ గా నిలిచారు. వీరిద్దరు ఆఖరి ఓవర్లలో మూడు సిక్సులు బాదారు. ముంబయి బౌలర్లలో విల్ జాక్స్ 2, ట్రెండ బౌల్ట్, బుమ్రా, హార్దిక్ పాండ్య తలో వికెట్ తీశారు.

## రాజస్థాన్ జట్టులో డిష్యూం.. డిష్యూం..!





ఐపీఎల్ 2025 రాజస్థాన్ రాయల్స్ జట్టులో అంతర్గత పోరు మొదలైందని తెలుస్తోంది! ఆ జట్టులోని యువ ఆటగాళ్ల మధ్య పోరు మొదలైనట్లు సమాచారం. ముఖ్యంగా రియాన్ పరాగ్ యశస్వి జైశ్వాల్ పోటీ పడుతున్నట్లు అనుమానం తలెత్తుతోంది. ఇంతకీ అసలు గొడవ ఏంటంటే?

**ఒకరు వెళ్లగానే మరొకడు..**

సూపర్ ఓవర్‌కు దారీ తీసిన గత మ్యాచులో ఢిల్లీ క్యాపిటల్స్‌పై రాజస్థాన్ రాయల్స్ ఓడింది. ఈ మ్యాచు సూపర్ ఓవర్ లో సంజూ శాంసన్ గాయం కారణంగా ఫీల్డింగ్ కు దిగలేదు. దీంతో వైస్ కెప్టెన్ రియాన్ పరాగ్ రంగంలోకి దిగాడు. ఆ సమయంలో అతడు బౌలర్లతో ఏదో సంభాషణ జరిపాడు. రియాన్ పరాగ్ వెళ్లగానే.. ఆ వెంటనే జైశ్వాల్ కూడా వెళ్లి బౌలర్లతో ఏదో సంభాషణలు జరిపాడు. ఇదే కంటిన్యూగా సాగింది. ఈ కారణంగానే కొత్త అనుమానాలు తలెత్తాయి.

**బహిరంగంగానే చెప్పాడు...**

రియాన్ పరాగ్ ఇప్పటికే తొలి మూడు మ్యాచుల్లో కెప్టెన్ గా వ్యవహరించాడు. పైగా అతడు వైస్ కెప్టెన్ కూడా. మరి ఇలాంటి స్థితిలో జైశ్వాల్ అనవసరంగా కెప్టెన్సీ విషయంలో దూరుతున్నట్టుగా క్రికెట్ అభిమానులు అనుకుంటున్నారు. ఎందుకంటే అతడు రీసెంట్‌గానే దేశవాళీ క్రికెట్‌లోనూ ముంబయి జట్టు నుంచి వైదొలిగిన సంగతి తెలిసిందే. గోవా జట్టు కెప్టెన్సీ ఆఫర్ ఇవ్వడంతో తాను జట్టు వీడినట్లు బహిరంగంగానే చెప్పాడు.

**నిరూపించుకునేందుకు...**

అంటే జైశ్వాల్ కెప్టెన్సీ ఆశిస్తున్నట్లుగా స్పష్టంగా అర్థమైంది. ఇక టీమిండియా టెస్ట్ జట్టు వైస్ కెప్టెన్సీ రేసులోనూ అతడు పోటీ పడుతున్నట్టుగా ఆ మధ్య ప్రచారం సాగింది. ఈ క్రమంలోనే ఇప్పుడతడు ఐపీఎల్‌లోనూ కెప్టెన్‌గా నిరూపించుకోవాలని అనుకుంటున్నాడేమోనని అంతా అనుకుంటున్నారు. రాజస్థాన్ జట్టులో సారథ్య బాధ్యతల కోసం ఆశిస్తున్నాడేమోనని అంతా భావిస్తున్నారు. కాబట్టి రియాన్ పరాగ్ తో పోటీ పడుతూ.. రాజస్థాన్ కెప్టెన్సీకి సంబంధించిన విషయాల్లో దూరుతున్నాడని కామెంట్లు చేస్తున్నారు. మరి ఇందులో నిజమెంతో తెలియాలంటే ఇంకొంత కాలం వేచి ఉండాల్సిందే.

## లీల



## ‘ఓదెల’ పార్ట్3 కూడా..

మిల్కీ బ్యూటీ తమన్నా మెయిన్ లీడ్‌లో దర్శకుడు సంపత్ నంది దర్శకత్వ పర్యవేక్షణలో దర్శకుడు అశోక్ తేజ తెరకెక్కించిన లేటెస్ట్ అవైటెడ్ చిత్రమే ఓదెల 2. తమన్నా సహా టాలెంటెడ్ నటుడు వశిష్ట నటించిన ఈ డివోషనల్ హారర్ డ్రామా నేడు థియేటర్స్ లోకి వచ్చింది. అయితే దీనికి ముందు ఆల్రెడీ ఓ సినిమా ఉన్న సంగతి తెలిసిందే. లాక్ డౌన్ సమయంలో నేరుగా ఓటిటిలో విడుదల అయ్యిన ఓదెల రైల్వే స్టేషన్ అనే సినిమా ఓటిటిలో రెస్పాన్స్ అందుకుంది. అయితే ఫైనల్ గా ఈ సినిమాకి సీక్వెల్ పార్ట్ 2 థియేటర్స్ లోకి రాగ మేకర్స్ ఫైనల్ గా ఈ సిరీస్ లో ముచ్చటగా మూడో సినిమాను కూడా అనౌన్స్ చేసేసారు. దీనితో ఓదెల 3 కూడా ఆడియెన్స్ ని అలరించేందుకు రానుంది అని చెప్పవచ్చు. మరి ఇపుడు పార్ట్ 2 రేంజ్ లో రాణిస్తుందో చూడాలి మరి. ఇక ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందించగా డి. మధు నిర్మాణం వహించారు.



## తారక్ బర్త్‌డే ట్రీట్‌గా ‘యమదొంగ’..!

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి కలయికలో చేసిన బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాల్లో తమ మొదటి ఫాంటసీ వండర్ చిత్రం యమ దొంగ కూడా ఒకటి. నిజానికి జక్కన్న నుంచి విజువల్ ఎఫెక్ట్స్ తో మగధీర సినిమా కంటే ముందే రాజమౌళి యమ దొంగ చిత్రంతో సత్తా చాటారు. ఇక ఇందులో మోహన్ బాబు సాలిడ్ పాత్రలో నటించగా అప్పట్లో సూపర్ హిట్ అయ్యింది ఈ చిత్రం. మరి ఇపుడు ఫైనల్ గా తన బర్త్ డే కానుకగా యమ దొంగ సిద్ధం అవుతున్నాడు. మరి రానున్న ఈ మే 18న సినిమా గ్రాండ గా రిలీజ్ చేసేందుకు ఇపుడు సిద్ధం అయ్యింది. మే 20న తారక్ పుట్టినరోజు కాగా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గా విడుదలకి సన్నాహాలు చేస్తున్నారు. అది కూడా ప్రింట్ 4కే లో రీ మాస్టర్ చేయడం జరిగింది. మరి ఈ సినిమాకి న్యూట్రల్స్ లో కూడా మంచి ఫ్యాన్స్ ఉన్నారు. సో ఈ చిత్రం ఎలా అలరిస్తుందో చూడాల్సిందే.



## సూర్య ‘రెట్రో’ ట్రైలర్‌కు టైమ్ ఫిక్స్

తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘రెట్రో’ వేసవి కానుకగా మే 1న వరల్డ్‌డ గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమాను దర్శకుడు కార్తీక్ సుబ్బారజ్ తెరకె క్కిస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు పెరి గాయి. ఇక ఇప్పుడు ఈ అంచనాలను రెట్టిం పు చేసేందుకు ఈ చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేసేం దుకు మేకర్స్ రెడీ అయ్యారు. ‘రెట్రో’ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను ఏప్రిల్ 18న సాయం త్రం 5 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియం లో లాంచ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ తాజాగా వెల్లడించింది. ఈ సినిమాను తొలుత అందరూ ఓ గ్యాంగ్‌స్టర్ మూవీ అని అనుకున్నారు. కానీ, ఇదొక లవ్ స్టోరీ అని.. యాక్షన్ డోస్ ఎక్కువగా ఉండే ప్రేమకథ అని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ క్లారిటీ ఇచ్చా రు. ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను 2డి ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై జ్యోతిక, సూర్య ప్రొడ్యుస్ చేస్తున్నారు.

## తెలంగాణ సంస్కృతి చాటి చెప్పేలా..

# మిస్ వరల్డ్ పోటీలు

### పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, చారిత్రక వైభవం చాటి చెప్పేలా మిస్ వరల్ పోటీలను నిర్వహించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ప్రపంచ సుందరి పోటీల నిర్వహణపై గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. విశిష్ట సంస్కృతులకు కొలువైన తెలంగాణ వైభవం ఒక్క హైదారాబాద్ నగరంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల్లో నిక్షిప్తమై ఉందని, ఆయా ప్రాంతాలకు ప్రపంచ దేశాల సుందరీమణులను తీసుకెళ్లి వాటి గొప్పతనాన్ని వివరించాలని అన్నారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, ఆధ్మాత్మిక క్షేత్రాలు, చారిత్రక కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా అందాల పోటీలను సద్వినియోగం చేసుకోవాలని దిశానిర్ధేశం చేశారు. విదేశీ పర్యాటకులను ఆకర్శించడం ద్వారా పర్యాటక రంగ అభివృద్ధి తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 20కి పైగా వేదికల్లో వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. వివిధ వేదికల్లో వేడుకలు నిర్వహిస్తున్నందున ఆయా ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని, జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలు, ఇతర అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని సుచించారు. మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సి, ఎంపిలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలను ఇందులో భాగాస్వాములను చేయాలన్నారు. ఈ సమీక్షలో పర్యాటక శాఖ సెక్రటరీ స్మితా సబర్వాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ జెండాగే హనుమంత్ కొండిబా, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ సోని బాలదేవి, యుజవన సర్వీసుల శాఖ డైరెక్టర్ వాసం వెంకటుశ్వర్లు, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు

### హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి పోలింగ్, కౌంటింగ్ అధికారులకు సూచించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఓపిఓలకు రెండో విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వ ర్‌లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి మాట్లాడుతూ పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఎన్నికలు పారదర్శకంగా, ఆరోగ్యకరమైన వాతావరణంలో సజావుగా జరిగేలా బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ సాధారణమే అయినప్పటికీ అజాగ్రత్తగా ఉండవద్దని, ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా ఎవరి బాధ్యతలు వారు సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ మొదలు ప్రక్రియ ముగిసే వరకు చేయాల్సిన ప్రక్రియను ఆయన వివరించారు. ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ అకౌంట్, పేపర్ సీల్, బ్యాలెట్ బాక్స్ ఓపెన్, సీల్ తదితర అంశాలపై పూర్తి సుశిక్షితులై ఉండాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిబంధనల ప్రకారం జరగాలని, ఎలాంటి తప్పిదాలు లేకుండా కౌంటింగ్ సిబ్బంది పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలోని అన్ని విషయాలను సమగ్రంగా అవగాహన చేసుకోవాలని తెలిపారు. శిక్షణలో భాగంగా పోలింగ్ అధికారులకు పోలింగ్ కేంద్రంలో చేయాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ మెటీరియల్స్, బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబర్ చెక్ చేసుకోవడం, ఎన్నికల నియమ నిబంధనలు, బ్యాలెట్ బాక్సుల సీల్ విధానం, సంబంధిత ఫారాలు పూరించడం, ప్రిసైడింగ్ అధికారి అధికారాలు, విధులు, పోలింగ్ అధికారుల విధులు తదితరాలను మాస్టర్ ట్రైనర్స్ వివరించారు. కౌంటింగ్ ప్రక్రియలో నిర్వర్తించాల్సిన విధులు, నియమ నిబంధనలను కౌంటింగ్ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి డాక్టర్ సునంద రాణి, మాస్టర్ ట్రైనర్లు విజయలక్ష్మి, (పిఓ యుసిడి), మమత, (ఈఈ ఎలక్ట్రికల్), పోలింగ్ పిఓలు, ఏపిఓలు, మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్ వైజర్లు, అసిస్టెంట్స్‌లు, మైక్రో అబ్జర్వర్‌లు పాల్గొన్నారు.

## రాష్ట్రపతిని నిర్దేశించలేరు

### ‘సుప్రీం’ తీర్పుపై ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: భారత న్యాయవ్యవస్థ లక్ష్యంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి, గవర్నర్లు బిల్లులు ఆమోదించడానికి గడువు నిర్ణయిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నాలుగు రోజుల తర్వాత ఉపరాష్ట్రపతి ఈ అంశంపై స్పందించారు. న్యాయవ్యవస్థను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో మాట్లాడారు. కోర్టులు రాష్ట్రపతిని నిర్దేశించే పరిస్థితి మనకు ఉండదని అన్నారు. సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలు ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 142, ‘న్యాయవ్యవస్థకు 24/7 అందుబాటులో ఉన్న ప్రజాస్వామ్య శక్తులపై అణ్వాయుధ క్షిపణిగా మారింది’ అని ఆయన అన్నారు. రాష్ట్రాల గవర్నర్లు పంపే బిల్లులపై రాష్ట్రపతి తప్పనిసరిగా మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు ఇటీవల తొలిసారి గడువు నిర్దేశించిన సంగతి తెలిసిందే. ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి కూడా జ్యుడీషియల్ రివ్యూకు కట్టుబడి ఉండాలని ఆ తీర్పులో స్పష్టం చేసింది. తమిళనాడు అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడాన్ని తప్పుపడుతూ సుప్రీంకోర్టు జడ్జిలు జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ఈమేరకు సంచలన తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 201 ప్రకారం ఒక బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి గవర్నర్ పంపినట్టయితే... దానిని రాష్ట్రపతి ఆమోదించాలి లేదా తిరస్కరించాలి. కానీ రాష్ట్రపతి ఎంత కాలంలోపు నిర్ణయం తీసుకోవాలన్నది రాజ్యాంగంలో పేర్కొనలేదు. అంత మాత్రాన రాష్ట్రపతికి ‘పాకెట్ వీటో’ అధికారం ఉందని అనుకోరాదంటూ తీర్పు చెప్పింది. అయితే, ఏదైనా ఒక బిల్లు విషయంలో రాజ్యాంగబద్ధతపై ప్రశ్నలు ఉత్పన్నమైనప్పుడు మాత్రం కార్యనిర్వాహక వ్యవస్థ కోర్టుల పాత్ర పోషించరాదని, ఆర్టికల్ 143 ప్రకారం దానిని సుప్రీంకోర్టుకు రిఫర్ చేయాలని చెప్పింది.

## చర్చకు సిద్ధం (మొదటి పేజీ తరువాయి)

అన్నారు. చర్చకు కెటిఆర్ (బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు) సిద్ధమా? అని సవాల్ విసిరారు. విలేకరుల ఆధ్వర్యంలో తాను చర్చకు రెడీ అన్నారు. గాంధీ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హెచ్‌యుసి భూముల గురించి మాట్లాడడానికి కెటిఆర్‌కి సిగ్గుండాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చాక కూడా కెటిఆర్, హరీశ్ రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాల భూములను విక్రయించారన్నారు. కెటిఆర్ తన అనునాయులకు వేల ఎకరాలను అప్పనంగా కట్టబెట్టారన్నారు. ఎకరం రూ.100 కోట్లు పలికే భూములను రూ.30 లక్షలకే విక్రయించారని ఆరోపించారు. హైకోర్టు బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి అప్పట్లో ఎన్నోసార్లు మొట్టికాయలు వేసిందన్నారు. కంచ గచ్చిబౌలి భూములను ప్రైవేట్ పరం చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. ప్రైవేట్ వ్యక్తిపరం అవుతున్న భూములను కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుకుందని తెలిపారు. హెచ్‌యుసి భూముల్లో పారిశ్రామిక ప్రగతితో 5 వేల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని అడ్డుకోవడమే బిఆర్‌ఎస్, బిజెపి నేతల పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కోర్టులు అంటే కాంగ్రెస్ పార్టీకి గౌరవం ఉందన్నారు. సాక్షాత్తు ప్రధానమంత్రి సైతం భూములకు సంబంధించి అవాస్తవాలు మాట్లాడారన్నారు. ఏఐ ఫేక్ వీడియోలు చూసి ప్రధాని మోదీ కూడా పొరపాటుపడ్డారన్నారు. ఫేక్ వీడియోలు అని తెలిశాక, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎక్స్‌లో పెట్టిన వీడియోలు తొలగించినట్లు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. రేవంత్ రెడ్డిని సిఎం పదవిని నుంచి దిగిపొమ్మటానికి కెటిఆర్‌కు సిగ్గుండాలని మండిపడ్డారు. దేశ చరిత్రలో నిలిచిపోయే సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నందుకు రేవంత్ రెడ్డి సిఎం పదవి నుంచి దిగిపోవాలా ? కెటిఆర్ ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ పార్టీలో రౌడీలకు కొదవలేదన్నారు. కవిత రౌడీ కాబట్టే ఢిల్లీ వెళ్లి లిక్కర్ దందా చేసిందని విమర్శించారు.

# భూ భారతి ఉపయోగం

(మొదటి పేజీ తరువాయి)

నిషేధిత భూములు, ఆర్‌ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతుందని అన్నారు. రైతులు తమ సొంత అవసరాలు ఆడపిల్లల పెళ్లిళ్ల ఖర్చులు నిమిత్తం వారసత్వంగా వచ్చిన భూములను అమ్ముకోవడనికి గత ధరణి 2020ఎంతో ఇబ్బందికరంగా ఉండేదని, ఇలాంటి లోటుపాట్లను గుర్తించిన ప్రభుత్వం ప్రజలకు సరళంగా ఉండే విధంగా భూభారతి చట్టం తెచ్చిందని అన్నారు. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామన్న మాటకు కట్టుబడి రైతులకు అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా, సామాన్య గ్రామీణ ప్రజల కు అర్థం అయ్యేలా రూపొందించడం జరిగింది అన్నారు. ప్రజలు కార్యాలయల చూట్టు తిరుగకుండా ప్రజల వద్దకు అధికారులు వస్తారని అన్నారు. భూ సమస్య పరిష్కరం కోసం రోజుకు రెండు మండలాల చొప్పున అధికారులు పర్యటిస్తారని, అలాగే ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు శిథిలావస్థలో ఉన్న పరిగి తహసీల్దార్ నూతన కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజురు చేయనున్నట్లు , నిర్మాణ పనులు చేపట్టాల్సిందిగా మంత్రి తెలిపారు. స్పీకర్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా దేశానికి దిశానిర్దేశం చేసిన రాజ్యాంగ నిర్మాత, భారతరత్న అంబేద్కర్ పుట్టిన రోజు భూ భారతి అమలులోకి రావడం నిజంగా గొప్ప విషయం అన్నారు. భూ భారతి అమలుతో రాష్టంలో 70లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. భూ భారతిలో ఎవ్వరిదగ్గరికి పైరవీలకోసం పోవాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలో రైతుల కోసం 54 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసిందని, దేశ చరిత్రలో మొదటి సారిగా 25లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రుణాలను మాఫీ చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , ఆర్‌ఓఆర్ చట్టం పై ప్రజలకు తెలియజేశారు.

## తక్షణం చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

చందన్‌పాల్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇ.టి.నరసింహ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అన్వేష్, మాజీ ఎంఎల్‌సి రాములు నాయక్, మాజీ మంత్రి రవీంద్ర నాయక్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకిరాం, ఆర్‌జెడి నాయకులు రాములు యాదవ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్యాక్రాంతమైన లక్షలాది ఎకరాల భూదాన్ భూములను వెంటనే స్వాధీనం చేసుకుని, వాటిని నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలన్నారు. సయ్యద్ అజీజ్‌పాషా మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో భూపోరాటాలు నిర్వహించి, వేలాది మంది నిరుపేదలకు గుడిసెలు వేయించామని వివరించారు. వినోబా భావే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఇ.టి.నరసింహ మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వం భూదాన్ భూముల వ్యవహారాన్ని సిపిఎల్‌ఎకు అప్పగించిందన్నా. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా పేదలకు 100 గజాల ఇంటి స్థలాన్ని పంపిణీ చేయలేదన్నారు. భూదాన్ భూములు పేదలకు దక్కేంత వరకు సిపిఐ ఉద్యమిస్తుందని చెప్పారు. చందన్‌పాల్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో భూదాన్ భూములను ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆచార్య వినోబా భావే ‘భూదాన్ ఉద్యమాన్ని పాఠ్యంశాల్లో చేర్చాలని, ప్రతి ఏటా ‘భూదాన్ డే’ను సామాజికహితంగా ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరారు. ప్రసాద్, తెలంగాణ, ఎపి సర్వోదయ మండల్ అధ్యక్షులు ఆర్.శంకర్ నాయక్, ఎన్.రాంబాబు నాయుడు మాట్లాడుతూ నిరుపేదలకు భూమి పంపిణీ చేయాలనే లక్ష్యంతో ఆచార్య వినోబా బావే 1951 ఏప్రిల్ 18న భూదాన్ జైత్రయాత్రకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 1965 ‘భూదాన్ – గ్రామదాన్’ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత మహేశ్, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, సర్వోదయ మండల్ మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్ ఫరీద్, దక్షిణ తెలంగాణ ఇన్‌చార్జి ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com